సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18+6 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 356
శనివారం 18-3-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | CHENNAI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

పరమ పావన గంగానది పుష్కరాలకు వెళ్ళండి పునీతులు కండి.

గంగా పుష్కరాలు స్పెషల్ యాత్రలు

3N / 4Days మరియు 6N / 7Days ఫ్లైట్ ప్యాకేజీలు కలవు.

✆ 9121143964, 9100090934

ముక్తినాథ్ యాత్రతో గంగా పుష్కరాలు స్పెషల్ యాత్ర

12N / 13Days స్పెషల్ ఫ్లైట్ ప్యాకేజీలు కలవు.

✆ 9100090938, 9177333630

చార్‌దాం యాత్ర

13N / 14Days స్పెషల్ ఫ్లైట్ ప్యాకేజీలు కలవు.

✆ 9177333684, 9177333615

అమర్‌నాద్ యాత్ర

13N / 14Days స్పెషల్ ఫ్లైట్ ప్యాకేజీలు కలవు.

✆ 9177333620, 9100090295

HOLIDAY PACKAGES

DOMESTIC TOURS PACKAGE

సిమ్లా-మనాలి టూర్, కాశ్మీర్-శ్రీనగర్ టూర్, గ్యాంగ్‌టక్-డార్జిలింగ్ టూర్, గౌహతి, చిరపుంజి, షిల్లాంగ్ టూర్, కేరళ-మున్నార్ టూర్.

✆ 9121143958, 9154242803

INTERNATIONAL TOURS PACKAGE

సింగపూర్, మలేసియా, దుబాయ్ టూర్, కంబోడియా, వియాత్నం, శ్రీలంక టూర్, బాకు స్పెషల్ టూర్, బాలి స్పెషల్ టూర్, మాల్దీవ్స్, యూరప్ స్పెషల్ టూర్స్.

✆ 7032666928, 9177333632

బ్యాంకాక్-పట్టాయ స్పెషల్ టూర్స్

3N / 4Days

Ex. Hyderabad

Rs. 34,999/-

R.V. TOURS AND TRAVELS PRIVATE LIMITED

HYDERABAD | VIJAYAWADA | VISHAKAPATNAM | TIRUPATI

Cell : 9100090875, 9177333673, 7032666922, 9121144001




'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 356

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

హామీలు అమలు చేయండి

ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వినతి

- పెండింగ్‌లో ఉన్న విభజన అంశాలను పరిష్కరించండి
- రిసోర్స్ గ్యాప్ కింద ఇవ్వాల్సిన రూ.36,625 కోట్లు చెల్లించేలా ఆదేశాలివ్వండి
- పోలవరం ప్రాజెక్టు సత్వర పూర్తికి రూ.10 వేల కోట్లు విడుదల చెయ్యండి
- కడప స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించండి

7లో

- పార్లమెంటులో ప్రధానితో భేటీ.. 45 నిమిషాల పాటు సాగిన సమావేశం
- రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని పునరుద్ఘాటన
- ఏపీకి సంబంధించిన ఇతర అంశాలపై విజ్ఞాపన పత్రం
- అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోనూ సీఎం భేటీ


ఢిల్లీలో ప్రధాని మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

పశుసంవర్ధక శాఖకు స్కోచ్ అవార్డుల పంట

- వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాలకు సిల్వర్ స్కోచ్..
- వెటర్నరీ టెలి మెడిసిన్ కాల్ సెంటర్, పశు వ్యాధుల నిర్ధారణ ల్యాబ్స్, ఆంధ్ర గో పుష్టి కేంద్రాలకు స్కోచ్ మెరిట్ అవార్డులు
- గతంలో ఎన్నడూలేని రీతిలో గుర్తింపు

12లో

జై కొట్టిన టీచర్లు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హవా

- రాయలసీమ పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో విజయం
- టీడీపీ మద్దతు ఇచ్చిన పీడీఎఫ్ అభ్యర్థులు ఘోర పరాజయం
- ఈ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులు గెలవడం ఇదే ప్రథమం
- విజేతలకు డిక్లరేషన్ అందజేసిన రిటర్నింగ్ అధికారులు

10లో


ఎంవీ రామచంద్రారెడ్డి


పి. చంద్రశేఖరరెడ్డి

కొనసాగుతున్న పట్టభద్రుల ఓట్ల లెక్కింపు

10లో

టీడీపీ కట్టల్లోకి వైఎస్సార్‌సీపీ ఓట్లు!

మండలి ప్రశ్నోత్తరాలు

మూడున్నరేళ్లలో పింఛన్లకు రూ.66,823.58 కోట్లు

సాక్షి, అమరావతి: శాసన మండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా పలు ప్రశ్నలకు ఆయా శాఖల మంత్రులు సమాధానాలిచ్చారు. వారి సమాధానాలు ఈ విధంగా ఉన్నాయి..

వైద్య శాఖలో రికార్డు స్థాయిలో పోస్టుల భర్తీ



సీఎం జగన్ ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో తీర్చిదిద్దారు. మూడున్నరేళ్లలో వైద్య శాఖలో రికార్డు స్థాయిలో 48,639 పోస్టులను భర్తీ చేశాం. ప్రభుత్వం భర్తీ చేసిన పోస్టుల్లో 3,899 మంది సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు, 2,088 మంది ఇతర వైద్యాధికారులు (డాక్టర్లు) ఉన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి నెలలో రెండు సార్లు పీహెచ్‌సీ డాక్టర్లు అన్ని గ్రామాల్లోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను సందర్శించి స్థానికులకు వైద్య సేవలు అందిస్తారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 2,262 ఆస్పత్రులను నెట్‌వర్క్ ఆస్పత్రుల జాబితాల్లో చేర్చడంతో పాటు.. ఈ పథకం కింద చికిత్స అందించే వ్యాధుల సంఖ్య గణనీయంగా పెంచాం.
– విడదల రజిని, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి

ఆదాయం లేని ఆలయాల్లోనూ నిత్య పూజలు



గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం లేని ఆలయాల్లోనూ స్వామివారికి నిత్య పూజల నిర్వహణకు దేవదాయ శాఖ ఆర్థిక సాయం అందిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 4,603 ఆలయాల్లో ధూప దీప నైవేద్య కార్యక్రమాల కోసం అక్కడి పూజారులకు ప్రతి నెలా సాయం చేస్తోంది. 2019 నుంచి ఇప్పటి వరకు ఈ పథకానికి రూ.56.96 కోట్లు ఖర్చు చేసింది.
– కొట్టు సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి(దేవదాయ శాఖ)

జగన్ సీఎం అయ్యాక 24.69 లక్షల మందికి కొత్తగా పింఛన్లు



వైఎస్ జగన్ సీఎం అయ్యాక రాష్ట్రంలో కొత్తగా 24,69,765 మందికి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసింది. 2019 జూన్ నుంచి ఇప్పటి వరకు కేవలం మూడున్నరేళ్లలోనే ప్రభుత్వం రూ.66,823.58 కోట్లను పింఛన్ల పంపిణీకి ఖర్చు చేసింది.
– బూడి ముత్యాలనాయుడు, ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ)

దళారీలు లేకుండా పంట కొనుగోలు



దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బీకే) ద్వారా రైతుల నుంచి పంట కొనుగోలు చేసే విధానాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారు. కొనుగోలు చేసిన పంటకు సంబంధించి డబ్బులను కూడా ఆన్‌లైన్ విధానంలో నిర్దీత సమయంలోగా రైతు ఖాతాల్లో జమ చేస్తున్నాం. – కారుమూరి వెంకటనాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ

మీడియా పాయింట్

ఏమోలే అనుకున్నా గానీ..



పాదయాత్రలో జగన్ సంక్షేమ పథకాలు ప్రకటిస్తుంటే అవన్నీ ఎలా అమలు చేస్తారని భయపడ్డాను. మేనిఫెస్టోను ఓ పవిత్ర గ్రంథంగా చూస్తానని జగన్ అంటుంటే.. ఏమోలే అనుకున్నా. కానీ ఆయనతో పాటు మేమూ అలానే చూసేలా చేశారు. దాదాపుగా హామీలన్నింటినీ అమలు చేసి చూపుతున్నారు. పార్టీ ఎమ్మెల్యేగా కంటే ఓ పౌరుడిగా జగన్‌ను ఇష్టపడుతున్నాను.
– వెలగపల్లి వరప్రసాదరావు, ఎమ్మెల్యే

మహిళలకు అగ్రస్థానం

పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను సీఎం జగన్ నిజం చేస్తున్నారు. అమ్మ ఒడి, చేయూత, ఆసరా పథకాలను మహిళలు, వారి పిల్లల కోసం అమలు చేస్తున్నారు. బడ్జెట్‌లోనూ మహిళా సంక్షేమానికి అత్యధిక కేటాయింపులిచ్చారు. ఇది పేదరిక నిర్మూలన కోసం సీఎం జగన్ ఇచ్చిన ప్రగతి బడ్జెట్.
– పోతుల సునీత, ఎమ్మెల్సీ

సమయం సరిపోవడం లేదు..



రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదు. ప్రశ్నోత్తరాలకు సమయం సరిపోవడం లేదు. ఇంకా ఎక్కువ ఇవ్వాలి. మేం అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా వాయిదా వేసేస్తున్నారు. మోడల్ స్కూళ్లలో కారుణ్య నియామకాలు చేపట్టాలి.
– ఐ.వెంకటేశ్వరరావు, కేఎస్ లక్ష్మణరావు, షేక్ షాబ్జీ, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు

ఈ వైద్యం.. గూగుల్ 'నైవేద్యం'



- ఆరోగ్య సమస్యలపై 'నెట్'లో బాధితులు విపరీతంగా వెతుకులాట
- డాక్టర్ దగ్గరకు వెళ్లకముందే రోగంపై నిర్ధారణ
- ఆ తర్వాతే వైద్యునితో సంప్రదింపులు
- ఇక డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌లోని ప్రతి మందు గురించి కూడా 'సెర్చ్'
- అక్కడ కనిపించే దుష్ఫలితాలు చూసి డాక్టర్ ఇచ్చే మందులను వాడని వైనం
- దీంతో కొత్త సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు
- ఇలా అయితే అసలుకే మోసమంటున్న వైద్యులు
- కరోనా తదనంతరం ప్రజల్లో నయా ట్రెండ్

లబ్బీపేట (విజయవాడ తూర్పు): సాధారణంగా ఒంట్లో నలతగా ఉంటే ఏం చేస్తాం.. డాక్టర్ దగ్గరకు వెళ్లి సమస్యను చెప్పుకుంటాం. బాధితుడు చెప్పిన లక్షణాల ఆధారంగా ఆయన అందుకు అవసరమైన మందులు రాసి వాడమంటారు. ఆ తర్వాత ఫార్మసీకి వెళ్లి వాటిని కొనుక్కుని వాడుతుంటాం. ఇది రివాజు.

కానీ, ఇప్పుడు నయా ట్రెండ్ మొదలైంది. డాక్టర్ స్థానంలో గూగుల్ వచ్చి చేరింది. జనాలకు ఏ ఇబ్బంది వచ్చినా ముందుగా గూగుల్‌లో ఆ లక్షణాలను సెర్చ్ చేసేసి అది ఏ రోగమో తెలుసుకుని ఆ తర్వాత డాక్టర్ దగ్గరికి వెళ్లి తమకు ఫలానా రోగం ఉంది.. వైద్యం చేయమంటున్నారు. కరోనా తదనంతర కాలంలో యువత, విద్యావంతుల్లో ఈ తరహా సంస్కృతి పెరిగిపోతోందని వైద్యులంటున్నారు. ఈ సింద్రోమ్‌ను 'ఇంటర్నెట్ డిరైవ్డ్ ఇన్ఫర్మేషన్ అబ్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్' అని సంబోధిస్తారని డాక్టర్లు చెబుతున్నారు. ఆరోగ్యంపట్ల అతిగా ఆదుర్దా పడడం.. అనవసరంగా దీని గురించి నెట్‌లో సెర్చ్ చేయడం ఈ సింద్రోమ్ ప్రధాన లక్షణం. ఈ సమస్యతో బాధపడుతున్న వారు ఇటీవల కాలంలో ఎక్కువవుతున్నారు. అంతేకాదు.. వైద్యుడు మందులు రాసిన తర్వాత కూడా వాటి గురించి గూగుల్‌లో వెతుకుతున్నారు. అక్కడ చూపించే దుష్ఫలితాలను చూసి మందులు వాడకుండా మానేస్తున్నారని.. ఇలాంటివి కోవిడ్ సమయంలో ఎక్కువగా జరిగినట్లు వైద్యులంటున్నారు. ఇంటర్నెట్ బాగా విస్తృతమవడంతో ప్రజల్లో కూడా ఈ తరహా వెతుకులాట ఎక్కువైందని వారు అభిప్రాయపడుతున్నారు.

కొత్త సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు

ఇక ఇలా ప్రతి విషయాన్ని గూగుల్‌లో సెర్చ్ చేయడం ద్వారా ప్రజలు కొత్త సమస్యలను కొనితెచ్చుకుంటున్నారని డాక్టర్లు చెబుతున్నారు. మందులు, జబ్బు విషయంలో ఏదైనా సందేహం ఉంటే వైద్యుడిని అడిగి నివృత్తి చేసుకోవాలే కానీ, గూగుల్‌లో వెతకడం సరైన విధానం కాదని వారంటున్నారు. ఒక రకం మందు లక్ష మంది వాడితే వారిలో ఒకరికో ఇద్దరికో దుష్ఫలితాలు కనపడినా గూగుల్‌లో పెడుతుంటారని, దానిని చూసి మందు వాడకుంటే, జబ్బు ముదిరి ప్రాణాల మీదకు వస్తుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. చివరికి జ్వరానికి వాడే క్రోసిన్‌కు కూడా దుష్ఫలితాలు ఉన్నట్లు గూగుల్‌లో చూస్తారని, వైద్యులు అంటున్నారు. ఇది మంచి పద్ధతి కాదని మానసిక వైద్యులు సూచిస్తున్నారు.

అవసరం మేరకు టెక్నాలజీని వాడుకోవాలి



ఇంటర్నెట్ టెక్నాలజీని అవసరం మేరకు మాత్రమే వాడుకోవాలి. అంతేకానీ, జబ్బు చేసినప్పుడు వైద్యుడిని సంప్రదించకుండా గూగుల్‌లో చూసి మందులు వాడటం, గూగుల్‌లో చూసి జబ్బును నిర్ధారించడం సరైన పద్ధతి కాదు. అలాగే, వైద్యుడు రాసిన మందులను సైతం గూగుల్‌లో సెర్చ్‌చేసి, అక్కడున్న దుష్ఫలితాలను చూసి మందులు వాడటం మానేస్తున్నారు. దీంతో జబ్బు ముదిరి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కోవిడ్ సమయంలో ఇలాంటి ఘటనలు ఎక్కువుగా చూశాం. ఏదైనా సమస్య ఉంటే వైద్యుడిని సంప్రదించి పరిష్కరించుకోవాలి.
– డాక్టర్ గర్రే శంకరరావు, సైకాలజిస్ట్, విజయవాడ

జబ్బును నిర్ధారించేది వైద్యుడే



ఏదైనా సమస్యతో వైద్యుని వద్దకు వచ్చే రోగి, తనకున్న రోగం ఏమిటో చెప్పేస్తున్నారు. గూగుల్‌లో చూశామండి.. దానికి చికిత్స అందించమని అడుగుతున్నారు. అసలు లక్షణాలు చెప్పమంటే ఏదేదో చెబుతున్నారు. ఇది సరైన విధానం కాదు. గూగుల్‌లో అంతా ఖచ్చితమైన సమాచారం ఉంటుందని చెప్పలేం. ఎవరి అనుభవాలనైనా దానిలో షేర్ చేసుకోవచ్చు. వాటిని చూసి తమకూ అలా జరుగుతుందని భావించడం సరైన విధానం కాదు. పారాసిటమాల్ మందుకు కూడా సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నట్లు గూగుల్‌లో చూపుతుంది. కానీ, వైద్యులు దానిని కామన్ మందుగా సిఫార్సు చేస్తారు. గూగుల్‌తో కొత్త సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు.
– డాక్టర్ విశాల్‌రెడ్డి ఇంధ్ల, మానసిక వైద్య నిపుణులు

మార్గదర్శి మోసాలపై పూర్తిస్థాయి ఆడిట్

- చిట్ ఆడిటర్‌ను నియమించిన రిజిస్ట్రేషన్ల శాఖ
- అవకతవకలపై ఇప్పటికే ప్రాథమిక ఆడిటింగ్
- భారీ ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తింపు
- త్వరలో మార్గదర్శి బ్రాంచిల్లో పూర్తిస్థాయి ఆడిటింగ్



సాక్షి, అమరావతి: చిట్టీల ముసుగులో భారీ అవకతవకలకు పాల్పడిన మార్గదర్శి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పూర్తిస్థాయి ఆడిటింగ్ నిర్వహించాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించింది. ఇందుకోసం 1982 చిట్‌ఫండ్ చట్టం సెక్షన్ 61(2) ప్రకారం చిట్ ఆడిటర్‌ను నియమించారు. రాష్ట్రంలో మార్గదర్శికి చెందిన 37 బ్రాంచ్‌ల్లో చిట్ ఆడిటర్ పూర్తి స్థాయి ఆడిటింగ్ నిర్వహించి రిజిస్ట్రేషన్ల శాఖకు నివేదిక సమర్పించనున్నారు. మార్గదర్శిలో జరిగిన అవకతవకలు, మోసాలపై ఇప్పటికే చార్టెడ్ అకౌంటెంట్‌తో ఆడిటింగ్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న మార్గదర్శి ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్, బ్యాంక్ ఖాతాలను పరిశీలించిన అనంతరం చిట్‌ఫండ్ నిధులను చట్ట విరుద్ధంగా అనుబంధ కంపెనీలకు మళ్లించినట్లు గుర్తించారు. మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీలు, ఈక్విటీ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో పెట్టుబడులు పెట్టినట్లు నిర్ధారించారు. ఇవేకాకుండా ఇంకా పలు తీవ్ర స్థాయి ఉల్లంఘనలను గుర్తించడంతో పూర్తి స్థాయి ఆడిటింగ్ నిర్వహించాలని చార్టెడ్ అకౌంటెంట్ సిఫారసు చేశారు. అప్పుడే మార్గదర్శిలో జరిగిన మోసాలన్నీ బయటకు వచ్చే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో పూర్తి స్థాయి ఆడిటింగ్ నిర్వహించేందుకు వీలుగా చిట్ ఆడిటర్‌ను నియమిస్తూ రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

వరుసగా ఫిర్యాదులు..

అనుబంధ కంపెనీలకు చిట్టీల నిధులను మళ్లించి ఆర్థిక నేరాలకు పాల్పడినట్లు రిజిస్ట్రేషన్ల శాఖ ఇచ్చిన ఫిర్యాదులతో రాష్ట్రంలోని ఏడు మార్గదర్శి బ్రాంచీల్లో సీఐడీ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. అక్రమాలు జరిగినట్లు స్పష్టమవడంతో మార్గదర్శి చైర్మన్ చెరుకూరి రామోజీరావు ఏ1గా, ఎండీ చెరుకూరి శైలజ ఏ2గా, ఏ3గా మార్గదర్శి మేనేజర్లపై (ఫోర్‌మెన్లు) కేసులు నమోదయ్యాయి. నలుగురు మేనేజర్లను అరెస్టు చేయగా న్యాయస్థానం ముగ్గురికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది. అవకతవకలపై మార్గదర్శి ఖాతాదారులు, డిపాజిట్‌దారుల నుంచి సీఐడీకి వరుసగా ఫిర్యాదులు అందుతుండడంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ల శాఖ పూర్తి స్థాయి ఆడిటింగ్ నిర్వహణకు చిట్ ఆడిటర్‌ను నియమించింది.

'ఆప్కో స్కామ్'లో ప్రాసిక్యూషన్‌కు ఓకే

- గుజ్జల శ్రీను, కుటుంబ సభ్యులు, ఇతరుల పిటిషన్లు కొట్టివేత
- ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వం అనుమతించడం సరైన చర్యే
- వర్తించే చట్టాల గురించి కింది కోర్టే తేలుస్తుంది
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు తీర్పు



సాక్షి, అమరావతి: రూ.వందల కోట్ల ఆప్కో కుంభకోణంలో సంస్థ మాజీ చైర్మన్ గుజ్జల శ్రీను, ఆయన కుటుంబ సభ్యులతోపాటు మరికొందరికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తమపై సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, ప్రాసిక్యూషన్‌కు అనుమతినిస్తూ ప్రభుత్వం జీవో ఇవ్వడం సరికాదని వారు దాఖలు చేసిన క్రిమినల్ పిటిషన్లను హైకోర్టు కొట్టి వేసింది. గుజ్జల శ్రీను ప్రాసిక్యూషన్‌కు అనుమతినిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు సరైనవేనని స్పష్టం చేసింది. కేవలం రిజిస్ట్రార్‌కు మాత్రమే ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చే అధికారం ఉందన్న వాదనను తోసిపుచ్చింది. రిజిస్ట్రార్ విధులను ప్రభుత్వం నిర్వర్తించవచ్చని, ప్రాసిక్యూషన్‌కు అనుమతినిస్తూ జీవో జారీ చేయడంలో ఎలాంటి దోషం లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు సీఐడీ న్యాయవాది వై.శివకల్పనారెడ్డి వాదనతో న్యాయస్థానం ఏకీభవిస్తూ ఉత్తర్వులిచ్చింది. తమపై అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13 కింద నమోదు చేసిన కేసు చెల్లదని, ఈ కేసును విచారణకు స్వీకరించడం ద్వారా కింది కోర్టు యాంత్రికంగా వ్యవహరించిందన్న గుజ్జల శ్రీను తదితరుల వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషనర్లపై నమోదైన నేరాలు ఏపీ కోఆపరేటివ్ సొసైటీస్ చట్టంలోని సెక్షన్ 79 పరిధిలోకి మాత్రమే వస్తాయా? కొన్ని నేరాలు ఐపీసీ కిందకు వస్తాయా? లేక పీసీ యాక్ట్ కిందకు వస్తాయా? అనే విషయాలు కింది కోర్టు విచారణలో తేలుతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు శుక్రవారం తీర్పు వెలువరించారు.

రూ.250 కోట్ల నిధులు స్వాహా..

గుజ్జల శ్రీను ఆప్కో చైర్మన్‌గా ఉన్నప్పుడు చేనేత కార్మికుల పేర్లతో తప్పుడు ఖాతాలు, నకిలీ సంఘాలను సృష్టించి దాదాపు రూ.250 కోట్ల మేర నిధులను దుర్వినియోగం చేసినట్లు అభియోగాలున్నాయి. దీనిపై 2020లో ఆప్కో ఎండీ ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇదే సమయంలో స్వాహా పర్వంపై సీఐడీకి ఫిర్యాదులు అందడంతో శ్రీను, ఆయన కుటుంబ సభ్యులతోపాటు మరికొందరిపై 2020లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. అనంతరం చార్జిషీట్ దాఖలు చేసింది. దాదాపు రూ.250 కోట్ల మేర నిధులు దుర్వినియోగం చేసినట్లు తేల్చింది. ఈ కేసును ప్రస్తుతం కర్నూలు ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారిస్తోంది. ఈ నేపథ్యంలో తమపై సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ గుజ్జల శ్రీను, తదితరులు గతేడాది హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసులో తన తరఫున వాదనలు వినిపించేందుకు గంటకు రూ.లక్షల్లో ఫీజు తీసుకునే సుప్రీంకోర్టు ప్రముఖ సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూత్రాను శ్రీను నియమించుకున్నారు. ఆయనతో పాటు హైకోర్టు సీనియర్ న్యాయవాది డీవీ సీతారామ్మూర్తి సైతం వాదనలు వినిపించారు. పిటిషనర్లపై నమోదైన కేసులు కోఆపరేటివ్ చట్టం పరిధిలోకి మాత్రమే వస్తాయని, ఆ చట్టం కింద మాత్రమే విచారణ జరపాల్సి ఉంటుందని, ఐపీసీ సెక్షన్ల కింద కాదని వాదించారు. ఆప్కో చైర్మన్‌గా ఎలాంటి నిధుల దుర్వినియోగానికి పాల్పడలేదన్నారు.

ఆప్కో చైర్మన్ పబ్లిక్ సర్వెంటే..

సీఐడీ తరఫున వై.శివకల్పనారెడ్డి వాదనలు వినిపిస్తూ ఆప్కో చైర్మన్ పబ్లిక్ సర్వెంట్ కిందకే వస్తారని, అందువల్లే గుజ్జల శ్రీనుపై పీసీ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. నకిలీ సంఘాలను సృష్టించి దారిమళ్లించిన నిధులతో గుజ్జల శ్రీను పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టారని, ఒక్క కడపలోనే 89 స్థిరాస్తులున్నాయని కోర్టుకు నివేదించారు. 174 మంది సాక్షులతో చార్జిషీట్ దాఖలు చేశామని, ప్రస్తుతం విచారణ జరుగుతున్నందున ఈ వ్యాజ్యాలను కొట్టివేయాలని కోరారు. ఇరు పక్షాల వాదనలు విని తీర్పు రిజర్వ్ చేసిన జస్టిస్ రఘునందన్‌రావు తాజాగా నిర్ణయాన్ని వెలువరించారు. సీఐడీ నమోదు చేసిన కేసులను కొట్టివేసేందుకు నిరాకరిస్తూ శ్రీను తదితరుల పిటిషన్లను తిరస్కరించారు. మరోవైపు తమ ఆస్తులు జప్తు చేసేలా కర్నూలు ఏసీబీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ గుజ్జల శ్రీను, కుటుంబ సభ్యులు దాఖలు చేసిన అప్పీల్‌పైనా తీర్పునిచ్చారు. గుజ్జల శ్రీను తండ్రి రామకృష్ణయ్య చనిపోయిన నేపథ్యంలో ఆయన ఆస్తుల జప్తు చెల్లదని న్యాయమూర్తి స్పష్టం చేశారు.



బిందాస్‌గా 100 ఏళ్లు

బ్లూ జోన్స్

ఎక్కడైనా మనుషులు సగటున 60–70 ఏళ్లు బతుకుతారు. కొందరైతే వందేళ్లు పూర్తి చేసుకుంటారు. కానీ భూమ్మీద కొన్ని ప్రాంతాల్లో మాత్రం జనం మిగతా అన్ని చోట్ల కన్నా ఎక్కువ కాలం జీవిస్తారు. అవే 'బ్లూ జోన్స్'. మరి ప్రాంతాలేవి? ఎక్కువ కాలం బతకడానికి కారణాలేమిటి, వారి ఆహార అలవాట్లు ఏమిటో తెలుసుకుందామా..

– సాక్షి సెంట్రల్ డెస్క్



'ఆయుర్దాయం'పై అన్వేషణలో..

ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ వయసున్నవారు, ఆరోగ్యంగా ఎక్కువకాలం జీవిస్తున్న వారు ఉండే ప్రాంతాలను 'బ్లూ జోన్'లుగా పిలుస్తున్నారు. అమెరికాకు చెందిన అన్వేషకుడు, రచయిత డాన్ బ్యూట్నర్ ఈ పేరు పెట్టారు. ప్రపంచంలో ఎక్కువ ఆయుర్దాయం ఉన్న జన సమూహాలు, వాటి మధ్య పోలికలను గుర్తించేందుకు నేషనల్ జియోగ్రఫిక్ చానల్, ఇతర నిపుణులు నిర్వహించిన అన్వేషణ కార్యక్రమానికి డాన్ బ్యూట్నర్ నేతృత్వం వహించారు. తమ అధ్యయనంలో పలు 'బ్లూ జోన్'లను గుర్తించి ఆ వివరాలను నివేదికగా విడుదల చేశారు.

కనీసం.. పదేళ్లు ఎక్కువే..



అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న లోమా లిండా ప్రాంతం బ్లూజోన్లలో ఒకటి. ఇక్కడ నివసించే 'సెవంత్ డే అడ్వెంటిస్ట్స్' ఆధ్యాత్మిక బృందం సభ్యులు.. సగటు అమెరికన్ల కంటే కనీసం పదేళ్లు ఎక్కువకాలం జీవిస్తారు. పూర్తిగా శాకాహారులు. మద్యపానానికి దూరంగా ఉంటారు.

సింపుల్‌గా.. 90 ఏళ్లు..

కోస్టారికాలోని నికోయా ద్వీపకల్ప ప్రాంత ప్రజల్లో చాలా మంది 90 ఏళ్ల వరకు చలాకీగా బతికేస్తారు. ఆధ్యాత్మికత, కుటుంబానికి ప్రాధాన్యతనిస్తూ.. శారీరక శ్రమతో కూడిన జీవన శైలిని అనుసరిస్తారు. చికెన్, చేపలు, బీఫ్, బీన్స్, అన్నం ప్రధాన ఆహారం. అయితే రిఫైన్డ్, ప్రాసెస్ చేసిన ఫుడ్‌కు పూర్తి దూరంగా ఉంటారు.

ఆయుష్షులో.. మహిళామణులు

జపాన్‌లోని ఒకినావా ద్వీపం ప్రపంచంలో అత్యధికకాలం జీవించే మహిళలకు (వందేళ్లదాకా) కేంద్రం. జపాన్, అమెరికాలతో పోల్చితే.. ఒకినావా వాసులకు వృద్ధాప్యంతో వచ్చే సమస్యలు, గుండె జబ్బులు, కేన్సర్లు బాగా తక్కువ అని అధ్యయనాల్లో తేలింది.



ఆయుష్షులో.. 'మగా'నుభావులు..

ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలు/ప్రాంతాలతో పోల్చితే.. ఇటలీలోని సార్డీనియా ద్వీపంలో పురుషులు అత్యధిక కాలం (వందేళ్ల దాకా) జీవిస్తారు. చాలా వరకు శాకాహారం, ప్రకృతిలో మమేకమై, శారీరక శ్రమతో కూడిన జీవన శైలిని అనుసరిస్తారు.

సామాజిక జీవనం.. చిన్న కునుకు..

ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించే జనానికి గ్రీస్‌లోని ఇకారియా ద్వీపం కేరాఫ్ అడ్రస్. ఇక్కడ 90ఏళ్లు పైబడిన ప్రతి పది మందిలో ఆరుగురు ఇప్పటికీ వ్యవసాయం, వృత్తి పనులు చేస్తుంటారని అధ్యయనంలో గుర్తించారు. వీరిలోనూ శాకాహారం, శారీరక శ్రమ మామూలే అయినా.. బంధుమిత్రులతో కలసి గడిపే/పనిచేసే సామాజిక జీవనశైలి, మధ్యాహ్నం పూట చిన్నకునుకు తీసే అలవాటు ప్రత్యేకం.

'బ్లూజోన్'లలో దీర్ఘాయుష్షు వీటితోనే..



- బ్లూజోన్లుగా గుర్తించిన అన్ని ప్రాంతాల్లో కామన్‌గా కనిపించిన లక్షణం.. అంతా ఇంటి పనులు, ఇతర శారీరక శ్రమలో నిమగ్నమై ఉండటం.
- క్రమశిక్షణతో కూడిన జీవన విధానం, ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయడం.
- కుటుంబ బంధాలు, సామాజిక జీవనానికి, పెద్ద వయసు వారికి తోడుగా నిలవడానికి ప్రాధాన్యత. ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం, మత సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొనడం.
- మధ్యాహ్నం కాసేపు కునుకు తీయడం, ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకోవడం.
- మితంగా తినడం, వీలైనంత వరకు శాకాహారానికి పరిమితం కావడం, ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండటం.
- కొన్ని బ్లూజోన్లలో వైన్ రూపంలో స్వల్ప స్థాయిలో మద్యం అలవాటు కూడా ఉంది.

ఆటో–కారు ఢీ ఆరుగురు దుర్మరణం

మరో ముగ్గురికి తీవ్రగాయాలు.. చిన్నారి పరిస్థితి విషమం
శ్రీ సత్యసాయి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం



సంఘటనా స్థలంలో పడివున్న మృతదేహాలు

బత్తలపల్లి: శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం పోట్లమర్రి సమీపంలో ధర్మవరం–బత్తలపల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడగా.. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి..

బత్తలపల్లి నుంచి ధర్మవరానికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో.. ధర్మవరం నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న కారు పోట్లమర్రి సమీపంలోకి వచ్చేసరికి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు అయ్యింది. అందులో ప్రయాణిస్తున్న పోట్లమర్రి గ్రామానికి చెందిన బత్తల మల్లేసు (48), గొట్లూరు గ్రామానికి చెందిన దాసరి ఈశ్వరయ్య (45), ధర్మవరం పట్టణం కొత్తపేటకు చెందిన హాజీపీరా (52), ముదిగుబ్బ మండలం నల్లయ్యకుంటపల్లికి చెందిన గాలి నారాయణస్వామి (49), ధర్మవరం పట్టణం శివానగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నరసింహులు (41) అక్కడికక్కడే మృతిచెందారు. ఓ గుర్తు తెలియని వ్యక్తి (49) తీవ్రగాయాలతో ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ధర్మవరం పట్టణానికి చెందిన రంగస్వామి, కారు డ్రైవర్ కుమార్ నరసింహులు, ఐదేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడ్డారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల వద్ద ఉన్న ఆధార్‌కార్డుల ఆధారంగా పలువురిని గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే ధర్మవరం రూరల్ సీఐ మన్సూరుద్దీన్, బత్తలపల్లి ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రమాదం కారణంగా రోడ్డుకిరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డిలు మృతదేహాలను వాహనాల్లోకి ఎక్కించి పోలీసులకు సహకరించారు. ఇక ఈ ప్రమాదంలో మృతులందరూ కూలి పనులు చేసుకుని కుటుంబాలను పోషించుకునే వారే.

ఆటోడ్రైవర్‌దే తప్పిదం..

ప్రమాదానికి కారణం ఆటోడ్రైవర్ తప్పిదమేనని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఆటో డ్రైవర్ ఉన్నట్టుండి కారు వస్తున్న వైపు తిప్పడంతో కారును డ్రైవర్ నియంత్రించలేకపోయాడని, ఫలితంగా రెండు వాహనాలు ఢీకొని ఘోరం జరిగిందని తెలిపారు.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 356

శనివారం 18-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | CHENNAI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



తొలి వన్డే భారత్‌దే

రాణించిన రాహుల్, జడేజా

5వికెట్ల తేడాతో ఆసీస్ ఓటమి - 9లో



ఒడిదొడుకులున్నా లాభాలే

సెన్సెక్స్ లాభం 355 పాయింట్లు


17,100 వద్ద నిఫ్టీ ముగింపు - 9లో



రష్యాలో జిన్‌పింగ్ టూర్

రష్యా అధినేత పుతిన్ ఆహ్వానం మేరకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 20 నుంచి మూడు రోజులపాటు రష్యాలో పర్యటించనున్నారు.

వివరాలు 6లో ▸



మరో 5 రోజులు కస్టడీలోనే..

ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియా ఈడీ కస్టడీని కోర్టు మరో ఐదు రోజులు పొడిగించింది.

వివరాలు 6లో ▸



ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

యూపీలోని సంభాల్ జిల్లాలో బంగాళదుంప పలు నిల్వ చేసే ఒక కోల్డ్ స్టోరేజీ పైకప్పు కూలిన ఘటనలో 14 మంది మరణించారు.

వివరాలు 6లో ▸



రకూన్ డాగ్స్ నుంచి కరోనా

గబ్బిలాల నుంచి కరోనా సంక్రమించిందన్న వార్తల నేపథ్యంలో ఈ వైరస్ రకూన్ డాగ్స్‌నుంచి వ్యాపించిందని తాజా పరిశోధనల్లో తేలింది.

వివరాలు 6లో ▸

నేడు, రేపు భారీ వర్షాలు



- ద్రోణులు, ఆవర్తనాల ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయి. ఇవి మరో మూడు రోజులు కొనసాగుతాయని.. శని, ఆదివారాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం తెలిపింది. పలు చోట్ల పిడుగులు పడే అవకాశముందని హెచ్చరించింది.

- వివరాలు 2లో

నాలుగేళ్లుగా.. నిలకడగా!

అన్ని రంగాల్లో సుస్థిరాభివృద్ధి నమోదు

- బడ్జెట్‌పై చర్చలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్
- వ్యవసాయం, విద్య, వైద్యం, సామాజిక భద్రతకు పెద్ద పీట
- కోవిడ్‌లో నగదు పంపిణీతో వేగంగా కోలుకున్న వ్యవస్థలు
- గత సర్కారు తప్పులను సరిదిద్దేందుకు ఢిల్లీ వెళ్లక తప్పలేదు
- పోలవరం పునరావాసంపై స్పష్టత లేకుండా నాడు ఒప్పందాలు



సాక్షి, అమరావతి: గత పాలకుల తప్పులను సరిదిద్దుతూ ఆర్భాటాలకు తావు లేకుండా అన్ని రంగాల్లో సుస్థిరాభివృద్ధి నమోదుతో ముందుకు సాగుతున్నట్లు ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. సుస్థిరాభివృద్ధి కోసం వ్యవసాయం, విద్య, వైద్యం, సామాజిక భద్రత రంగాలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వ నిర్వాకాలతో కొండలా పేరుకుపోయిన బిల్లులను చెల్లిస్తూనే కోవిడ్ సంక్షోభంలో కూడా ఆర్థిక వ్యవస్థను వేగంగా గాడిలో పెట్టామన్నారు. శుక్రవారం శాసనసభలో 2023 – 24 వార్షిక బడ్జెట్‌పై చర్చకు ఆర్థిక మంత్రి బుగ్గన సమాధానమిస్తూ మాట్లాడారు.

- 2019 – 20లో 5.7 శాతం వృద్ధితో రూ.9.25 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర జీఎస్‌డీపీ 2022 – 23లో 16.22 శాతం వృద్ధితో రూ.13.17 లక్షల కోట్లకు చేరుకుంది. నాలుగేళ్ల పాలనలో రెండేళ్లు కోవిడ్ లాంటి సంక్షోభం ఎదురైనా ప్రభుత్వం తీసుకున్న సమర్థ నిర్ణయాలతో వ్యవసాయరంగం, పారిశ్రామిక రంగం వేగంగా కోలుకున్నాయి.
- ఆర్థికంగా బలమైన దేశాలు కూడా సంక్షోభ సమయంలో వ్యవస్థలోకి నగదును

మిగతా 2వ పేజీలో ▶

చర్చలో రభస

శాసనసభలో నాలుగో రోజూ టీడీపీ రచ్చ

- సంఖ్యాబలం ప్రకారం టీడీపీకి సమయం కేటాయింపు
- ఎక్కువ టైం తీసుకోవడమేగాక వ్యక్తిగత విమర్శలకు దిగిన విపక్షం..
- అయినా సమయం సరిపోలేదంటూ వైఎస్సార్‌సీపీ సభ్యులు మాట్లాడుతుండగా స్పీకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- టీడీపీ సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్


స్పీకర్ పోడియం వద్ద గొడవ చేస్తున్న టీడీపీ సభ్యులు

సాక్షి, అమరావతి: బడ్జెట్ సమావేశాల సందర్భంగా నాలుగో రోజూ సభలో రభసను విపక్షం కొనసాగించింది. శుక్రవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల కార్యక్రమం అనంతరం స్పీకర్ తమ్మినేని సీతారామ్ బడ్జెట్‌పై చర్చ చేపట్టారు. పార్టీల సంఖ్యాబలాన్ని అనుసరించి సభ్యులకు సమయం కేటాయిస్తానని సభ ప్రారంభంలోనే ప్రకటించారు. దీని ప్రకారం టీడీపీ సభ్యులకు 17 నిమిషాలు ఇస్తున్నట్లు పేర్కొంటూ చర్చలో

మిగతా 2వ పేజీలో ▶

భారత వ్యతిరేకి రాహుల్

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విమర్శ

6 లో





'సూక్ష్మ'సాగే బాగు

నీటితో పాటు కరెంట్, కూలీల వ్యయంలో భారీగా ఆదా

లక్ష హెక్టార్లలో సూక్ష్మ సేద్యం చేస్తే 15 టీఎంసీలు ఆదా

రూ.62 కోట్ల విలువైన విద్యుత్ కూడా పొదుపు.. కూలీల వ్యయంలో రూ.127 కోట్లు మిగిలినట్లే

- నాబార్డు కన్సల్టెన్సీ సర్వీసెస్ నాబ్కాన్స్ నివేదిక వెల్లడి
- సూక్ష్మ సేద్యాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- 13.41 లక్షల హెక్టార్లలో అనుసరిస్తున్న 11.91 లక్షల మంది రైతన్నలు
- దేశవ్యాప్తంగా 70 శాతం సూక్ష్మ సేద్యం ఏపీ సహా ఐదు రాష్ట్రాల్లోనే

2 లో



గుడ్ మార్నింగ్..

ఇదొక్క అందమైన మార్నింగ్!

ఈ శుభోదయపు పలకరింపుతోనే సరిగ్గా పదిహేనేళ్ల క్రితం.. రంగుల హరివిల్లులా.. 'సాక్షి' దిన పత్రిక ఆవిర్భవించింది. 'సత్యమేవ జయతే..' అంటూ నికార్సైన జర్నలిజానికి శంఖం పూరించింది. నాటి నుంచీ అంచెలంచెలుగా ఎదుగుతూ విలువలకు కట్టుబడిన పాత్రికేయ ధర్మాన్ని నిబద్ధతతో కొనసాగిస్తూ వస్తోంది. ఈ మహాయజ్ఞం ఇప్పుడు పదహారవ యేడులోకి ప్రవేశిస్తున్న సందర్భంలో 'సాక్షి' తన పాఠకులకు చిన్న క్విజ్ పెట్టి, కానుకలను ఇవ్వదలచింది. వివరాల కోసం ఇప్పుడే sakshi.com ఓపెన్ చేయండి, జవాబు చెప్పండి.. బహుమతి గెలుచుకోండి అన్న లింకును క్లిక్ చేయండి.

ఈరోజు ప్రశ్న
సాక్షి పత్రికను డిజైన్ చేసిన అంతర్జాతీయ నిపుణుడెవరు?
ఎ) గిల్బర్ మారియో బి) డేవిడ్ విన్నియా
సి) మారియట్ కార్లో డి) మారియో గార్సియా

22 నుంచి ప్రైవేటు స్కూళ్లలో పేదల ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు

సాక్షి, అమరావతి: విద్యా హక్కు చట్టం ప్రకారం 2023–24 విద్యా సంవత్సరానికి గాను పేద వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు కల్పిస్తోంది. ఇందుకోసం ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల విద్యా శాఖ సూచించింది. ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలు చేస్తున్న స్కూళ్లు ఈనెల 19లోగా తమ రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని ఆదేశించింది. విద్యార్థుల తల్లిదండ్రులు 22వ తేదీ నుంచి రిజిస్టర్ చేసుకోవాలని సూచించింది. ఏప్రిల్ 13 నుంచి 17 వరకు అర్హులను ఎంపిక చేసి.. ఏప్రిల్ 18న మొదటి రౌండ్ ఎంపిక జాబితాను విడుదల చేస్తారు. ఏప్రిల్ 19 నుంచి 25 వరకు ఆయా స్కూళ్లు వీరికి ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 29న రెండో విడత ఎంపిక జాబితా విడుదల చేస్తారు. వీరికి మే 1 నుంచి మే 5 వరకు ప్రవేశాలు కల్పించాలి.

నేడు మాప్-అప్ డీవార్మింగ్ డే

సాక్షి, అమరావతి: పిల్లల్లో నులిపురుగుల నివారణలో భాగంగా శనివారం మాప్-అప్ డీవార్మింగ్ డే నిర్వహించనున్నట్టు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం కింద ఈ నెల 14వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్ల పిల్లలు, కిశోర బాలురు, బాలికలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేపట్టామని పేర్కొన్నారు. 1.07 కోట్ల మందికి పంపిణీ లక్ష్యం కాగా 97 లక్షల మందికి పైగా మాత్రలు వేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి కూడా పంపిణీ చేయాలనే లక్ష్యంతో మాప్-అప్ డే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలల్లో పిల్లలకు ఈ మాత్రలు ఇస్తారని తెలిపారు.

న్యాయ సేవాధికార సంస్థ ఈసీగా జస్టిస్ శేషసాయి



సాక్షి, అమరావతి: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (ఏపీఎస్ఎల్ఎస్ఏ) ఎగ్జిక్యూటివ్ చైర్మన్(ఈసీ)గా జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి నామినేట్ అయ్యారు. ఆ పదవిలో ఉన్న జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ఇటీవల పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో హైకోర్టు న్యాయమూర్తుల సీనియారిటీలో రెండో స్థానంలో ఉన్న న్యాయమూర్తిని న్యాయ సేవాధికార సంస్థ ఈసీగా నియమించడం ఆనవాయితీ. అందులో భాగంగా జస్టిస్ శేషసాయి ఈసీగా నామినేట్ అయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాను సంప్రదించిన తర్వాత జస్టిస్ శేషసాయిని గవర్నర్ నామినేట్ చేశారు. ఇందుకనుగుణంగా ప్రభుత్వం ఈ నెల 13వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది.

20న ప్రాంతీయ రైల్వే ప్రయాణికుల సలహా సంఘ సభ్యుని ఎన్నిక



సాక్షి, అమరావతి: ప్రాంతీయ రైల్వే ప్రయాణికుల సలహా సంఘంలో సేవలందించడానికి అసెంబ్లీ నుంచి ప్రతినిధిని ఎన్నుకొనేందుకు షెడ్యూల్‌ను ప్రకటించారు. శుక్రవారం అసెంబ్లీలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వరరావు ప్రతిపాదించగా స్పీకర్ తమ్మినేని సీతారాం షెడ్యూల్‌ను వెల్లడించారు. ప్రాంతీయ రైల్వే ప్రయాణికుల సలహా సంఘంలో సేవలందించడానికి ఏపీ శాసన సభ నుంచి ప్రతినిధిని ఎంపిక చేయడానికి ఈ నెల 17న నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 18న పరిశీలన, 19న నామినేషన్ల ఉపసంహరణ, 20న ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

నేడు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఎస్ఆర్ పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రాజమండ్రి, ఏలూరు, విజయనగరం, మచిలీపట్నం, నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో సీనియర్ రెసిడెంట్ (ఎస్ఆర్) పోస్టుల భర్తీకి శనివారం వాక్ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం డీఎంఈ వినోద్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపల్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఓబీజీ, అనస్థీషియా, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, అప్తాల్మాలజీ , ఈఎన్టీ, రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, అనాటమీ, ఫిజియాలజీ, బయో-కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, మైక్రో బయాలజీ, పాథాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఎస్పీఎం విభాగాల్లో పోస్టుల భర్తీ ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు అవసరమైన సర్టిఫికెట్లతో రావాలని పేర్కొన్నారు.

చరణ్‌ను సత్కరించిన అమిత్ షా

చిరంజీవి, రామ్ చరణ్‌లతో కేంద్ర హోం మంత్రి భేటీ




కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో రామ్ చరణ్, చిరంజీవి

సాక్షి, న్యూఢిల్లీ : నటులు చిరంజీవి, రామ్ చరణ్‌లను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కలిశారు. అమెరికా నుంచి నేరుగా ఢిల్లీ వచ్చిన రామ్ చరణ్ శుక్రవారం ఢిల్లీలో ఓ హోటల్లో జరిగిన మీడియా సంస్థ సదస్సులో పాల్గొన్నారు. అదే సదస్సులో కేంద్ర మంత్రి అమిత్ షా సైతం పాల్గొన్నారు. సదస్సు అనంతరం అదే హోటల్‌లో బస చేస్తున్న రామ్ చరణ్ రూమ్ కి వెళ్లిన అమిత్ షా అక్కడ చిరంజీవి, చరణ్‌లతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు గెలుచుకున్నందుకు గానూ అమిత్‌షా అభినందించి చరణ్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం ట్వీట్ చేసిన కేంద్రమంత్రి అమిత్ షా భారతీయ చిత్రసీమలో ఇద్దరు దిగ్గజాలు చిరంజీవి, రామ్ చరణ్ లను కలవడం ఆనందంగా ఉందని తెలిపారు. తెలుగు సినిమా పరిశ్రమ.. భారతదేశ సంస్కృతి, ఆర్థిక వ్యవస్థను గణనీయంగా ప్రభావితం చేసిందని పేర్కొన్నారు.

నదుల అనుసంధానానికి ప్రాధికార సంస్థ

కేంద్ర కేబినెట్ ఆమోదమే తరువాయి

- 'నిరా'గా ఎన్‌డబ్ల్యూఏ రూపాంతరం
- సర్వే, డీపీఆర్‌ల తయారీ బాధ్యత ఆ సంస్థదే
- ప్రధాన పనుల టెండర్ల నుంచి పర్యవేక్షణ వరకూ 'నిరా'దే బాధ్యత
- కేంద్ర జల్ శక్తి శాఖ మార్గదర్శకాలు
- కెన్–బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు నుంచే అమలు



సాక్షి, అమరావతి : నదుల అనుసంధానం పనులను పర్యవేక్షించేందుకు నేషనల్ హైవేస్ అథారిటీ తరహాలో నేషనల్ ఇంటర్ లింకింగ్ ఆఫ్ రివర్స్ అథారిటీ (నిరా) పేరుతో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖ ప్రతిపాదించింది. నదుల అనుసంధానానికి సంబంధించి సర్వే, సమగ్ర ప్రాజెక్టు నివేదికల (డీపీఆర్) తయారీ నుంచి.. ప్రధాన పనులకు సంబంధించిన టెండర్లు, వాటి పర్యవేక్షణ వరకూ అన్ని బాధ్యతలను ఆ సంస్థే నిర్వహించనుంది. ఆయకట్టుకు నీళ్లందించే బ్రాంచ్ కెనాల్స్ (ఉప కాలువలు), డిస్ట్రిబ్యూటరీల (పిల్ల కాలువల) పనులను మాత్రమే రాష్ట్రాలకు అప్పగించాలని ప్రతిపాదించింది. అప్పుడే నదుల అనుసంధానం వేగవంతమయ్యే అవకాశం ఉంటుందని స్పష్టం చేస్తూ కేంద్ర మంత్రి మండలికి కేంద్ర జల్ శక్తి శాఖ ప్రతిపాదనలు పంపింది. వాటిపై కేంద్ర మంత్రి మండలి ఆమోద ముద్ర వేయడమే తరువాయి. జాతీయ జల వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) నిరాగా రూపాంతరం చెందుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

జాతీయ ప్రాజెక్టుల కంటే అధికంగా..

జాతీయ ప్రాజెక్టులకు అయ్యే వ్యయంలో 90% నిధులను కేంద్రం సమకూర్చేది. కానీ.. ఇటీవల ఆ వాటాను 60 శాతానికి తగ్గిస్తూ కేంద్ర జల్ శక్తి శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ.. నదుల అనుసంధానం ప్రాజెక్టులకు మాత్రం 90 శాతం నిధులను కేంద్రం విడుదల చేస్తుందని, మిగతా 10 శాతం నిధులను ఆయా రాష్ట్రాలు భరించాలని తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. కెన్–బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు (కేబీఎల్‌పీ) నుంచే ఈ మార్గదర్శకాలు అమలవుతాయని పేర్కొంది. కేంద్రంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు కేబీఎల్‌పీ మధ్యప్రదేశ్‌లో 8.11 లక్షల హెక్టార్లు, ఉత్తరప్రదేశ్‌లో 2.51 లక్షల హెక్టార్లు వెరసి 10.62 లక్షల హెక్టార్లకు నీళ్లందించనున్నారు. కేబీఎల్‌పీ అంచనా వ్యయం 2020–21 ధరల ప్రకారం రూ.44,605 కోట్లుగా కేంద్రం నిర్ణయించింది. ఇందులో 90 శాతం కేంద్రం భరిస్తుంది. మిగతా 10 శాతం ఆయకట్టు ఆధారంగా దామాషా పద్ధతిలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ భరిస్తాయి. మిగతా నదుల అనుసంధాన ప్రాజెక్టులకూ ఇదే విధానం వర్తిస్తుందని కేంద్ర జల్ శక్తి శాఖ పేర్కొంది.

నదుల అనుసంధానం వేగవంతం

హిమాలయ, ద్వీపకల్ప నదులను అనుసంధానం చేయడం ద్వారా కడలి పాలవుతున్న జలాలను మళ్లించి దేశాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ఎన్‌డబ్ల్యూడీఏ 30 అనుసంధాన ప్రాజెక్టులను సిద్ధం చేసింది. కానీ.. రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం, నిధుల కొరత, జల వివాదాలు, అటవీ పర్యావరణ అనుమతులు, భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం తదితర సమస్యల వల్ల నదుల అనుసంధానం దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైంది. ఇటీవల కెన్–బెట్వా నదుల అనుసంధానానికి మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రావడంతో ఆ ప్రాజెక్టును కేంద్రం చేపట్టింది. నదుల అనుసంధానం కోసం ప్రత్యేకంగా 'నిరా'ను ఏర్పాటు చేస్తే.. రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించడం నుంచి పనులు చేపట్టడం వరకూ వేగవంతమయ్యే అవకాశం ఉందని నీటి పారుదలరంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌లో ఏపీదే అగ్రస్థానం

దేశంలోని టాప్ 10 జిల్లాల్లో అనంతపురం, అన్నమయ్య, సత్యసాయి

- రిజిస్టర్ చేసుకున్న ప్రతి రైతుకు డ్రిప్ సౌకర్యం
- శాసన సభ ప్రశ్నోత్తరాల్లో వ్యవసాయ మంత్రి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి, అమరావతి : డ్రిప్ ఇరిగేషన్‌లో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. 2022 సంవత్సరంలో డ్రిప్ ఇరిగేషన్‌లో దేశంలోని మొదటి 10 జిల్లాల్లో అనంతపురం, అన్నమయ్య, సత్యసాయి జిల్లాలు ఉన్నాయని తెలిపారు. వైఎస్సార్, ప్రకాశం జిల్లాలు కూడా మంచి ఫలితాలు సాధించాయన్నారు. శుక్రవారం శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఆర్బీకేల్లో రిజిస్టర్ చేసుకున్న రైతులందరికీ ప్రాధాన్యత ప్రకారం డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు మంత్రి చెప్పారు. రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా పంట నష్టం జరిగితే సీజన్ ముగిసే లోపే పరిహారాన్ని రైతు ఖాతాలో, పారదర్శకంగా జమ చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్‌లో మాండూస్ తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ఫిబ్రవరికల్లా పరిహారం చెల్లించామని తెలిపారు.

టీడీపీ నేతల ఇళ్లలోనే డ్రిప్ పరికరాలు : ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి





ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలో రైతుల కోసం తెచ్చిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు ఇప్పటికీ టీడీపీ నేతల ఇళ్లలో ఉన్నాయని చెప్పారు. చిన్న రైతులు దరఖాస్తు చేసుకుంటే వెంటనే డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం అందించాలని, 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు ఉచితంగా డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వాలని కోరారు. దీనిపై మంత్రి కాకాణి సమాధానమిస్తూ 5 ఎకరాల లోపున్న రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ ఇస్తున్నట్లు చెప్పారు. టీడీపీ నేతల ఇళ్లలో డ్రిప్ పరికరాలు ఉన్నాయనే అంశంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్‌ను సీఎం జగన్ ప్రోత్సహిస్తున్నారని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు.

రైతులకు చేయూతలో సీఎం ముందున్నారు: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



వ్యవసాయానికి అండగా నిలవడం, రైతులకు చేయూతనివ్వడంలో సీఎం జగన్ అందరికన్నా ఒక అడుగు ముందే ఉన్నారని రాష్ట్ర గనులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. వైఎస్సార్ జలకళ పథకంపై అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జలకళ కింద కమాండ్ ఏరియాతో పాటు నాన్-కమాండ్ ఏరియాలో కూడా అర్హులైన ప్రతి రైతుకూ ప్రభుత్వం ఉచితంగా బోర్లు మంజూరు చేస్తోందని చెప్పారు. ఉచితంగానే విద్యుదీకరణ చేస్తున్నామని, ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ ఉపకరణాలు, కేబుల్‌ను కూడా ఇస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పేరుతో రైతులకు ఉచిత బోరు బావులను కేవలం కమాండ్ ఏరియాల్లోనే మంజూరు చేసినట్లు తెలిపారు.

ఎస్సీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం : మంత్రి మేరుగు నాగార్జున



రాష్ట్రంలో ఎస్సీ కులాల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. శుక్రవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో కైలే అనిల్‌కుమార్ తదితరులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. ఈ మూడున్నరేళ్లలో ఎస్సీల సంక్షేమానికి ప్రభుత్వం రూ.52 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిందని వివరించారు. చంద్రబాబు హయాంలో అయిదేళ్లలో ఎస్సీల సంక్షేమానికి ఇచ్చింది రూ.32 వేల కోట్లేనని, ఎస్సీలు, ఇతర అణగారిన వర్గాలు అవమానాలు ఎదుర్కొన్నారని చెప్పారు. ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వం వారిని గౌరవించి, వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తోందని వివరించారు. ప్రపంచంలోనే చిరస్థాయిగా నిలిచిపోయేలా విజయవాడ నడిబొడ్డున బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనాన్ని సీఎం జగన్ ఏర్పాటు చేయిస్తున్నారని తెలిపారు. స్మృతివనంలో 150 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేలు కంబాల జోగులు, సుధాకర్‌బాబు, జోగారావు మాట్లాడుతూ ఎస్సీల కోసం శ్మశానాల ఏర్పాటుకు ప్రభుత్వమే స్థలాలు కొనేలా ప్రత్యేక ఉత్తర్వులు ఇప్పించినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'సూక్ష్మ' సాగే బాగు



సాక్షి, అమరావతి: సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్) రైతన్నలకు ఎంతో లాభదాయకమని నాబార్డు కన్సల్టెన్సీ సర్వీసెస్ నాబ్కాన్స్ అధ్యయన నివేదిక వెల్లడించింది. అవసరమైన చోట్ల మాత్రమే మొక్కలకు నీరు అందడం వల్ల కలుపు, చీడపీడల సమస్యను సమర్థంగా నియంత్రించవచ్చు. సూక్ష్మ సేద్యం ద్వారా కేవలం నీరు మాత్రమే కాకుండా విద్యుత్తు, కూలీల వ్యయంలో పెద్ద ఎత్తున ఆదా అవుతుంది. తద్వారా అన్నదాతలకు సాగు వ్యయం, అనవసర ఖర్చులు తగ్గిపోయి అదనపు ఆదాయం సమకూరుతుందని నాబ్కాన్స్ అధ్యయనంతో తేలిందని సామాజిక ఆర్థిక సర్వే పేర్కొంది. సూక్ష్మ సేద్యం విధానంలో హెక్టార్‌కు గంటకు 1,553 కిలోవాట్ల విద్యుత్ ఆదా అవుతుంది. యూనిట్ విద్యుత్‌కు రూ.4 చొప్పున ఆదా అవుతుందని నాబ్కాన్స్ నివేదిక తెలిపింది. హెక్టార్‌కు 52 పనిదినాల కూలీల వ్యయం తగ్గుతుంది. రోజు కూలీ రూ.245 చొప్పున ఆదా అవుతుంది. హెక్టార్‌కు సాగు వ్యయం రూ.21,500 తగ్గుతుండగా అదనపు ఆదాయం రూ.1,15,000 సమకూరుతుంది.

సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు

రైతులకు బహుళ ప్రయోజనాలను అందించే కేంద్ర ప్రాయోజిత పథకమైన ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన (పీఎం కేఎస్‌వై) ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తోందని సామాజిక ఆర్థిక సర్వే పేర్కొంది. నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న రాయలసీమ జిల్లాలతో పాటు మెట్ట ప్రాంతాల్లో సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తూ సబ్సిడీపై బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను సమకూరుస్తున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో 11.91 లక్షల మంది రైతులు 13.41 లక్షల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం అనుసరిస్తున్నారు. ఈ ఆర్థిక ఏడాది 75,000 హెక్టార్లను సూక్ష్మ సేద్యం కిందకు తేవాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటివరకు 60,500 హెక్టార్లకుపైగా ఈ పరిధిలోకి తెచ్చినట్లు వెల్లడించింది. మరో 2,38,070 హెక్టార్లను సూక్ష్మ సేద్యం కిందకు తెచ్చేందుకు రైతు భరోసా కేంద్రాల్లో 2.02 లక్షల రైతులు నమోదు చేసుకున్నట్లు సర్వే పేర్కొంది.

ఐదు రాష్ట్రాల్లో 70 శాతం

సూక్ష్మ సేద్యం చేయడం ద్వారా ఎంత మేరకు నీరు, విద్యుత్, కూలీల వ్యయం తగ్గుతుంది? సాగు ఖర్చులు ఎంత తగ్గుతాయి? రైతులకు అదనపు ఆదాయం ఎంత లభిస్తుందనే అంశాలపై నాబ్కాన్స్ గణాంకాలు రూపొందించినట్లు సామాజిక ఆర్థిక సర్వే తెలిపింది. నీటి కొరతను అధిగమించేందుకు సూక్ష్మ సేద్యాన్ని అన్ని రాష్ట్రాల్లో ప్రోత్సహించాలని నాబ్కాన్స్ నివేదిక సూచించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సూక్ష్మ సేద్యం విస్తీర్ణంలో 70 శాతం ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్రల్లోనే ఉందని వెల్లడించింది. మిగతా రాష్ట్రాల్లోనూ సూక్ష్మ సేద్యాన్ని విస్తరించేలా చర్యలు చేపట్టాలని పేర్కొంది.

సూక్ష్మ సేద్యంతో ప్రయోజనాలు ఇలా

కాంపొనెంట్	లక్ష హెక్టార్లలో	పది లక్షల హెక్టార్లలో
• నీటి ఆదా	15 టీఎంసీలు	150 టీఎంసీలు
• విద్యుత్ ఆదా హెక్టార్‌కు 1553 కిలోవాట్స్ అవర్	1553 లక్షల కిలోవాట్స్ అవర్	15,530 లక్షల కిలోవాట్స్ అవర్
యూనిట్ విలువ రూ.4	రూ.62 కోట్లు	రూ.620 కోట్లు
• కూలీ ఖర్చుల్లో ఆదా హెక్టార్‌కు 52 పనిదినాలు	52 లక్షలు పనిదినాలు	520 లక్షల పనిదినాలు
రోజుకు ఒక్కో కూలీకి రూ.245	రూ.127 కోట్లు	రూ.1270 కోట్లు
• హెక్టార్‌కు 50 కేజీల ఎరువులు ఆదా	5000 టన్నులు	50,000 టన్నులు
• హెక్టార్‌కు రూ.21,500 సాగు వ్యయం తగ్గుదల	రూ.215 కోట్లు	రూ.2150 కోట్లు
• హెక్టార్‌కు రూ.1,15,000 అదనపు ఆదాయం	రూ.1500 కోట్లు	రూ.15,000 కోట్లు

రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు

- కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వానలు
- ద్రోణులు, ఆవర్తనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు
- మరో మూడు రోజులు కురుస్తాయని ఐఎండీ వెల్లడి
- ఉరుములు, మెరుపులు, పిడుగులకు అవకాశం
- గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు
- పిడుగుల శబ్దాలకు ఇద్దరు వృద్ధులు మృతి



నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం పాతకందుకూరులో 20 కిలోల వడగండ్లు పడిన దృశ్యం

సాక్షి, విశాఖపట్నం/సాక్షి నెట్‌వర్క్: ద్రోణులు, ఆవర్తనాల ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయి. ఇవి మరో మూడు రోజులపాటు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ప్రస్తుతం దక్షిణ తమిళనాడు నుంచి ఉత్తర కొంకణ్ వరకు రాయలసీమ, తెలంగాణ, విదర్భల మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. బంగ్లాదేశ్ పరిసరాల్లోని ఉపరితల ఆవర్తనం నుంచి ఉత్తర కోస్తాంధ్ర వరకు విస్తరించిన మరో ద్రోణి శుక్రవారం బలహీనపడింది. వీటి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, యానాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, ఎస్పీఎస్సార్ నెల్లూరు జిల్లాల్లో, ఆదివారం విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, యానాం, అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు కొన్నిచోట్ల పిడుగులకు ఆస్కారం ఉందని, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. గడచిన 24 గంటల్లో త్రిపురాంతకం కోట (తిరుపతి)లో 7.3 సెంటీమీటర్లు, అడ్డతీగల (అల్లూరి సీతారామరాజు)లో 5, రేపల్లె (బాపట్ల)లో 4.8, పోతిరెడ్డిపాలెం (కృష్ణా)లో 4.7, ఎస్.కండ్రిగ (చిత్తూరు), గుడ్లదోన (ఎస్పీఎస్సార్)లో 3.8, శివరాంపురం (అన్నమయ్య)లో 3.7, గుంటూరు పశ్చిమలో 2.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో, నంద్యాల జిల్లాలో గురువారం రాత్రి, శుక్రవారం వడగండ్ల వర్షం కురిసింది. గురువారం రాత్రి పిడుగుల శబ్దాలకు శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో ఇద్దరు వృద్ధులు మృతిచెందారు.

చర్చలో రభస

మొదటి పేజీ తరువాయి

తొలుత మాట్లాడే అవకాశం ఇచ్చారు. టీడీపీ నుంచి ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ బడ్జెట్ గణాంకాలు అంకెల గారడీ అని, ప్రభుత్వం హామీలను విస్మరించిందని చెప్పారు. ఫ్యాన్సీ నెంబర్‌పై 2,79,279పై ఉన్న దృష్టి ప్రజా సమస్యలపై లేదంటూ బడ్జెట్‌ను విమర్శించారు. ఈ సమయంలో సీఎం ఆస్తులంటూ ఆరోపణలు చేస్తుండడంతో అధికార పార్టీ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. అప్పటికే నిర్ణీత సమయం మించిపోవడం, వ్యక్తిగత విమర్శలు కొనసాగించడంతో ప్రసంగాన్ని త్వరగా ముగించాలని స్పీకర్ సూచించారు. బడ్జెట్‌పై చర్చించకుండా తప్పుదోవ పట్టించే యత్నాలు సరికాదని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సూచించారు. అప్పటికే టీడీపీకి ఇచ్చిన నిర్ణీత సమయం దాటిపోయి 25 నిమిషాలు మాట్లాడడంతో అధికార పార్టీ నుంచి చర్చలో పాల్గొనేందుకు కోన రఘుపతికి స్పీకర్ అవకాశమిచ్చారు. ఈ సమయంలో టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు చేరుకుని తమకు సమయం సరిపోలేదంటూ నినాదాలు చేస్తూ చర్చకు ఆటంకం కల్పించారు. డోల బాలవీరాంజనేయులు, వెలగపూడి రామకృష్ణ, ఆదిరెడ్డి భవానీ తదితరులు సభాపతి కుర్చీ వద్దకు చేరుకుని స్పీకర్ డౌన్‌డౌన్... అంటూ నినాదాలు చేశారు. విపక్ష సభ్యులు తమ సీట్ల వద్దకు వెళ్లాలని స్పీకర్ పదేపదే కోరినా మైక్ ఇవ్వాలని పట్టుబట్టారు. భోజనం సమయం కావడంతో టీడీపీ సభ్యులు సభ నుంచి సస్పెండై బయటకు వెళ్లిపోవాలన్న ఉద్దేశంతో ఉన్నారని ఆర్థిక మంత్రి బుగ్గన వ్యాఖ్యానించారు. అనంతరం సభ ఆమోదంతో టీడీపీ సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించడంతో నినాదాలు చేస్తూ నిష్క్రమించారు.



సభలో రభస సృష్టిస్తున్న టీడీపీ సభ్యులు

నాలుగేళ్లుగా.. నిలకడగా!

మొదటి పేజీ తరువాయి

పంపిణీ చేస్తాయి. అదే తరహాలో 2022 – 23లో అదనంగా రూ.1.83 లక్షల కోట్ల సంపదను సృష్టించగలిగాం. అప్పుల కోసం కాకుండా గత సర్కారు తప్పులను సరిదిద్దడానికే 30 దఫాలకుపైగా ఢిల్లీ వెళ్లాల్సి వచ్చింది.

- రాష్ట్ర జీవనాడి పోలవరం ఆలస్యం కావడానికి ముమ్మాటికీ టీడీపీనే కారణం. పోలవరం పునరావాస సాయంపై సరైన స్పష్టత లేకుండా ఒప్పందం కుదుర్చుకుంది. అలాంటి తప్పులను ఈ ప్రభుత్వం సరిదిద్దుతోంది.
- ఆర్బీకేలు, ఉచిత పంటల బీమా, వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రైతులకు అడుగడుగునా ప్రభుత్వం తోడుగా నిలవడంతో రాష్ట్రంలో సాగు వ్యయం 21 శాతం తగ్గడమే కాకుండా రాబడి 23 శాతం పెరిగింది. విద్య, వైద్య రంగాల్లో చేపట్టిన విప్లవాత్మక మార్పులు రానున్న కాలంలో మంచి ఫలితాలను అందిస్తాయి.
- గత ప్రభుత్వం కంటే ఇప్పుడు అప్పులు తక్కువగానే చేసినా విపక్షం, వాటి అనుబంధ మీడియా తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నాయి. రాష్ట్ర విభజన నాటికి రూ.1.14 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర అప్పులు గత ప్రభుత్వ హయాంలో ఏటా సగటున 19 శాతం వృద్ధితో రూ.2.72 లక్షల కోట్లకు ఎగబాకాయి. ఇప్పుడు నాలుగేళ్ల కాలంలో అప్పులు రూ.2.72 లక్షల కోట్ల నుంచి 13.5 శాతం వృద్ధితో రూ.4.5 లక్షల కోట్లకు చేరాయి. టీడీపీ సర్కారు కేంద్ర ప్రభుత్వం కంటే ఎక్కువ స్థాయిలో అప్పులు చేసింది.
- ఉచిత సేవలకు కాలం చెల్లిందని, ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయాలని తాను స్వయంగా రాసుకున్న మనసులో మాట పుస్తకంలో పేర్కొన్న చంద్రబాబు ఇప్పుడు అన్నీ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేయడం విడ్డూరం. 60 శాతం మంది ప్రభుత్వ ఉద్యోగులు అవినీతిపరులని, కాంట్రాక్టు విధానంలోనే ఉద్యోగాలివ్వాలని, ప్రాజెక్టులు అనవసరమని, పేదలకు ఇళ్లు ఇవ్వడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని, స్థానిక సంస్థలకు నిధులివ్వాల్సిన అవసరం లేదని పుస్తకంలో రాసుకున్న చంద్రబాబు ఇప్పుడు అందుకు భిన్నంగా మాట్లాడుతున్నారు.

తిరుమల దర్శనానికి ప్రత్యేక ప్యాకేజీ

- రూ.1,060లకే స్వామి దర్శనం, స్థానిక దేవాలయాల సందర్శన
- గైడ్, భోజన, రవాణా సౌకర్యంతో ఏపీటీడీసీ ప్యాకేజీ

సాక్షి, అమరావతి: తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనానికి పర్యాటక సంస్థ కొత్తగా ప్రత్యేక ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చింది. శ్రీవారి దర్శనంతోపాటు మరో ఆరు స్థానిక దేవాలయాల సందర్శన, గైడ్ సౌకర్యంతో కూడిన టూర్ ప్యాకేజీని నిర్వహిస్తోంది. పెద్దలకు రూ.1,060, పిల్లలకు రూ.760 టికెట్ ధరగా నిర్ణయించింది. పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీనివాస మంగాపురం, ముక్కోటి అగస్త్యేశ్వర, వకుళమాత, కపిలేశ్వర స్వామి, గోవిందరాజ స్వామి దేవాలయాల దర్శన భాగ్యాన్ని కల్పిస్తోంది. రూ.300 శీఘ్ర దర్శనం, భోజనం, స్థానిక రవాణా సౌకర్యాలను అందిస్తోంది. తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరులోని ఏపీటీడీసీ సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయాల్లోనూ, ఏపీటీడీసీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లోనూ టికెట్లు పొందవచ్చు.

రేపటి నుంచి శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు

శ్రీశైలం టెంపుల్/మహానంది: శ్రీశైల మహా క్షేత్రంలో ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు ఉగాది మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మహోత్సవాల్లో మల్లికార్జునస్వామికి విశేష అర్చనలు, భ్రమరాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో ప్రతిరోజు వివిధ వాహన సేవలు ఉంటాయి. ఈ నెల 21న ప్రభోత్సవం, వీరాచార విన్యాసాలు, ఉగాది రోజైన 22న పంచాంగ శ్రవణం, పండిత సత్కారం, సాయంత్రం రథోత్సవం జరగనుంది. ఆదివారం ఉదయం యాగశాల ప్రవేశంతో ఉగాది ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. సాయంత్రం అమ్మవారికి మహాలక్ష్మి అలంకారం, స్వామి అమ్మవార్లకు భృంగి వాహనసేవ, సోమవారం మహాదుర్గ అలంకారం, కైలాస వాహనసేవ, మంగళవారం మహా సరస్వతి అలంకారం, ప్రభోత్సవం, నంది వాహనసేవ, బుధవారం ఉగాది రోజు రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకారం, రథోత్సవం, గురువారం భ్రమరాంబదేవి నిజాలంకరణ, అశ్వ వాహనసేవ నిర్వహిస్తారు. కాగా, ఉగాది ఉత్సవాలపై నంద్యాలలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం రద్దు చేసినట్లు ప్రకటించారు.

ఆర్బీకే తరహా సేవలు దేశంలో ఎక్కడా లేవు

- ఏపీలో రైతులకు అందిస్తున్న సేవలు అద్భుతం
- వీటిపై మా ప్రభుత్వానికి నివేదికిస్తాం
- గొల్లపూడి ఆర్బీకేను సందర్శించిన రాజస్తాన్ ఉన్నతాధికారుల బృందం



రైతులతో ముఖాముఖిలో పాల్గొని ఆర్బీకే సేవలపై ఆరా తీస్తున్న రాజస్థాన్ అధికారుల బృందం

సాక్షి, అమరావతి: రైతు భరోసా కేంద్రాలు గ్రామస్థాయిలో రైతులకు అందిస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని రాజస్తాన్ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఈ తరహా సేవలు దేశంలో ఎక్కడా లేవని చెప్పారు. ఏపీలో వ్యవసాయ విధానాలు రాష్ట్ర పర్యటనలో భాగంగా శుక్రవారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి ఆర్బీకే-1ను రాజస్తాన్ అధికారులు పరిశీలించారు. ఆర్బీకే ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను.. మాయిశ్చర్ మీటర్, సీడ్ టెస్టింగ్ కిట్, కియోస్క్, తదితరాల పనితీరుతో పాటు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్న విధానాలను తెలుసుకున్నారు. అనంతరం రైతులతో సమావేశమై.. వారి అభిప్రాయాలను, అనుభవాలను ఆరా తీశారు. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం విజయవాడ వెళ్లే వాళ్లమని.. ఇప్పుడు అన్నీ గ్రామం విడిచి వెళ్లకుండానే ఎమ్మార్పీ రేట్లకే ఇస్తున్నారని రైతులు వివరించారు. ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుంటే.. ఉచితంగా పంటల బీమా అందిస్తున్నారని రైతులు తెలిపారు. తాము పండించిన ధాన్యాన్ని ఆర్బీకే ద్వారానే అమ్ముకుంటున్నామని, 21 రోజుల్లోనే డబ్బులు జమవుతున్నాయని చెప్పారు. అన్ని పంటల ఉత్పత్తులను ఆర్బీకే ద్వారానే విక్రయిస్తున్నామని వివరించారు. అనంతరం మంగళగిరిలో ఏపీ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై.. వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, వాటి ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో రాజస్తాన్ విత్తనాభివృద్ధి సంస్థ మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ కేసీ మీనా, ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అజయ్‌కుమార్ పచోరి, డిప్యూటీ డైరెక్టర్లు రాకేశ్ కుమార్, దన్వీర్ వర్మ, అసిస్టెంట్ డైరెక్టర్ తారాచంద్ బోచాలియా తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ వరి నికర ఆదాయంలో 4వ స్థానంలో ఏపీ

కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమశాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో 2020–21 ఖరీఫ్‌లో వరి పంట నికర ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమశాఖ నివేదిక వెల్లడించింది. 2020–21 ఖరీఫ్‌లో ఎంపిక చేసిన రాష్ట్రాల్లో హెక్టార్‌లో వరి పండించడానికయ్యే వ్యయాన్ని, కుటుంబంలోని కూలీల ఖర్చును, మద్దతు ధరను బేరీజు వేస్తూ ఏ రాష్ట్రంలో హెక్టార్‌కు వరిపంట నికర ఆదాయం ఎంత అనేది నివేదికలో పేర్కొంది. హెక్టార్ వరి పంటకు అత్యధిక నికర ఆదాయం హరియాణలో ఉంది. ఆ తరువాత స్థానాల్లో పంజాబ్, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నికర ఆదాయం ఎక్కువగా ఉందని తెలిపింది. హెక్టార్‌లో వరి పండించేందుకు ఇన్‌పుట్స్ వ్యయం అంటే కూలీలు, యంత్రాలు, ఎరువులు, పురుగుమందులు, సాగునీరు, విత్తనాలతోపాటు కుటుంబసభ్యులు కూలీలుగా పనిచేస్తే అందుకయ్యే మొత్తం వ్యయంగా పేర్కొంది. తరువాత హెక్టార్ విస్తీర్ణంలో ఉత్పత్తి అయిన ధాన్యానికి మద్దతు ధరను పరిగణనలోకి తీసుకుని ఆయా రాష్ట్రాల్లో నికర ఆదాయాన్ని లెక్కించింది. మహారాష్ట్రలో మాత్రం పెట్టిన పెట్టుబడి కన్నా తక్కువ ఆదాయం వచ్చినట్లు నివేదిక వెల్లడించింది. మహారాష్ట్రలో హెక్టార్ వరి పండించేందుకు కటుంబసభ్యుల కూలీలతో కలిపి రూ.79,199 వ్యయం అయితే నికర ఆదాయం రూ.54,706 రూపాయలు పేర్కొంది.

కార్యదర్శులతో ఆర్మీ అధికారుల భేటీ



కార్యదర్శులతో భేటీ అయిన సీనియర్ ఆర్మీ, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారుల బృందం

సాక్షి, అమరావతి: ఈ నెల 12 నుంచి రాష్ట్రంలో పర్యటిస్తున్న నేషనల్ డిఫెన్స్ కళాశాల(ఢిల్లీ)కి చెందిన సీనియర్ ఆర్మీ, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారుల బృందం చివరి రోజైన శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సచివాలయంలో సమావేశమైంది. పర్యటనలో భాగంగా ఎన్డీసీ బృందం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రాజెక్టులను పరిశీలించింది. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆర్థిక, మున్సిపల్ పరిపాలన రంగాల్లో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల గురించి ఆయా శాఖల అధికారులను ఈ బృందం వివరాలు అడిగి తెలుసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నీరబ్ కుమార్ ప్రసాద్, కె.ప్రవీణ్ కుమార్, ముఖ్య కార్యదర్శి సునీత, కార్యదర్శి ప్రద్యుమ్న, పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన పాల్గొన్నారు. బృందంలో నేషనల్ డిఫెన్స్ కళాశాలకు చెందిన ఫ్యాకల్టీ ఇన్‌చార్జి మేజర్ జనరల్ రాజేశ్ అరుణ్ మోఘే, ఎయిర్ కమాండర్ కె.సుందర్ మని, బ్రిగేడియర్లు నవతేజ్ షోహాల్, అనూప్ కుమార్ మోహ్లే, వికాస్ స్లాతియా, నితిన్ భాటియా, రజత్ కుమార్, కల్నల్ అంగ్ కయా ఢెట్ (మయన్మార్), బ్రిగేడియర్ జనరల్ ఇస్మాయిల్ షరీఫ్ (మాల్దీవ్స్), కమాండర్ గౌతమ్ మార్వాహ, కల్నల్ గౌరబ్ గురుంగ్ (నేపాల్), సృజని మొహంతి (ఐఆర్ఎస్-ఐటి), ఎయిర్ కమాండర్ భగవత్, డీఐజీ ఆశిష్ మెహరోత్రా, బ్రిగేడియర్ గోవర్ధన్ సింగ్, అశోక్ తివారి ఐపీఎస్, కల్నల్ కయిస్ విల్ మెర్కల్ (జర్మని), స్టాఫ్ లెఫ్టినెంట్ కల్నల్ మోస్పర్ అబ్దుల్లా యం అలలినీ (సౌదీ అరేబియా) తదితరులు ఉన్నారు.

తెలంగాణ

బీటెక్ విద్యార్థిపై దాడి

- రాజకీయ నాయకురాలి కొడుకు ఆగడం
- ప్రేమ వ్యవహారమే కారణం

సుజాతనగర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిపై కొత్తగూడెం పట్టణానికి చెందిన ఒక ప్రముఖ రాజకీయ నాయకురాలి కుమారుడు దాడికి పాల్పడ్డాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలివి. పాల్వంచకు చెందిన బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థి.. తన కళాశాలలో చదువుతున్న ఒక అమ్మాయిని ప్రేమించాడు. అదే అమ్మాయిని కొత్తగూడేనికి చెందిన మరో యువకుడు కూడా ప్రేమించాడు. ఈ విషయంలో ఇద్దరు విద్యార్థుల మధ్య గతంలో గొడవ జరిగి.. పరస్పరం క్షమాపణలు కూడా చెప్పుకొన్నారు. కానీ కొత్తగూడెం విద్యార్థికి మిత్రుడైన రాజకీయ నాయకురాలి కుమారుడు.. 'నువ్వెందుకు క్షమాపణ చెప్పావు.. మనకు రాజకీయ అండ ఉంది.. నేను వాడి సంగతి చూస్తా' అంటూ కొంతకాలంగా అంటున్నాడు. ఈ క్రమంలో రాజకీయ నాయకురాలి కుమారుడితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కళాశాలకు వచ్చి పాల్వంచ విద్యార్థిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకునేసరికే వివాదం సద్దుమణిగింది. ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలకు చేరుకుని.. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విద్యార్థుల భవిష్యత్ నాశనం అవుతుందంటూ రాజీ కుదిర్చారు. బయటి వ్యక్తులు కళాశాలకు వచ్చి విద్యార్థిపై దాడికి పాల్పడ్డారని, అడ్డుకోబోయిన అధ్యాపకులపైనా దాడికి పాల్పడ్డారని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

సాక్షి

శనివారం, మార్చి, 18

గార్సెటీ సాధించేదేమిటి?

దౌత్యం గురించీ, దౌత్యవేత్తల గురించీ వ్యంగ్య వ్యాఖ్యలు ఎంతగా ప్రచారంలో ఉన్నా దేశాల మధ్య సంబంధాల్లో దౌత్యవేత్త పోషించే పాత్ర అత్యంత విలువైనది. అలా చూస్తే అమెరికా వంటి అగ్ర రాజ్యానికి మన దేశంలో గత 26 నెలలుగా పూర్తికాలం పనిచేసే రాయబారి లేరంటే ఆశ్చర్యం కలుగుతుంది. అన్ని అవరోధాలూ అధిగమించి ఎరిక్ గార్సెటీ ఎట్టకేలకు ఈ పదవి స్వీకరించ బోతున్నారు. ఆయన విషయంలో సెనేట్‌లో అధికార, విపక్షాలమధ్య ఏకాభిప్రాయం కుదరక పోవటమే ఇంత జాప్యం చోటుచేసుకోవటానికి కారణం. సుదీర్ఘమైన ఈ ప్రక్రియ పొడవునా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పట్టుదలగా వ్యవహరించటం గార్సెటీకి కలిసొచ్చింది. స్వపక్షమైన డెమాక్రాటిక్ పార్టీనుంచి ముగ్గురు కట్టుదాటినా రిపబ్లికన్ పార్టీనుంచి ఏడుగురు ఆసరాగా నిలవడం తో 52–42 తేడాతో గార్సెటీ ఎంపిక ఆమోదం పొందింది. బైడెన్ తన మొండిపట్టు ద్వారా సెనేట్‌కు ఒక సందేశం పంపారు. తన ఎంపిక ఆమోదం పొందేవరకూ ఎంతకాలమైనా ఆ స్థానాన్ని ఖాళీగా ఉంచుతానన్నది దాని సారాంశం. అమెరికాలో కీలక పదవుల ఎంపికంతా మనకు భిన్నం. అధికార పక్షం ఎంపిక చేసినవారిపై బహిరంగంగా చర్చ జరగటం, రకరకాల అభిప్రాయాలు వ్యక్తం కావటం సర్వసాధారణం. వచ్చిన ఆరోపణలకు అభ్యర్థి సంతృప్తికరంగా సమాధానాలివ్వలేకపోతే ఆ ఎంపిక వీగిపోతుంది. ఈ విషయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయినా ఒకటే...రాయబారి అయినా ఒకటే. గార్సెటీపై వ్యక్తిగతంగా నేరుగా ఆరోపణలు లేవు. కానీ గతంలో ఒక పదవిలో ఉండగా తన సహాయకుడిగా ఉన్న వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు వచ్చినా దాన్ని ఆయన పట్టించుకోలేదన్నది ఆ ఆరోపణల సారాంశం. అప్పట్లో ఆ సంగతి తనకు తెలియనే తెలియదని గార్సెటీ వివరణనిచ్చారు. ఆయన గతంలో లాస్ ఏంజెలిస్ మేయర్‌గా పనిచేశారు.

ఇప్పుడున్న అంతర్జాతీయ పరిస్థితుల్లో రాగల రోజులు దౌత్యపరంగా ఎంతో కీలకమైనవి. చైనాను కట్టడి చేయటం కోసం అమెరికా రూపకల్పన చేసిన ఇండో పసిఫిక్ దేశాల కూటమి క్వాడ్‌లో మన పాత్ర ప్రధానమైనది. ఒకపక్క ఉక్రెయిన్‌లో రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధం రోజురోజుకూ ముదురుతోంది. అక్కడ ఏ క్షణంలో ఏమవుతుందోనన్న ఉత్కంఠ అందరిలోనూ ఉంది. రష్యానుంచి ముడి చమురుతోసహా దేన్నీ కొనుగోలు చేయొద్దని అమెరికా కోరినా మన దేశం దాన్ని పాటించటం లేదు. దీర్ఘకాల మిత్రదేశమైన రష్యాను కాదనటం మనకంత సులభమేమీ కాదు. రష్యాను ఆర్థికంగా కట్టడి చేయాలన్న అమెరికాకు ఇది మింగుడుపడటం లేదు. భారత్‌ను తన దారికి తెచ్చుకోవటం ఎలాగన్నదే దాని ఆత్రుత. గార్సెటీ రాయబారిగా ఉంటే ఇది సులభమవుతుందని ఆ దేశం భావిస్తోంది. అదీగాక ఈ వేసవిలో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటించబోతున్నారు. అలాగే సెప్టెంబర్‌లో ఇక్కడ జరగబోయే జీ–20 శిఖరాగ్ర సదస్సుకు బైడెన్ హాజరవుతున్నారు. ఇలాంటి తరుణంలో రాయబారి పదవి ఖాళీగా ఉండటం అమెరికా ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుంది. వాస్తవానికి గార్సెటీకి దౌత్యరంగంలో పెద్దగా అనుభవం, నిపుణత లేవు. భారత్ వంటి కీలక దేశానికి అటువంటి వ్యక్తిని పంపటం సరైందికాదన్న విమర్శలు రిపబ్లికన్ శిబిరం నుంచి వినిపించాయి. అయితే బైడెన్‌కు ఆయన అత్యంత విశ్వసనీయుడు. ఉపాధ్యక్ష పదవికి పార్టీ అభ్యర్థిగా కమలా హారిస్‌ను ఎంపిక చేసిన కమిటీకి నేతృత్వంవహించింది గార్సెటీయే. ఆ ఎంపిక అధ్యక్ష ఎన్నికల్లో బైడెన్ ఘన విజయం సాధించటానికి బాటలు పరిచిందని చెప్పాలి.

రాయబారిగా తన ప్రాధాన్యతలేమిటో 2021 డిసెంబర్‌లోనే సెనేట్ ముందు గార్సెటీ వివరించారు. ఇతర దేశాలతో పోలిస్తే అమెరికా భద్రతకూ, కలిమికీ భారత్ తోడ్పాటు ఎంతో అవసరమని, దాన్ని తాను సాధించగలనని హామీ ఇచ్చారు. ఇండో పసిఫిక్ ప్రాంతం స్వేచ్ఛాయుతంగా ఉండాలన్న అమెరికా భావనతో భారత్‌కు ఏకీభావం ఉన్నదని, ఈ విషయంలో ద్వైపాక్షిక సంబంధాలు దృఢతరం కావటానికి అవసరమైన చొరవ తీసుకుంటానని గార్సెటీ వివరించారు. అలాగే భారత్‌కు బలమైన పొరుగుదేశంనుంచి ముప్పు ఉన్నందున దానికి అమెరికా అండగా నిలవటం ముఖ్యమని, ఈ విషయంలో తాను గట్టిగా కృషి చేస్తానన్నారు. పైగా 1990లో భారత్ పర్యటన తర్వాత హిందీ, ఉర్దూ అధ్యయనం చేయటం, ఇక్కడి సాంస్కృతిక, మత సంబంధ చరిత్ర గురించిన అవగాహన పెంచుకోవటం గార్సెటీకి అనుకూలాంశాలు. అమెరికాలో 40 లక్షలమంది భారతీయులున్నారు. రెండు లక్షలమంది అమెరికా విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్నారు. మరిన్ని లక్షల మంది వృత్తి ఉద్యోగాల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇరు దేశాల ప్రజల మధ్యా సాన్నిహిత్యం అవసరమని, దాన్ని తాను సాధించగలనని హామీ ఇచ్చారు. వీటితోపాటు మానవహక్కుల్ని గౌరవించటం, పటిష్ఠ ప్రజాస్వామిక సంస్థలు ఇరు దేశాల సంబంధాల్లో కీలకాంశాలని, భారత్‌తో వీటిపై తరచు చర్చిస్తానని కూడా చెప్పారు. ఇది సహజంగానే వివాదాస్పదం కావొచ్చు. ఈ పరిధిలోకి వచ్చే అంశాలేమిటో ఆయన చెప్పకపోయినా 370వ అధికరణ, నిఘా సంస్థల వ్యవహార శైలివంటివి అందులో భాగం కావొచ్చునన్న అనుమానాలున్నాయి. అదే జరిగితే మోదీ సర్కారు మౌనంగా ఏమీ ఉండ కపోవచ్చు. కనుక బాధ్యతల నిర్వహణ గార్సెటీకి అంత సులభమేమీ కాదనే చెప్పాలి. ఏదేమైనా అమెరికా అధ్యక్షుడికి అత్యంత సన్నిహితుడైన వ్యక్తి మన దేశానికి రాయబారిగా రావటం శుభసూచకం. ఇప్పుడున్న ద్వైపాక్షిక సంబంధాలు మరింత ఉన్నత స్థితికి చేరుకోవటానికి దోహద పడగల పరిణామం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.ఏకాదశి ఉ.8.34 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** శ్రవణం రా.10.54 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.2.19 నుండి 3.46 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.12 నుండి 7.45 వరకు, **అమృతఘడియలు:** ప.12.54 నుండి 2.22 వరకు.

సూర్యోదయం : 6.11
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఏనుగుల గుసగుసలు విందామా?

విశ్లేషణ



ఆనంద బెనర్జీ

ఏనుగులు తరాలుగా తమ జన్యువుల్లోకి చేరిన ప్రాచీన అరణ్య మార్గాల ఆధారంగా తిరుగుతాయి. ఈ మార్గాల్లో ఎన్నో ఇప్పుడు జనావాసాలుగా మారిపోయాయి. ఫలితంగా వాటి కదలికలకు చిక్కు ఏర్పడుతోంది. ఏటా 40– 50 ఏనుగులు కరెంట్ షాక్ కారణంగా చనిపోతున్నాయని అంచనా. తమిళనాడులోని ధర్మపురి జిల్లాలో విద్యుదాఘాతానికి మూడు ఏనుగులు బలైన వారానికే 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' డాక్యుమెంటరీకి అస్కార్ అవార్డు రావడం గమనార్హం. భారత వారసత్వ జంతువైన ఏనుగులను కాపాడుకునేందుకు ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నది ఈ డాక్యుమెంటరీ ఇచ్చిన సందేశం. 2010లోనే 'ఎలిఫెంట్ ఎక్స్‌పర్ట్ టాస్క్‌ఫోర్స్' సమర్పించిన కార్యాచరణ ప్రణాళికనూ కలిసికట్టుగా అమలు చేయాలి.

జంతువులేవైనా పసితనంలో అపురూపమైన ముగ్ధత్వాన్ని కలిగి ఉంటాయి. గున్న ఏనుగులైతే మరీనూ. ఒక అనాథ గున్న ఏనుగు కథ అందరినీ భావోద్వేగంతో కదిలించడంలో ఆశ్చర్యం లేదు. ఆ కథేమిటో చూడాలంటే కార్తికీ గోంజాల్వెజ్ తొలిసారి దర్శకత్వం వహించిన డాక్యుమెంటరీ 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' చూడాల్సిందే. ఆస్కార్ అవార్డు పొందిన ఈ చిన్న డాక్యుమెంటరీ ఓ అనాథ గున్న ఏనుగుకూ, వయసు మీదపడ్డ సంరక్షక దంపతులకూ మధ్య నడిచిన భావోద్వేగాల కథ. తమిళనాడు అటవీశాఖ నిర్వహిస్తున్న ఓ ఏనుగుల క్యాంపులో ఈ కథ నడుస్తుంది. తమిళనాడులోని ధర్మపురి జిల్లాలో విద్యు దాఘాతానికి మూడు ఏనుగులు బలైన వారానికే ఈ డాక్యుమెంటరీకి అస్కార్ అవార్డు వచ్చింది. సోషల్ మీడియాలో పోస్ట్ అయినది చూస్తే అందులో రెండు గున్న ఏనుగులు తల్లి, పిన్నిల దగ్గర నిలుచుని ఆ ఘటనా స్థలాన్ని వీడేందుకు అస్సలు ఇష్టపడలేదు. ఇలాంటి హృదయ విదారకమైన దృశ్యాలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయి. పంట రక్షణ కోసం ఓ రైతు వేసుకున్న ముతక విద్యుత్తు కంచె (ఇది చట్ట వ్యతిరేకం) ఆ ఏనుగుల చావుకు కారణమైంది. సాధారణంగా ఏను గులు రాత్రుళ్లే గ్రామీణ జనావాసాలను దాటుతుంటాయి.

ఆ డాక్యుమెంటరీలో చూపిన గున్న ఏనుగు రఘు కూడా విద్యుదాఘాతం వల్లనే తల్లిదండ్రులను కోల్పోయాడు. బలహీనంగా ఉన్నాడన్న కారణంగా మంద వదిలేసింది. సకాలంలో తమిళనాడు అటవీ శాఖ ఆదుకోవడం రఘు చేసుకున్న అదృష్టం. ఈ అదృష్టం దక్కని ఏనుగు పిల్లలు బోలెడున్నాయి. డాక్యుమెంటరీలో చూపిన బెల్లీ, బొమ్మన్ దంపతులు మధుమలై అటవీ ప్రాంతంలోని తెప్పకాడు ఏనుగుల క్యాంపులో పనిచేస్తున్నారు. వీరు ఏనుగులకు తర్ఫీదునిచ్చే కుట్టునాయకన్ తెగకు చెందినవారు.

ప్రాణాలు తీస్తున్న కరెంటు

'స్టెప్స్ అండ్ గ్రీన్ ఎర్త్ ఫౌండేషన్' వ్యవస్థాపకుల్లో ఒకరైన సాగ్నిక్ సేన్ గుప్తా సమాచార హక్కు చట్టం కింద తెలుసుకున్న సమాచారం ప్రకారం, 2012–13 నుంచి 2022–23 మధ్యకాలంలో దేశం మొత్తమ్మీద 630 ఏనుగులు విద్యుదాఘాతాల కారణంగా మరణించాయి. అత్యధికంగా అసోం (120), ఒడిశా (106), తమిళనాడు (89) ఇందులో ఉన్నాయి. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే. కొంతమంది నిపుణుల అంచనాల ప్రకారం ఏటా కనీసం 40– 50 ఏనుగులు కరెంట్ షాక్ కారణంగా చనిపోతున్నాయి. 'నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్' మాజీ అధ్యక్షుడు బిశ్వజీత్ మొహంతి ఒడిశాలో ఏనుగుల ఊచకోతలు, విద్యుదాఘాతాలపై చాలాకాలంగా గళమెత్తుతున్నారు. 2019–22 మధ్యకాలంలోనే ఈ రాష్ట్రంలో 245 ఏనుగులు హతమైనట్లు స్వయంగా ఆ రాష్ట్ర మంత్రి అసెంబ్లీలో ప్రకటించిన విషయం ఇక్కడ గమనార్హం.



పదేళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు దేశం మొత్తమ్మీద రాత్రిపూట వెలుగులు ఎక్కువయ్యాయి. ఈ విషయాన్ని 'నాసా' తయారు చేసే 'నైట్ టైమ్ లూమినాసిటీ' మ్యాపులు చెబుతున్నాయి. 2021–22 ఎకనమిక్ సర్వే పదకొండవ ఛాప్టర్‌లో వెల్లడించిన ప్రకారం, రాత్రిపూట ప్రకాశం అనేది పదేళ్ల క్రితంతో పోలిస్తే 40 శాతం ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో, సుదూర ప్రాంతాల్లో ఈ కృత్రిమ విద్యుత్తు వెలుగులు ఎక్కువైన కొద్దీ ప్రకృతికి జరిగే నష్టం కూడా అంతే పెరుగుతోంది. వేలాడే విద్యుత్తు తీగలు జీవజంతువులకు కలిగించే నష్టం దీనికి అదనం. ఈ అనవసర ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు ఇన్సులేషన్ తో కూడిన విద్యుత్తు తీగలను వాడాలనీ, లేదా భూగర్భ కేబులింగ్‌ను ఉపయోగించాలనీ 2019లోనే 'నేషనల్ బోర్డు ఫర్ వైల్డ్‌లైఫ్' సూచించింది.

దారి తప్పిస్తున్న పరిస్థితులు

వాస్తవానికి ఏనుగులను ఒకచోట బంధించి, లేదా నియంత్రించి ఉంచడం సాధ్యం కాదు. అవి సంచారజాతికి చెందిన భారీ జీవాలు. తరాలుగా తమ జన్యువుల్లోకి చేరిన ప్రాచీన అరణ్య మార్గాల ఆధారంగా తిరుగుతూంటాయి. ఈ మార్గాల్లో ఎన్నో ఇప్పుడు జనావాసాలుగా మారిపోయాయి. ఫలితంగా వాటి కదలికలకు చిక్కు ఏర్పడింది. ఏనుగుల్లాంటి భారీ క్షీరదాలను కాపాడుకోవాలంటే అడవుల మధ్య అనుసంధానత చాలా కీలకం. మన అభివృద్ధి పనుల కారణంగా అటవీ ప్రాంతాలు తగ్గిపోతూండటంతో సమస్యలేర్పడుతున్నాయి. గత నెలలో హరిద్వార్ ప్రాంతంలో ఏనుగుల మంద ఒకటి, పిల్ల ఏనుగులతో కలిసి కాంక్రీట్ జనారణ్యాన్ని దాటేందుకు నానా తిప్పలు పడటం ఓ వీడియోలో బంధితమైంది.

ఆసియా ఏనుగుల సంఖ్య దేశంలో సుమారు 27–30 వేల వరకూ ఉంటుందని అంచనా. అయితే అభయారణ్యాలు, జాతీయ పార్కుల్లో కంటే ఇతర ప్రాంతాల్లోనే చాలా ఏనుగులు ఉంటాయన్నది చాలామందికి తెలియదు. ఒక అంచనా ప్రకారం మొత్తం ఏనుగుల్లో సురక్షిత ప్రాంతాల బయట ఉన్నవి 70 – 80 శాతం. మనుషులు, ఏనుగుల మధ్య ఘర్షణ పెరుగుతూండటం; పశ్చిమ బెంగాల్, కేరళ, అసోం, ఒడిశా, తమిళనాడుల్లో వీటి సంరక్షణ కీలకమైన స్థితికి చేరుకోవడం ఆందోళనకరమైన అంశమే.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఏనుగు తల ఉన్న వినాయకుడిని మనం ఇంట్లో పూజిస్తాం. కానీ అడవుల్లో నివసించే ఏనుగులంటే మాత్రం ప్రేమ చూపం. వాతావరణ మార్పుల కారణంగా సహజసిద్ధంగా అడవుల్లో లభించే తిండి కూడా తగ్గిపోవడంతో ఇవి మనిషి పండించే పంటలకు అలవాటు పడిపోతున్నాయి. ఈ అటవీ ఏనుగుల సమస్య పరిష్కారమెలాగో అధికారులకూ అంతుపట్టడం లేదు. కొంతమంది నిపుణుల అంచనాల ప్రకారం, అటవీ ఏనుగుల జనాభా కూడా పెరుగుతోంది. వీటికి కుటుంబ నియంత్రణ చర్యలు చేపట్టడం గురించిన సాధ్యాసాధ్యాలపై ఒకవైపు చర్చ నడుస్తూండగా, వాటిని వధించాలన్న గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి.

కాగితాలకే పరిమితమైన సూచనలు

మనుషుల్లాగే ఏనుగులూ కుటుంబాలతో కూడి ఉంటాయి. సున్నితమైన మనస్తత్వంతో కూడిన తెలివైన జాతి అది. మనుషులతో ఘర్షణ సందర్భంలో విద్యుదాఘాతానికి గురై తల్లిదండ్రులను కోల్పోతే ఓ గున్న ఏనుగు ఎంత మానసిక ఇబ్బందికీ, ఆవేదనకూ గురవుతుందో ఊహించుకోవచ్చు. ఇలాంటి ఏనుగు పిల్లలు ప్రతికూల వాతావరణంలో పెరిగితే ఎదురయ్యే పరిణామాలను ఊహించడం కూడా కష్టమేమీ కాదు.

2010లో ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్ 'గజ: సెక్యూరింగ్ ద ఫ్యూచర్ ఫర్ ఎలిఫెంట్స్ ఇన్ ఇండియా' పేరుతో ఒక నివేదికను సమర్పించింది. చాలా సలహా సూచనలు చేసింది కానీ ఆసియా ఏనుగును జాతీయ వారసత్వ జంతువుగా ప్రకటించడం ఒక్కటే అమల్లోకి వచ్చింది. తాజాగా ఏనుగుల ఆవాసాలున్న దేశాల నిపుణులు '11వ ఆసియన్ ఎలిఫెంట్ స్పెషలిస్ట్ గ్రూప్ మెంబర్స్' సమావేశాలు ఇండియాలో జరపనున్నారు. అలాగే ఏప్రిల్ 6, 7 తేదీల్లో కాజీరంగా నేషనల్ పార్క్‌లో బ్రహ్మాండమైన 'గజ్ ఉత్సవ్' నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏనుగుల సంరక్షణకు ఇవి సరిపోతాయా? 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' డాక్యుమెంటరీ ఇస్తున్న సందేశం, సంకేతం ఒక్కటే. వేర్వేరు ప్రభుత్వ విభాగాల మధ్య అత్యవసరంగా సమన్వయం కుదరాలి. కలిసికట్టుగా జాతీయ వారసత్వ జంతువైన ఏనుగును కాపాడుకునేందుకు టాస్క్‌ఫోర్స్ నివేదికలోని సలహా సూచనలు అమలు చేయాలి!

వ్యాసకర్త రచయిత, వైల్డ్‌లైఫ్ కన్సర్వేషనిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

విశ్వ వనిత



కల్పనా చావ్లా జయంతి (మార్చ్ 17) సందర్భంగా ఆమె జీవితాన్నీ, ఆమె ఇచ్చి వెళ్లిన అంతరిక్షస్థాయి స్ఫూర్తినీ వేడుకగా జరుపుకొందాం. పెద్ద కలల్ని కని, వాటిని సాకారం చేసుకున్న ధీశాలికి నిండు మనసుతో నివాళి.

– ఝులన్ గోస్వామి, క్రికెటర్

సర్వరోగ నివారిణి



ఆరోగ్యానికి కనీసం 6 నుంచి 8 గంటల నిద్ర అవసరం. రాత్రి 10–11 గంటల మధ్య నిద్రకు ఉపక్రమించడం ముఖ్యం. అందరికీ ప్రపంచ నిద్ర దినోత్సవ (మార్చ్ 17) శుభాకాంక్షలు.

– వి. మోహన్, డయాబెటాలజిస్ట్

అలా ఉండాలి



రాహుల్ గాంధీ నానమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఏనాడూ మన దేశం గురించిన పశ్చిమ దేశాల విమర్శలకు విలువ ఇచ్చేవారు కాదు. ఆర్యభట్ట ప్రయోగం, పోఖ్రాన్ అణు పరీక్షలపై నోరెత్తిన దేశాల పట్ల కూడా ఆమె 'డోంట్ కేర్' అనే ధోరణితోనే వ్యవహరించారు.

– రాహుల్ శివశంకర్, సంపాదకుడు

పార్లమెంటేరియన్‌లు



మునుపు ఇలా ఉండేది కాదు. అంతా దేశ అభివృద్ధికి, ఐక్యతకు కలసి పని చేసేవారు. అధికార పార్టీ ఎంపీలు విపక్ష ఎంపీలను లంచ్‌కి, డిన్నర్‌కు పిలిచేవారు. సభ వెలుపల విభేదాలు పరిష్కారం అయ్యాక పార్లమెంటు నడిచేది.

– ప్రవేశ్ జైన్, కామెంటేటర్

మారిన సంబోధన



మీ అందరినీ ఉద్దేశించి ఎప్పటిలా నేను సంబోధించడం లేదని దయచేసి గమనించండి. మనం ఇప్పుడు లింగ వైవిధ్యం కలిగి ఉండి, సులభంగా మనస్తాపం చెందే దేశంలో జీవిస్తున్నాం కనుక నా 'గౌరవనీయ అతిథులారా...' 'ఇండియా టుడే' కాన్‌క్లేవ్ 20వ ఎడిషన్‌కు మీకు స్వాగతం.

– అరుణ్ పురీ, సంపాదకుడు

ఘరానా సందర్శన



ప్రధాన మంత్రి కార్యాలయ 'అడిషనల్ డైరెక్టర్' ఒకరు జమ్ము–కశ్మీర్‌ను సందర్శిస్తున్నారని తెలిసి ప్రొటోకాల్ ప్రకారం అతడికి పూర్తి భద్రతను కల్పించారు. అయితే అతడు కిరణ్ పటేల్ అనే మోసగాడు అని బయటపడింది. దాంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. మన ఇంటెలిజెన్స్ విభాగానికి ఏమైంది?!

– యాసిర్ ముస్తాక్, జర్నలిస్ట్

అదంత ముఖ్యమా!



బడ్జెట్ సెషన్‌లో ఎంతో ముఖ్యమైన ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం పొందవలసిన పనిని ముందు పెట్టుకుని కూడా, క్షమాపణల కోసం (రాహుల్ గాంధీ కామెంట్‌ల విషయంలో) అధికారపక్షం పట్టుపట్టి కూర్చోవడం ఏమిటి! లేని సమస్యపై అనవసర రాద్ధాంతం చేస్తూ పార్లమెంటును స్తంభింపజేస్తున్నారు.


– శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

'హరి అవతారమితడు...'

తన జీవిత కాలంలో ఏకంగా 32 వేల సంకీర్తనలను రచించి శ్రీవేంకటేశ్వర స్వామికి సమర్పించిన పరమ భక్తాగ్రేసరుడు తాళ్ళపాక అన్నమాచార్యులు. 1408 మే 9వ తేదీన వైశాఖ శుద్ధ పూర్ణిమ నాడు నారాయణ సూరి, లక్కమాంబ దంపతులకు కడప జిల్లా రాజంపేట మండలం తాళ్ళపాక గ్రామంలో జన్మించాడు. తల్లిదండ్రులు అన్నం అంటే పరబ్రహ్మ స్వరూపం అనే భావనతో 'అన్నమయ్య' అని పేరు పెట్టారు.

ఎనిమిదేళ్ల వయసులోనే అన్నమయ్యకు లౌకిక బంధాలపై విరక్తి కలిగింది. ఒకరోజు పొలంలో ఉన్న అన్న మయ్య... గోవింద నామం చేస్తూ తిరుమల వెళ్తున్న భక్తుల బృందాన్ని చూసి ఆకర్షితుడై వాళ్లతో కలిసి పోయాడు. తిరుమల కొండపైకి చేరిన అన్నమయ్య... స్వామి పుష్కరిణిలో స్నానం చేసి శ్రీవారి గుడిలో ప్రవేశించి శ్రీ వేంకటేశ్వరుని దివ్య మంగళ స్వరూపాన్ని చూసి తన్మయత్వంలో 'కంటి నఖిలాండకర్త నధికునిగంటి' అంటూ కీర్తించాడు. ఇక అప్పటి నుండి తిరుమల శ్రీవారి సంకీర్తనా కైంకర్యంలో మునిగి తేలిన అన్నమయ్యకు పదహారేళ్ళ వయసులోనే శ్రీనివాసుని దర్శనం కలిగిందంటారు.



అన్నమయ్య రాసిన 32వేల సంకీర్తనలలో మనకు అవన్నీ అందుబాటులో లేవు. లభ్యమైన వాటిల్లో భక్తి, వైరాగ్య, శృంగార కీర్తనలతో పాటు... లాలి పాటలు, జోల పాటలు, వెన్నెల పాటలు, గొబ్బిపాటలు, జాజర పాటలు, జానపదాలు ఉన్నాయి. అన్నమయ్య సంకీర్తనల్లో ఒకవైపు ఆధ్యాత్మిక దృష్టి, మరోవైపు సామాజిక దృష్టి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. సరళమైన పదాలతో, జన బాహుళ్యానికి అర్థమయ్యే రీతిలో కీర్తనలను రచించి పద కవితా ప్రక్రియకు సము న్నత స్థానం కల్పించాడు. ఆబాలగోపాలాన్ని అలరించేందుకు తన పదాలకు సంగీతాన్ని జోడించి వాగ్గేయకారుడయ్యాడు.

'ఏ కులజుడైన నేమి, ఎవ్వడైననేమి' వంటి కీర్తనలతో ఆరు శతాబ్దాల క్రితమే కులతత్వాన్ని ఘాటుగా నిరసించిన సంస్కర్త అన్నమయ్య. 'బ్రహ్మ మొక్కటే, పర బ్రహ్మమొక్కటే' అంటూ ఆనాడే సమతావాదాన్ని తన కీర్తనల ద్వారా చాటి చెప్పాడు.

ఆనంద నిలయుడైన శ్రీ వేంకటేశ్వరుని పూజలు, ఉత్సవాలు, ఊరేగింపులు, సేవలు, తీర్థాలు, యాత్రా విశేషాలు కళ్ళకు కట్టినట్టు తన కీర్తనల్లో వర్ణించాడు అన్నమయ్య. తన జీవితాన్నీ, సాహిత్యాన్నీ, సంగీతాన్నీ శ్రీవేంకటేశ్వరునికి అర్పించి నిస్వార్థంగా సార్థకమైన జీవితాన్ని గడిపిన అన్నమయ్య 1503వ సంవత్సరంలో శ్రీవారిలో ఐక్యమయ్యాడు. అందుకే అన్నమయ్యను 'హరి అవతారమితడు అన్న మయ్య' అంటూ కీర్తించాడు తాళ్ళపాక చిన్న తిరుమలాచార్యులు. అటువంటి పరమ భక్తాగ్రేసరుడు 'తాళ్ళపాక అన్నమాచార్యుల' వర్ధంతి సందర్భంగా ఆ మహా భాగవతోత్తమునికి శతసహస్ర వందనాలు.

– డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాసవర్మ, విశాఖపట్నం
మొబైల్: 98486 93373
(నేడు అన్నమయ్య 520వ వర్ధంతి)

ఆపత్కాలంలో వెలుగు దివ్వే 'కృష్ణపట్నం'!

సందర్భం



ఎల్. రఘురామిరెడ్డి

దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగిపోతున్న నేపథ్యంలో 'శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం' (ఎస్‌డీఎస్‌టీపీఎస్)లోని 800 మెగావాట్ల సామర్థ్యం గల మూడో యూనిట్ మార్చి 9వ తేదీన వాణిజ్య ఉత్పత్తి (సీఓడీ) నమోదుచేసుకుని రాష్ట్రానికి వెలుగుదివ్వెగా మారింది. ఎన్నో అటుపోట్లను అధిగమించి రూ. 8238.31 కోట్ల ఖర్చుతో నిర్మితమై తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద విద్యుదుత్పాదక కేంద్రంగా 'కృష్ణపట్నం' రికార్డు నమోదు చేసుకుంది. దేశంలో ప్రభుత్వ రంగంలో రూపుదిద్దుకున్న మొట్టమొదటి 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ఇదే. ఏపీ జెన్‌కో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు 'డిస్కం'ల భాగస్వామ్యంతో 'స్పెషల్ పర్పస్ వెహికిల్' కింద ఏర్పాటైన 'ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్' (ఏపీపీడీసీఎల్) స్టేజ్–1కింద కృష్ణపట్నంలో రెండు యూనిట్లు నిర్మించి 2015లో 1600 మెగావాట్ల విద్యుదుత్పత్తికి శ్రీకారం చుట్టింది. ఇప్పుడు మూడో యూనిట్ ఉత్పత్తి ప్రారంభించడంతో ఏపీ జెన్‌కో, ఏపీపీడీసీఎల్ రోజువారీ థర్మల్ విద్యుదుత్పత్తి సామర్థ్యం 5,010 నుంచి 5,810 మెగావాట్లకు పెరిగింది. డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రంలో తుది మెరుగులు దిద్దుకుంటున్న యూనిట్ ప్రారంభమైతే మరో 800 మెగావాట్లు అందుబాటులోకి వస్తుంది.

వేసవి తీవ్రత ఎక్కువయ్యేకొద్దీ విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోంది. రాష్ట్రంలో గత ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలతో పోల్చితే ఈ ఏడాది ఇవే నెలల్లో రోజువారీ సగటు విద్యుత్ డిమాండ్ 10 శాతంపైగా పెరిగింది. రానున్న అధిక విద్యుత్ డిమాండ్‌కు తగినట్లు విద్యుదుత్పత్తి పెంచుకోవాలని కేంద్ర విద్యుత్ శాఖ దేశవ్యాప్తంగా ఉన్న 'జెన్ కో'లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా గతంలో మూసివేయాలని నిర్ణయించిన థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో కూడా ఉత్పత్తి చేయాలనీ, విదేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకోవాలనీ కేంద్ర విద్యుత్ శాఖ ఇటీవల అన్ని రాష్ట్రాలనూ ఆదేశించింది.

ఉత్పత్తి – డిమాండ్ మధ్య భారీ అంతరం వల్ల విద్యుత్



ధరలు చుక్కలంటే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం జాతీయ పవర్ ఎక్స్ఛేంజ్‌లో యూనిట్ విద్యుత్ ధర రూ. 8.80 ఉంది. ఇది రోజురోజుకూ పెరిగే సంకేతాలు కనిపిస్తున్నాయి. కేంద్ర ఇంధన శాఖ, కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్సీ) కూడా విద్యుత్ విక్రయ ధరలు పెరుగతాయని స్పష్టమైన అంచనాకు వచ్చాయి. గతంలో డిమాండు అధికంగా ఉన్న సమయంలో దేశీయ పవర్ ఎక్స్ఛేంజ్‌లో యూనిట్ రూ. 20 వరకూ ధర పలికింది. ఈ ఏడాది వేసవిలో విద్యుత్ డిమాండ్ భారీగా ఉంటుందనే అంచనాల నేపథ్యంలో ధరలు మరింత పెరిగే అవకాశముందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళన చెందుతున్నాయి.

ఇటువంటి క్లిష్ట సమయంలో 'కృష్ణపట్నం' మూడో యూనిట్ అందుబాటులోకి రావడం ఆంధ్రప్రదేశ్‌కు కొంతవరకూ ఉపశమనమనే చెప్పాలి. స్టేజ్ –2లో భాగంగా ఈ యూనిట్–3 ప్రారంభం కావడంవల్ల వినియోగదారులకు ఆ మేరకు తక్కువ ధరకు విద్యుత్ అందించే వెసులుబాటు డిస్కమ్‌లకు లభించినట్లే. దేశీయ పవర్ ఎక్స్ఛేంజ్ నుంచి అధిక మొత్తం చెల్లించి విద్యుత్ కొనుగోలు చేయాల్సిన భారం రాష్ట్ర ప్రభుత్వానికి తగ్గనుంది.

కృష్ణపట్నంలోని విద్యుదుత్పత్తి వ్యయం యూనిట్‌కు రూ. 4.40 అవుతోంది. ఇదే ధరకు ఏపీజెన్‌కో/ఏపీపీడీసీఎల్ నుంచి విద్యుత్ డిస్కమ్‌లకు సరఫరా అవుతుంది. అంటే ఎక్స్ఛేంజ్‌లో భారీ ధరకు విద్యుత్ కొనాల్సిన అవస్థ డిస్కమ్‌లకు తగ్గుతుందన్నమాట. అదే దామాషాలో ప్రభుత్వానికి, రాష్ట్ర వినియోగదారులకు డబ్బు ఆదా అవుతుందనడంలో ఏ సందేహమూ లేదు.

కృష్ణపట్నం విద్యుత్ కేంద్రానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది రాష్ట్రంలోని ఏకైక కోస్టల్ బేస్డ్ పవర్ ప్లాంట్. దీనికి సముద్ర మార్గంలోనే బొగ్గు సరఫరా అవుతుంది. దేశీయ, విదేశీ బొగ్గు రకాలు రెండింటినీ ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా ప్రాజెక్ట్ డిజైన్ అయింది. బంగాళాఖాతం నుంచి సముద్ర నీటిని వినియోగించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఏకైక ప్రాజెక్టు ఇదే. ఇన్ని ప్రత్యేకతలున్న ఈ ప్రాజెక్ట్ రాష్ట్రానికి వెలుగురేఖగా మారింది.

వ్యాసకర్త ఏపీ జెన్‌కో సీనియర్ ప్రజాసంబంధాల అధికారి
మొబైల్: 99121 99484

క్లుప్తంగా...

మళ్లీ తెరపైకి జమిలి ఎన్నికల అంశం

న్యూఢిల్లీ: లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాధనాన్ని భారీగా ఆదా చేయవచ్చునని శుక్రవారం కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో చెప్పింది. జమిలి ఎన్నికలనే భారీ కసరత్తుని ప్రారంభించడానికి ముందు చేయాల్సిన అత్యవసర పనులైన అన్ని రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయాన్ని తీసుకురావడం, రాజ్యాంగాన్ని సవరించడం వంటి ఎలాంటి చర్యలు చేపట్టాలో ఒక జాబితా రూపొందించినట్టు తెలిపింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానమిస్తూ జమిలి ఎన్నికల అంశాన్ని పార్లమెంటరీ ప్యానెల్ క్షుణ్ణంగా పరిశీలించిందని అన్నారు. ఎన్నికల కమిషన్ సహా వివిధ వర్గాలను సంప్రదించి కొన్ని సిఫారసులు చేసిందని తెలిపారు. జమిలి ఎన్నికలు కార్యరూపం దాల్చడం కోసం ఒక మార్గదర్శ ప్రణాళికను రూపొందించడానికి లా కమిషన్ ప్రస్తుతం కసరత్తు చేస్తోందని వివరించారు.

పుతిన్‌పై ఐసీసీ అరెస్టు వారెంట్

ద హేగ్: రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై అరెస్టు వారెంట్ జారీ చేసినట్లు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు(ఐసీసీ) శుక్రవారం వెల్లడించింది. ఉక్రెయిన్‌లో పిల్లలను అపహరించిన ఘటనల్లో ఆయన ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో యుద్ధనేరాలకు పాల్పడినట్లు గుర్తిస్తూ ఈ వారెంట్ జారీ చేసినట్లు ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. పిల్లలను ఇలా చట్టవిరుద్ధంగా మరో దేశానికి తరలించడం యుద్ధనేరమేనని పేర్కొంది. రష్యన్ ఫెడరేషన్ అధ్యక్షుడి కార్యాలయంలో పిల్లల హక్కుల కమిషనర్‌గా పని చేస్తున్న మారియా అలెక్సేయేవ్‌నాను సైతం అరెస్టు చేయాలంటూ ఐసీసీ వారెంట్ జారీ చేసింది.

నేపాల్ ఉపాధ్యక్షుడిగా రాంసహాయ్ యాదవ్

కఠ్మాండు: నేపాల్ ఉపాధ్యక్షుడిగా భారత సంతతికి చెందిన రాంసహాయ్ ప్రసాద్ యాదవ్(52) ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో 8 పార్టీలతో కూడిన అధికార కూటమి అభ్యర్థి యాదవ్, సీపీఎన్–యూఎంఎల్ బలపరిచిన సమీప ప్రత్యర్థి అష్టలక్ష్మీ శాక్యను ఓడించారు. 2008లో నేపాల్ రిపబ్లిక్‌గా అవతరించాక మూడో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన యాదవ్, ప్రస్తుత ఉపాధ్యక్షుడు నంద బహదూర్ పున్ స్థానంలో బాధ్యతలు చేపడతారు. నేపాల్ దక్షిణ ప్రాంతంలోని మాధేష్‌లో మెజారిటీ ప్రజలు భారత సంతతి వారే. మాధేశీలకు ప్రత్యేక హక్కుల కోసం 2007లో ఎగసిన ఉద్యమంలో యాదవ్ చురుకైన పాత్ర పోషించారు.

పార్టీల ఎజెండాలదే పైచేయి

- వరుసగా ఐదో రోజూ స్తంభించిన లోక్‌సభ, రాజ్యసభ
- పట్టువీడని అధికార, విపక్ష సభ్యులు
- రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలన్న బీజేపీ ఎంపీలు
- అదానీపై జేపీసీ ఏర్పాటు చేయాలన్న విపక్షాలు
- ఉభయ సభలు సోమవారానికి వాయిదా



అదానీ వ్యవహారంపై నరేంద్ర మోదీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రతిపక్ష నేతలు శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలో గాంధీ విగ్రహం వద్ద ఉమ్మడిగా ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదానీ అంశంపై విచారణకు జేపీసీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. పార్లమెంట్ ఉభయసభలు వాయిదా పడిన తర్వాత జరిగిన ఈ ధర్నాలో కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతోపాటు డీఎంకే, ఆప్, శివసేన(యూబీటీ), జేఎంఎం, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. ధర్నా కంటే ముందు ప్రతిపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో భేటీ అయ్యారు. ప్రభుత్వంపై ఉమ్మడిగా నిరసన తెలపాలని నిర్ణయించారు. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాలని ఖర్గే ట్విట్టర్‌లో కోరారు.

గాంధీ విగ్రహం వద్ద విపక్షాల ధర్నా

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయసభల్లో ప్రతిష్టంభనకు తెరపడడం లేదు. అధికార, ప్రతిపక్షాలు మెట్టు దిగకపోవడంతో లోక్‌సభ, రాజ్యసభలో కార్యకలాపాలు స్తంభిస్తున్నాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు పునఃప్రారంభమైనప్పటి నుంచీ ఇదే పరిస్థితి. వరుసగా ఐదో రోజు శుక్రవారం సైతం అరుపులు కేకలతో ఉభయసభలు దద్దరిల్లాయి. భారత ప్రజాస్వామ్యాన్ని విదేశీ గడ్డపై కించపర్చిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని అధికార బీజేపీ సభ్యులు, అదానీ ఉదంతంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష సభ్యుల డిమాండ్ చేశారు. ఎవరూ పట్టు వీడకపోవడంతో అర్థవంతమైన చర్చలకు తావు లేకుండా పోయింది. అధికార, ప్రతిపక్షాల అజెండాలదే పైచేయిగా మారింది. దాంతో మరో దారిలేక ఉభయ సభలను సభాపతులు సోమవారానికి వాయిదా వేయాల్సి వచ్చింది. బడ్జెట్ సమావేశాలు ఈ నెల 13న పునఃప్రారంభమైన సంగతి తెలిసిందే. గత ఐదురోజులుగా లోక్‌సభ, రాజ్యసభలో కార్యకలాపాలేవీ సాగలేదు.

స్పీకర్ విజ్ఞప్తి బేఖాతర్

లోక్‌సభ శుక్రవారం ఉదయం ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి ప్రవేశించారు. తమ పార్టీ నేత రాహుల్ గాంధీకి సభలో మాట్లాడే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ బిగ్గరగా నినాదాలు మొదలుపెట్టారు. అదానీ గ్రూప్ అక్రమాలపై విచారణ కోసం ప్రభుత్వం జేపీసీ ఏర్పాటు చేయాల్సిందేనని పునరుద్ఘాటించారు. అధికార బీజేపీ సభ్యులు తమ సీట్ల వద్దే లేచి నిల్చున్నారు. రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు ప్రారంభించారు. దాంతో దాదాపు 20 నిమిషాలపాటు సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. సభకు సహకరించాలంటూ స్పీకర్ ఓం బిర్లా పదేపదే కోరినప్పటికీ ఎవరూ శాంతించలేదు. అలజడి సృష్టించడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపించలేదు, అందరికీ మాట్లాడే అవకాశం ఇస్తా, సభ సజావుగా నడిచేందుకు సహకరించాలి అని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. సభ్యులెవరూ వినిపించుకోకపోవడంతో సభను ఈ నెల 20వ తేదీ వరకూ వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

రాజ్యసభలోనూ అదే పునరావృతం

ఎగువ సభలోనూ గందరగోళం కొనసాగింది. కార్యకలాపాలేవీ సాగకుండానే సభ సోమవారానికి వాయిదా పడింది. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాలని విపక్ష సభ్యులు కోరగా, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని అధికార పక్ష సభ్యులు డిమాండ్ చేశారు. ఇరుపక్షాల ఎంపీలు నినాదాలతో హోరెత్తించారు. రూల్ 267 కింద 11 వాయిదా తీర్మానాల నోటీసులు వచ్చాయని, వాటిని అనుమతించడం లేదని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తేల్చిచెప్పారు. సభలో తాను మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కోరగా, చైర్మన్ నిరాకరించారు. అధికార, విపక్ష సభ్యులు నినాదాలు కొనసాగిస్తుండడంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. అంతకంటే ముందు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ సభలో ఒక ప్రకటన చేశారు. ఈ నెల 20 నుంచి రాజ్యసభలో వివిధ కీలక శాఖల పనితీరుపై చర్చించనున్నట్లు తెలిపారు.

అదొక కొత్త టెక్నిక్: థరూర్

సంసద్ టీవీలో సౌండ్‌ను మ్యూట్ చేయడం ఒక కొత్త టెక్నిక్ అని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఎద్దేవా చేశారు. సభలో ఇకపై ఒక్కో సభ్యుడి మైక్రోఫోన్‌ను ఆపేయాల్సిన అవసరం లేదని, ప్రత్యక్ష ప్రసారంలో శబ్దాలను మ్యూట్ చేస్తే సరిపోతుందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. లోక్‌సభలో తమ పార్టీ సభ్యుల గొంతు నొక్కేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ట్వీట్ చేశారు. సభలో వారు చేసిన నినాదాలు ప్రత్యక్ష ప్రసారంలో వినిపించకుండా చేశారని విమర్శించారు. అయితే, సాంకేతిక సమస్యల వల్లే సభ్యుల నినాదాలు వినిపించలేదని పార్లమెంట్ వర్గాలు వెల్లడించాయి.

మోదీ, అదానీ బంధమేంటి?: ప్రియాంక

ప్రధాని మోదీకి, అదానీకి మధ్య సంబంధం ఏమిటో చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నేత ప్రియాంకాగాంధీ వాద్రా నిలదీశారు. అదానీపై వచ్చిన ఆరోపణలపై ఎందుకు దర్యాప్తు జరిపించడం లేదని నిలదీశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ట్వీట్ చేశారు. మోదీ, అదానీ బంధంపై వెల్లువెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా బీజేపీ మౌనం పాటిస్తోందని తప్పుపట్టారు.

ప్రధాని మోదీపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ శుక్రవారం రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు సభా హక్కుల ఉల్లంఘన నోటీసు అందజేశారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఇంటి పేరును ఆయన కుటుంబ సభ్యులు ఎందుకు ఉపయోగించుకోలేదంటూ మోదీ చేసిన వ్యాఖ్యలపై కేసీ వేణుగోపాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేసే తీర్మానంపై సమాధానం ఇస్తూ ఫిబ్రవరి 9న రాజ్యసభలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. మోదీపై రాజ్యసభ కార్యకలాపాల నిర్వహణ నిబంధనల్లోని రూల్ 188 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తున్నట్లు కేసీ వేణుగోపాల్ తన నోటీసులో పేర్కొన్నారు. నెహ్రూ కుటుంబాన్ని ప్రధాని అవమానించారని ఆక్షేపించారు. నెహ్రూ కుటుంబ సభ్యులైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యులేనని గుర్తుచేశారు. నెహ్రూ ఇంటి పేరును ఆయన కుటుంబ సభ్యులు ఎందుకు వాడుకోలేదని ప్రశ్నించడం అసంబద్ధం, అర్థరహితమని వేణుగోపాల్ తేల్చిచెప్పారు.

పాక్‌లో అగ్ని ప్రమాదం.. 10 మంది సజీవ దహనం

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ పంఖ్తున్వా ప్రావిన్స్‌లో శుక్రవారం సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 10 మంది సజీవ దహనయ్యారు. లోయర్ కొహిస్తాన్ జిల్లాలోని సెరి పట్టన్‌లోని కలపతో నిర్మించిన ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. పైకప్పు కూలి పడి 10 మంది సజీవ దహనం కాగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

20 నుంచి రష్యాలో జిన్‌పింగ్ టూర్

రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపైనే ప్రధానంగా దృష్టి

బీజింగ్: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సోమవారం నుంచి మూడు రోజుల పాటు రష్యాలో పర్యటించనున్నారు. రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో కీలక చర్చలు జరపనున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం చేస్తూ ఏడాది దాటిపోతూ ఉండడంతో ఇరు దేశాల మధ్య శాంతి స్థాపన కోసం చైనా ప్రయత్నిస్తుందన్న వార్తల నేపథ్యంలో జిన్‌పింగ్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ''రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ ఆహ్వానం మేరకు జిన్ పింగ్ మార్చి 20 నుంచి 22 వరకు మాస్కోలో పర్యటిస్తారు'' అని విదేశాంగ శాఖ ప్రతినిధి హువా చునీయింగ్ చెప్పారు. చైనాకు వరసగా మూడోసారి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత జిన్‌పింగ్ తొలి విదేశీ పర్యటన ఇదే. ఇరాన్, సౌదీ అరేబియా మధ్య శాంతి ఒప్పందాన్ని కుదిర్చిన తర్వాత జిన్‌పింగ్ రష్యా పర్యటనకు వెళుతూ ఉండడంతో ఉక్రెయిన్ సంక్షోభం పరిష్కారం అవుతుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇరు దేశాధినేతల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, ఒత్తిడి పెంచుతున్న అంశాలపై చర్చలు జరుగుతాయని



రష్యా ఒక ప్రకటనలో తెలిపింది. రష్యా, చైనాల స్నేహబంధాన్ని చాటి చెప్పడానికి ఈ సమావేశాన్ని ఇరువురు నేతలు వినియోగించుకోనున్నారు.

అస్సాంలోని మదర్సాలన్నిటినీ మూసేస్తాం



బెళగావి: అస్సాంలోని అన్ని మదర్సా (ముస్లిం మత పాఠశాల)లను మూసి వేస్తామని ఆ రాష్ట్ర సీఎం హిమాంత బిశ్వ శర్మ తెలిపారు. ఆధునిక భారతదేశంలో మదర్సాల అవసరం అవసరం లేదని చెప్పారు. 'దేశానికి, అస్సాం రాష్ట్రానికి సేవలు చేసేందుకు అవసరమైన డాక్టర్లు, ఇంజినీర్లు, ఇతర వృత్తి నిపుణులను తయారు చేసే స్కూళ్లు, కాలేజీలతో మాత్రమే అవసరం ఉంది. మదర్సాలతో కాదు'అని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 600 మదర్సాలను మూసివేశాం, మిగతా వాటినీ మూసేస్తామని అన్నారు. కర్ణాటకలోని బెళగావిలో గురువారం రాత్రి జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిత్యం బంగ్లాదేశ్ నుంచి వస్తున్న జనంతో మన సంస్కృతి, ఆచారాలకు ముప్పు ఏర్పడిందన్నారు. 'మన దేశంలో ముస్లింలు, క్రిస్టియన్లమని గర్వంగా చెప్పుకునే వాళ్లు చాలా మంది ఉన్నారు. కానీ, హిందువును అని గర్వంగా చెప్పుకునే వారు కావాలి' అని హిమాంత చెప్పారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు చరిత్రను వక్రీకరించాయని ఆరోపించారు. కాంగ్రెస్‌ను నయా మొఘలుల పార్టీగా అభివర్ణించారు. ఒకప్పుడు మొఘలులు భారత్‌ను బలహీనం చేసేందుకు ప్రయత్నించారు..కాంగ్రెస్ ఇప్పుడదే చేస్తోందన్నారు.

యూపీలో ఆలూ కోల్డ్‌స్టోరేజీలో ప్రమాదం

కుప్పకూలిన పైకప్పు, 14 మంది దుర్మరణం



లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో బంగాళదుంపలు నిల్వ చేసే ఒక కోల్డ్ స్టోరేజీ పైకప్పు కుప్పకూలిపోయిన ఘటనలో 14 మంది మరణించారు. చాందౌసీ పోలీసు స్టేషన్ పరిధిలో ఇందిరా రోడ్డులో ఉన్న ఈ కోల్డ్ స్టోరేజీ పై కప్పు గురువారం రాత్రి హఠాత్తుగా కుప్పకూలింది. ఆ సమయంలో కోల్డ్ స్టోరేజీ లోపల ఆలూ బస్తాలను అన్‌లోడ్ చేస్తున్న వర్కర్లు శిథిలాల కింద చిక్కుకున్నారు. సహాయ సిబ్బంది 24 మందిని ఆలూ బస్తాల నుంచి బయటకు తీసుకురాగా వారిలో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. సహాయ కార్యక్రమాలు దాదాపుగా పూర్తి అయ్యాయని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) ఆఫ్ పోలీసు శలభ మాథూర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆస్పత్రిని సందర్శించిన యోగి బాధితుల్ని పరామర్శించారు. ఈ ప్రమాదం ఎందుకు జరిగిందో తెలుసుకోవడానికి ఒక కమిటీ వేశారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం, గాయపడిన వారికి చికిత్స కోసం రూ.50 వేలు ప్రకటించారు. ప్రమాదం జరిగిన సమయంలో కోల్డ్ స్టోరేజీలో ఉన్న వారిలో ఆరుగురు స్వల్పగాయాలకు చికిత్స తీసుకొని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి కాగా మరో నలుగురికి చికిత్స జరుగుతోందని జిల్లా మేజిస్ట్రేట్ మనీష్ బన్సల్ తెలిపారు. పోలీసులు చెప్పిన సమాచారం ప్రకారం ఈ కోల్డ్ స్టోరేజీని మూడు నెలల క్రితమే నిర్మించారు. ప్రభుత్వం దగ్గర్నుంచి సరైన అనుమతులు లేకుండానే హడావుడిగా దీని నిర్మాణం కొనసాగించినట్టు పోలీసులు చెప్పారు. అంతేకాకుండా కోల్డ్ స్టోరేజీ సామర్థ్యానికి మించి బంగాళ దుంప బస్తాలు నిల్వ చేసినట్టుగా తెలుస్తోంది. ఇవే ప్రమాదానికి దారి తీసినట్టు భావిస్తున్నారు.

భారత వ్యతిరేకి రాహుల్ గాంధీ

- 'టూల్‌కిట్'లో శాశ్వత భాగస్వామి
- దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందే
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా డిమాండ్



న్యూఢిల్లీ: భారత ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందంటూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ లండన్ పర్యటనలో చేసిన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత వ్యతిరేక టూల్‌కిట్‌లో రాహుల్ శాశ్వత భాగస్వామిగా మారాడని ధ్వజమెత్తారు. భారత్‌కు బద్ధవ్యతిరేకి అయిన జార్జి సోరోస్ భాషలోనే రాహుల్ మాట్లాడాడని మండిపడ్డాడు. మన దేశానికి వ్యతిరేకంగా విదేశీ శక్తులు పెద్ద కుట్ర పన్నుతున్నాయని, ఇందులో కాంగ్రెస్‌తోపాటు సోకాల్డ్ వామపక్ష ఉదారవాదులు కూడా భాగమేనని ఆరోపించారు. దేశాన్ని ద్వేషించే కాంగ్రెస్ నాయకులు పాకిస్తాన్ భాషను వాడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు నడ్డా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని విదేశీ శక్తులను కోరిన రాహుల్ గాంధీ దేశ సార్వభౌమత్వంపై దాడి చేశారని, ప్రజలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత్‌లో జోక్యం చేసుకోవాలంటూ అమెరికా, యూరప్ దేశాలను కోరడం కంటే సిగ్గుచేటు మరొకటి ఉండదన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని రాహుల్ ఇంకా అర్థం చేసుకోలేదని, ప్రజలపై ఆయనకు విశ్వాసం లేదని విమర్శించారు. భారత్‌ను ఆర్థికంగా, వ్యూహాత్మకంగా దెబ్బకొట్టడాన్ని విదేశీ కుట్రదారులు పనిగా పెట్టుకున్నారని, రాహుల్ గాంధీ సైతం వారితో చేతులు కలిపాడని దుయ్యబట్టారు. విదేశీ గడ్డపై ఆయన చేసిన పనిని స్వతంత్ర భారతదేశంలో గతంలో ఏ నాయకుడూ చేయలేదని నడ్డా వెల్లడించారు. రాహుల్ ధోరణి దేశంలో ప్రతి ఒక్కరి మనసులను గాయపర్చిందని చెప్పారు. భారత్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న శక్తులు దేశంలో బలహీన ప్రభుత్వం ఉండాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పుడల్లా దేశ వ్యతిరేక ముఠాలు చురుగ్గా మారుతున్నాయని, భారత్‌ను అప్రతిష్ట పాలు చేయడమే లక్ష్యంగా టూల్‌కిట్‌తో ముందుకొస్తున్నాయని జేపీ నడ్డా ఆక్షేపించారు. భారత్‌లో దృఢమైన ప్రజాస్వామ్యం, నిర్ణయాత్మక ప్రభుత్వం ఉన్నాయని, దుష్టశక్తుల ఆటలు సాగవని హెచ్చరించారు.

రాహుల్ వ్యాఖ్యలు జాతివ్యతిరేకం కాదు : శశిథరూర్

తమ నేత రాహుల్ గాంధీ బ్రిటన్‌లో చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి జాతి వ్యతిరేకత లేదని ఆ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. భారత ప్రజాస్వామ్యంలోకి విదేశీ శక్తుల్ని రాహుల్ ఎందుకు రానిస్తారని ప్రశ్నించారు. శుక్రవారం ఇండియా టుడే సదస్సులో శశిథరూర్ రాహుల్ వ్యాఖ్యలు పార్లమెంటు కార్యకలాపాలను స్తంభింపజేసేటంత ప్రధానమైనవా ఆలోచిస్తూ ఉంటే చాలా ఆశ్చర్యంగా ఉందన్నారు. దేశంలో ఎన్నో ప్రజా సమస్యల్ని గాలికొదిలేసిన బీజేపీ రాహుల్ నుంచి క్షమాపణ కోరుతూ రాజకీయం చేయడం విడ్డూరమన్నారు.

మాజీ అగ్నివీర్‌లకు సీఐఎస్‌ఎఫ్‌లో 10% రిజర్వేషన్

న్యూఢిల్లీ: మాజీ అగ్నివీర్‌లకు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్‌ఎఫ్)లో 10% రిజర్వేషన్ కల్పిస్తామని కేంద్ర హోం శాఖ ప్రకటించింది. ఈ మేరకు సీఐఎస్‌ఎఫ్ చట్టం–1968లోని నిబంధనలను సవరించినట్లు వెల్లడించింది. మాజీ అగ్నివీర్‌లకు బీఎస్‌ఎఫ్ ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్ అమలు చేస్తామంటూ వారం క్రితం ప్రకటించిన కేంద్రం తాజాగా ఈ మేరకు ఒక నోటిఫికేషన్ విడుదల చేయడం గమనార్హం. అంతేకాకుండా, మొదటి బ్యాచ్ అగ్నివీర్‌లకైతే ఐదేళ్ల వరకు, తర్వాతి వారికి మూడేళ్ల వరకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుందని వివరించింది. మాజీ అగ్నివీర్‌లకు ఫిజికల్ ఎఫిసియెన్సీ పరీక్ష నుంచి మినహాయింపు కూడా ఉంటుందని తెలిపింది. గత ఏడాది తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకంలో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లోకి ఎంపికైన 17.5–21 ఏళ్ల అభ్యర్థు(అగ్నివీర్)లు నాలుగేళ్లపాటు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేయాల్సి ఉంటుంది. అగ్నివీర్‌లలో 25% మందిని నాలుగేళ్ల తర్వాత రెగ్యులర్ సర్వీసుల్లోకి తీసుకుంటారు.

ఎయిరిండియాలో మళ్లీ వీఆర్‌ఎస్

న్యూఢిల్లీ: ఎయిరిండియా సంస్థ మరోసారి తమ నాన్‌–ఫ్లయింగ్ సిబ్బంది కోసం స్వచ్ఛంద విరమణ పథకం(వీఆర్‌ఎస్)ను ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం అధీనంలోని నష్టాల్లో ఉన్న ఎయిరిండియాను గత ఏడాది జనవరిలో టాటా గ్రూప్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. టాటాల అధీనంలోకి వచ్చాక ఉద్యోగులకు వీఆర్‌ఎస్ అవకాశం ఇవ్వడం ఇది రెండోసారి. 40 ఏళ్లు, ఆపై వయస్సు వారు, సంస్థలో కనీసం ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న పర్మినెంట్ జనరల్ కేడర్ అధికారులకు ఇది వర్తిస్తుందని ఎయిరిండియా తెలిపింది. కనీసం ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న క్లరికల్, నిపుణులు కాని కేటగిరీల ఉద్యోగులూ వీఆర్‌ఎస్‌కు అర్హులే. మొత్తం 11వేల మంది ఉద్యోగుల్లో అర్హులైన 2,100 మంది ఏప్రిల్ 30వ తేదీలోగా వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించింది.

ఎట్టకేలకు కోర్టుకు ఇమ్రాన్‌ఖాన్

లాహోర్: పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ చీఫ్, మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్(70) ఎట్టకేలకు కోర్టు మెట్లెక్కారు. ప్రభుత్వం తనపై అక్రమంగా కేసులు పెట్టిందంటూ ఆయన ఇస్లామాబాద్ జిల్లా కోర్టు ఫిబ్రవరి 28వ తేదీన జారీ చేసిన వారెంట్లను బేఖాతరు చేస్తూ వచ్చారు. తోషఖానా కేసులో నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్లతో ఇంటికి ఇమ్రాన్ నివాసానికి వెళ్లిన పోలీసులను ఆయన మద్దతుదారులు తీవ్రంగా ప్రతిఘటించారు. బుధవారం కోర్టుల జోక్యంతో ఇమ్రాన్ నివాసం వద్ద ఉద్రిక్తతలు చల్లారాయి. తాజాగా, శుక్రవారం ఇస్లామాబాద్ హైకోర్టు ఇమ్రాన్‌పై ఉన్న నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్‌ను ఈ నెల 18వ తేదీ వరకు సస్పెండ్ చేసింది. దీంతో ఆయన లాహోర్ హైకోర్టుకు వచ్చారు. తనపై ఉన్న 9 కేసులకు సంబంధించి ముందస్తు బెయిలివ్వాలని పిటిషన్ వేశారు. దీంతో, ఆయనపై ఉన్న తీవ్రవాద సంబంధ, సివిల్ కేసుల్లో బెయిల్ పిటిషన్లను విచారించేందుకు న్యాయస్థానం అంగీకరించింది. ప్రభుత్వానికి, ఇమ్రాన్‌కు మధ్య విభేదాల పరిష్కారానికి అంగీకారం కుదిరిందని, వివరాలను కోర్టుకు అందజేస్తామని పీటీఐ నేత ఒకరు ట్వీట్ చేశారు.

మరో 5 రోజులు ఈడీ కస్టడీలోనే సిసోడియా

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కస్టడీని కోర్టు మరో ఐదు రోజులు పొడిగించింది. ఈడీ అధికారులు శుక్రవారం సిసోడియాను స్పెషల్ జడ్జి ఎంకే నాగ్‌పాల్ ఎదుట హాజరుపరిచి, మరో వారం పాటు కస్టడీని పొడిగించాలని కోరారు. కస్టడీలో ఆయన కీలక సమాచారం అందించారని, సహ నిందితులైన రాహుల్ సింగ్, దినేశ్ అరోరా, అమిత్ అరోరాలతో కలిపి విచారించాల్సి ఉందని వివరించారు. అయితే, జడ్జి సిసోడియా కస్టడీని 5 రోజులపాటు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇదే కేసులో సిసోడియాను ఫిబ్రవరి 26న సీబీఐ అరెస్ట్ చేసి తిహార్ జైలుకు తరలించగా, ఈడీ అధికారులు మార్చి 9వ తేదీన అరెస్ట్ చేశారు.

కాంగ్రెస్, బీజేపీలకు సమదూరం



శుక్రవారం కోల్‌కతా కాళీఘాట్ ప్రాంతంలోని తన నివాసానికి వచ్చిన అఖిలేశ్‌కు కండువా కప్పి స్వాగతం పలుకుతున్న మమతా బెనర్జీ

ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్‌తో కలిసి ఉమ్మడిగా బీజేపీని ఎదుర్కొంటామని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) తెలిపింది. ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ శుక్రవారం టీఎంసీ చీఫ్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీతో కోల్‌కతాలో సమావేశమయ్యారు. మమతతో గంటపాటు జరిగిన చర్చల్లో అఖిలేశ్‌తోపాటు ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు కిరణ్మయ్ నందా పాల్గొన్నారు. అనంతరం అఖిలేశ్ మీడియాతో మాట్లాడారు. తాము దేశంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించామన్నారు. బీజేపీని ఓడించేందుకు టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీకి గట్టి మద్దతునిస్తామన్నారు. ప్రతిపక్ష కూటమిలో ఎలాంటి పాత్ర పోషించాలో నిర్ణయించుకోవాల్సింది కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్యానించారు. తమ పార్టీ బీజేపీ, కాంగ్రెస్‌లకు సమదూరం పాటించనుందన్నారు. రానున్న రోజుల్లో ప్రాంతీయ పార్టీలు తమ కార్యాచరణను ప్రకటిస్తాయని చెప్పారు.

దర్యాప్తు సంస్థలవన్నీ కట్టుకథలు : రాఘవ చద్దా

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ అక్రమాల కేసులో మనీష్ సిసోడియాకు వ్యతిరేకంగా కేంద్ర దర్యాప్తు సంస్థల దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకులు రాఘవ్ చద్దా అన్నారు. సిసోడియాపై సీబీఐ, ఈడీ కట్టుకథలే చెబుతున్నాయని ఆరోపించారు. మనీ లాండరింగ్ కేసులో అరెస్ట్ చేసిన ఈడీ కూడా సీబీఐ అడిగిన ప్రశ్నలే అడిగిందన్నారు. ఏడు రోజుల రిమాండ్‌లో ఈడీ అధికారులు సిసోడియాను కేవలం 15 గంటలు మాత్రమే ప్రశ్నించారని తెలిపారు. బీజేపీ రాజకీయ కక్ష సాధింపు చర్యల వల్లే సిసోడియా జైల్లో ఉన్నారని, సీబీఐ దగ్గర, ఈడీ దగ్గర ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఇలా ఉండగా, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా నివసించిన బంగ్లాను ఢిల్లీ మంత్రి అతిషికి కేటాయించారు. ఇటీవల కేబినెట్‌లోకి తీసుకున్న అతిషికి ఈ బంగ్లా కేటాయిస్తూ ఢిల్లీ ప్రజాపనుల శాఖ అధికారికంగా లేఖ పంపింది.

ఎరువులపై సబ్సిడీ తగ్గింపు యోచనేదీ లేదు

న్యూఢిల్లీ: దేశంలో ఎరువులపై ప్రస్తుతమిస్తున్న సబ్సిడీలను తగ్గించే యోచనేదీ లేదని కేంద్రం స్పష్టం చేసింది. లోక్‌సభలో ఒక ప్రశ్నకు రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. ఎరువుల సబ్సిడీల తగ్గింపు ప్రభావం రైతులపై ఏమేరకు ఉంటుందని అంచనా వేసేందుకు ఎలాంటి అధ్యయనం చేపట్టలేదని కూడా వివరించారు. న్యూట్రియెంట్ బేస్ట్ సబ్సిడీ(ఎన్‌బీఎస్) పథకం కింద ఫాస్పరస్– పొటాషియం ఎరువుల ధరల నియంత్రణకు ప్రభుత్వం వద్ద ఎటువంటి ప్రణాళికలు లేవని మరో ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ప్రస్తుతం యూరియా 45 కిలోల బ్యాగ్‌ను నీమ్ కోటింగ్ చార్జీలు, పన్నులు కాకుండా గరిష్ట రిటైల్ ధర రూ. 242కు అందజేస్తున్నామని చెప్పారు.

రకూన్ డాగ్స్ నుంచి కరోనా !

- అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం కొత్త విశ్లేషణ
- వూహాన్ మార్కెట్‌లో సేకరించిన జన్యు నమూనాలతో అధ్యయనం

న్యూయార్క్: కరోనా వైరస్ పుట్టుకపై ఇది మరో కొత్త విశ్లేషణ. ఇన్నాళ్లూ గబ్బిలాల నుంచి ఈ వైరస్ సంక్రమించిందని భావిస్తూ ఉంటే కొందరు అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం శునకాల నుంచి వచ్చిందని తమ పరిశోధనల్లో వెల్లడైనట్టు చెప్పారు. చైనాలోని వూహాన్ సీఫుడ్ మార్కెట్‌లో సేకరించిన జన్యు నమూనాలను అధ్యయనం చేస్తే వూహాన్ మార్కెట్‌లో అమ్ముతున్న రకూన్ డాగ్స్ నుంచే వైరస్ వ్యాప్తి చెందిందని తేల్చారు. ఈ కొత్త విశ్లేషణను న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రచురించింది. జనవరి 2020లో కొందరు శాస్త్రవేత్తలు వూహాన్ మార్కెట్‌లో శాంపిల్స్ సేకరించారు. అప్పటికే కొత్త వైరస్ ఆందోళనతో వూహాన్ మార్కెట్ అంతా ఖాళీ చేయించారు. ఆ మార్కెట్ గోడలపైన, నేలపైన, జంతువుల్ని ఉంచే పంజరాల్లోనూ జన్యు నమూనాలు సేకరించి అధ్యయనం చేశారు. ఆ నమూనాల్లో అత్యధిక భాగం రకూన్ డాగ్స్‌తో సరిపోలాయని శాస్త్రవేత్తల బృందం తేల్చింది. ఈ వివరాలను చైనా శాస్త్రవేత్తలతోనూ వారు పంచుకున్నారు. అయితే ఆ తర్వాత గ్లోబల్ ఇనీషియేటివ్ ఆన్ షేరింగ్ ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా డేటా (జీఐఎస్ఏఐడీ) నుంచి ఈ డేటా మాయం అయిపోయిందని ఆ శాస్త్రవేత్తలు చెప్పారు. అరిజోనా యూనివర్సిటీ, కాలిఫోర్నియాలో స్క్రిప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, సిడ్నీ యూనివర్సిటీ వైరాలజిస్టులు ఈ బృందంలో ఉన్నారు. రకూన్ డాగ్స్ నుంచే మనుషులకి సంక్రమించిందా లేదా అన్నది శాస్త్రవేత్తలు స్పష్టంగా చెప్పలేకపోయారు. శునకాల నుంచి మనుషులకే నేరుగా సోకొచ్చు లేదా ఆ డాగ్స్ నుంచి వేరే జంతువుకి వెళ్లి మనుషులకి సోకి ఉండొచ్చని అన్నారు.

దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నాయి. గత 24 గంటల్లో 796 కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 5 వేలు దాటేసింది. హిమాచల్ ప్రదేశ్, పాండుచ్చేరి, ఉత్తరప్రదేశ్‌లో కరోనా బారిన పడి ఒక్కొక్కరు ప్రాణాలు కోల్పోయారు.

హామీలు అమలు చేయండి



ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం వైఎస్‌ జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి



అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌

- ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వైఎస్‌ జగన్‌ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విభజన హామీల అమలుపై కేంద్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్‌ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లు కావొస్తున్నా, అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన పలు ద్వైపాక్షిక అంశాలు పరిష్కారానికి నోచుకోలేదని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. వాటన్నింటినీ పరిష్కరించి రాష్ట్రానికి తగిన సహకారం అందించాలని కోరారు. రాష్ట్ర విభజన అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ సహా ఇతర కేంద్ర మంత్రులకు విన్నవించేందుకు గురువారం రాత్రి ఢిల్లీకి వచ్చిన వైఎస్‌ జగన్‌.. శుక్రవారం ఉదయం మోదీతో పార్లమెంట్‌లోని ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రధానికి వినతులు అందజేశారు. ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలపై కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ పలు దఫాలుగా చర్చలు జరిపి కొంత పురోగతి సాధించినా, కీలక అంశాలన్నీ ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయనే విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.

రుణ పరిమితి పెంచండి

2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిసోర్స్‌ గ్యాప్‌ ఫండింగ్‌ కింద రూ.36,625 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం వైఎస్‌ జగన్‌ ప్రధానిని కోరారు. రిసోర్స్‌ గ్యాప్‌ ఫండింగ్‌ చేస్తామంటూ పార్లమెంట్‌ సాక్షిగా కేంద్రం చెప్పిందని, దీనిపై సంబంధిత శాఖలకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇదే సమయంలో గత ప్రభుత్వం పరిమితికి మించి రుణాలు తీసుకుందన్న కారణంతో ఇప్పుడు రాష్ట్ర రుణాల పరిమితులపై ఆంక్షలు విధించారని వివరించారు. ఈ ప్రభుత్వం తప్పు లేకపోయినప్పటికీ నిబంధనల ప్రకారం ఇచ్చిన రుణ పరిమితిని కూడా తగ్గించారని చెప్పారు. 2021–22లో రూ.42,472 కోట్ల రుణ పరిమితి కల్పించి, తదుపరి కాలంలో దానిని రూ.17,923 కోట్లకు తగ్గించారన్నారు. కోవిడ్‌ మహమ్మారి సృష్టించిన ఆర్థిక విపత్తు సమయంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని, ఈ విషయంలో జోక్యం చేసుకుని సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

పోలవరానికి అడ్‌హక్‌గా రూ.10 వేల కోట్లు

పోలవరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత గొప్ప సంకల్పంతో ముందుకు సాగుతోందని, ఏపీ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చే దిశగా ప్రాజెక్టు నిర్మాణం సాగిస్తోందని సీఎం.. ప్రధానికి వివరించారు. ఈ ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తే కొద్ది కాలంలోనే ఇది వాస్తవ రూపంలోకి వచ్చి ప్రజలకు ఫలితాలు అందుతాయన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖజానా నుంచి రూ.2600.74 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. గత రెండేళ్లుగా ఈ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బకాయిలను వెంటనే చెల్లించాల్సిందిగా తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. టెక్నికల్‌ అడ్వయిజరీ కమిటీ నిర్ధారించిన పోలవరం ప్రాజెక్టు అంచనాలు రూ.55,548 కోట్లను ఆమోదించాలని విన్నవించారు. తాగునీటి సరఫరా అంశాన్ని కూడా పోలవరం ప్రాజెక్టులో భాగంగా చూడాలని, ప్రాజెక్టు నిర్మాణంలో కాంపొనెంట్‌ వారీగా నిబంధనలు సడలించాలని సూచించారు. ముంపు బాధితులకు వీలైనంత త్వరగా పరిహారం ఇవ్వాలని, ఆలస్యం అవుతున్న కొద్దీ ప్రాజెక్టు వ్యయం పెరిగిపోతుందని తెలిపారు. డీబీటీ పద్ధతిలో ముంపు బాధితులకు ఈ సహాయం అందిస్తే జాప్యాన్ని నివారించవచ్చన్నారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని మరింత వేగవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అడ్‌హక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలని కోరారు.

విభజన అంశాలపై అమిత్‌షాకు వినతి

ప్రధాని మోదీతో భేటీ అనంతరం ఏపీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ కేంద్ర హోంమంత్రి అమిత్‌ షాతో భేటీ అయ్యారు. పార్లమెంట్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన అంశాలను ప్రస్తావించారు. ప్రత్యేక హోదా, తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్‌ బకాయిలు, పోలవరం ప్రాజెక్టుకు సవరించిన అంచనాల ఆమోదం వంటి అంశాలపై మాట్లాడారు. తిరుపతిలో నేషనల్‌ ఫోరెన్సిక్‌ సైన్సెస్‌ యూనివర్సిటీ క్యాంపస్‌ ఏర్పాటు అంశం గురించి ప్రస్తావించినట్లు తెలిసింది.

ప్రధాని దృష్టికి తీసుకెళ్లిన ఇతర అంశాలు ఇలా...

- తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్కోకు రావాల్సిన బకాయిలు అలానే ఉన్నాయి. 2014 జూన్‌ నుంచి 2017 జూన్‌ వరకూ సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి రూ.7,058 కోట్లు రావాల్సి ఉంది. వీటిని వెంటనే ఇప్పించాలి. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద లబ్ధిదారుల ఎంపికలో హేతుబద్ధత పాటించక పోవడంతో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోంది. దీనివల్ల పీఎంజీకేఏవై కార్యక్రమం కిందకు రాని 56 లక్షల కుటుంబాలకు రాష్ట్రమే సొంతంగా రేషన్‌ ఇస్తోంది. తద్వారా దాదాపు రూ.5,527 కోట్ల భారాన్ని మోయాల్సి వస్తోంది. ఈ విషయంలో ఏపీ చేసిన విజ్ఞప్తి సరైనదేనని నీతి ఆయోగ్‌ కూడా నిర్ణయించిన నేపథ్యంలో చర్యలు తీసుకోవాలి. కేంద్రం వినియోగించని రేషన్‌ కోటాను రాష్ట్రానికి కేటాయించాలి.
- రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామంటూ పార్లమెంట్‌ సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. దీనివల్ల రాష్ట్రానికి గ్రాంట్లు, పన్ను రాయితీలు లభిస్తాయి. ఆర్థికంగా రాష్ట్ర ప్రభుత్వానికి మేలు జరుగుతుంది. పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడమే కాకుండా, సేవా రంగం విస్తరిస్తుంది. స్వయం శక్తి దిశగా రాష్ట్రం అడుగులేసేందుకు తోడ్పడుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నా.
- రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేశాం. ప్రతి జిల్లాలో 18 లక్షల మంది జనాభా ఉన్నారు. కొత్తగా కేంద్రం మంజూరు చేసిన మూడు మెడికల్‌ కాలేజీలతో కలిపి మొత్తంగా 14 మాత్రమే ఉన్నాయి. మిగిలిన 12 కాలేజీలకు వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేయాలి. ఈ కాలేజీలకు సంబంధించిన పనులు అత్యంత వేగంగా ముందుకు సాగుతున్నాయి. వీటికి సంబంధించి కేంద్రం తగిన విధంగా సహాయ పడాలి.
- వైఎస్సార్‌ జిల్లాలో స్టీల్‌ ప్లాంట్‌ ఏర్పాటు చేస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో కేంద్రం హామీ ఇచ్చింది. ఈ ప్లాంట్‌ నిలదొక్కుకోవాలంటే ఖనిజ కొరత లేకుండా ఏపీఎండీసీకి గనులు కేటాయించాలి.

పార్లమెంట్‌లో ఘన స్వాగతం

ప్రధాని మోదీ, అమిత్‌షాతో భేటీకై పార్లమెంట్‌కు వచ్చిన సీఎం వైఎస్‌ జగన్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఘన స్వాగతం పలికారు. రాజ్యసభ, లోక్‌సభ పక్ష నేతలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డిలతో పాటు ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మార్గాని భరత్, గోరంట్ల మాధవ్, రెడ్డప్ప, తలారి రంగయ్య, పోచ బ్రహ్మానందరెడ్డి, లావు కృష్ణదేవరాయలు, పిల్లి సుభాస్‌ చంద్రబోస్, ఆర్‌.కృష్ణయ్య, చింతా అనురాధ, సత్యవతి, గొడ్డేటి మాధవిలు సాదర స్వాగతం పలికారు. జగన్‌ పార్లమెంట్‌ భవనంలో లోపలికి వెళుతున్న సమయంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్‌ గోయల్, పీఎంఓ కార్యాలయ శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్‌లు పలకరించారు. మహారాష్ట్రలోని అమరావతి ఎంపీ నవనీత్‌కౌర్‌ వైఎస్‌ జగన్‌తో ఫొటో దిగారు. కాగా, శుక్రవారం సాయంత్రం 4 గంటల తర్వాత సీఎం జగన్‌ ఢిల్లీ నుంచి తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు.

బీసీలకు చంద్రబాబు ఏమీ చేయలేదు

- సీఎం జగన్‌ పేదల కోసం అనేక పథకాలు తెచ్చారు
- శాసన మండలి విప్‌ జంగా కృష్ణమూర్తి
- వెనుకబడిన వర్గాలే వైఎస్సార్‌సీపీకి వెన్నెముక: చెవిరెడ్డి



మాట్లాడుతున్న జంగా కృష్ణమూర్తి. చిత్రంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: చంద్రబాబు బీసీల కోసం ఏమి చేయలేదని శాసన మండలి విప్‌ జంగా కృష్ణమూర్తి విమర్శించారు. బీసీలను బాబు కేవలం ఓటు బ్యాంక్‌గా చూశారన్నారు. కానీ సీఎం వైఎస్‌ జగన్‌ మాత్రం బీసీలు బ్యాక్‌ బోన్‌ క్లాస్‌గా భావించారని, వారి కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు రూపొందించారని తెలిపారు. శుక్రవారం తాడేపల్లిలో జరిగిన వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం, క్రిస్టియన్‌ మైనార్టీల విభాగం, ముస్లిం మైనార్టీల విభాగాల జిల్లాల అధ్యక్షులు, రీజినల్‌ కోఆర్డినేటర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌ పేదల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. అన్ని వర్గాలకు సీఎం జగన్‌ ఎంతో మేలు చేస్తున్నారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో దాదాపు 99 శాతం సీఎం జగన్‌ అమలు చేశారని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ, వామపక్షాలు రాక్షసుల్లా మారి నవరత్నాలనే యజ్ఞాన్ని భంగం చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. పార్టీ పెట్టినప్పటి నుంచీ అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి సీఎం జగన్‌ కృషి చేశారన్నారు. పార్టీ అనుబంధ విభాగాల కోఆర్డినేటర్‌ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాలే వైఎస్సార్‌సీపీకి వెన్నెముక అని చెప్పారు. నవరత్నాల ప్రోగ్రాం వైస్‌ చైర్మన్‌ అంకంరెడ్డి నారాయణ మూర్తి పాల్గొన్నారు.

‘టీవీఎస్‌’లో 116మంది పాలిటెక్నిక్‌ విద్యార్థులకు ఉద్యోగాలు

సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాలిటెక్నిక్‌ విద్యార్థులకు తక్షణ ఉద్యోగాల కల్పన కోసం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపడుతున్న చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌ చదలవాడ నాగరాణి తెలిపారు. ఇప్పటికే పలు సంస్థల్లో పాలిటెక్నిక్‌ తృతీయ సంవత్సరం విద్యార్థులకు మంచి ప్యాకేజీలతో ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. తాజాగా గుంటూరులోని మద్ది బాలత్రిపుర సందరమ్మ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కాలేజీలో టీవీఎస్‌ గ్రూప్‌ కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఉద్యోగ నియామక ప్రక్రియలో 116 మంది ఎంపికయ్యారని తెలిపారు. మెకానికల్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్‌ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించగా, శుక్రవారం వారందరికీ నియామక లేఖలు అందించామని పేర్కొన్నారు. వీల్స్‌ ఇండియా సంస్థ ఎంపిక ప్రక్రియను చేపట్టగా, వీరందరికీ ప్రారంభంలో రూ.2.4 లక్షల వార్షిక వేతనం ఇస్తారని, ఇతర సదుపాయాలు కల్పిస్తారని నాగరాణి వివరించారు.

క్రీడల్లోనూ ప్రతిభ

హైదరాబాద్‌లోని వీఎన్‌ఆర్‌ విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజనీరింగ్‌ అండ్‌ టెక్నాలజీలో ఇటీవల జరిగిన 4వ అఖిల భారత దక్షిణ ప్రాంత పాలిటెక్నిక్‌ స్పోర్ట్స్, గేమ్స్‌ మీట్‌లో ఏపీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని నాగరాణి తెలిపారు. షాట్‌పుట్, హైజంప్, లాంగ్‌ జంప్, ట్రిపుల్‌ జంప్, డిస్కస్‌ త్రో, వాలీబాల్, చెస్, టేబుల్‌ టెన్నిస్, 100, 200, 300, 400 మీటర్ల పరుగు పందెం విభాగాల్లో రాష్ట్రానికి చెందిన 40మంది బాలికలు, 52మంది బాలురు పతకాలు సాధించారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రధాని మోదీతో ఎస్సీ,ఎస్టీ గురుకుల విద్యార్థులు



పార్లమెంట్‌ ఆవరణలో ప్రధాని మోదీతో విశాఖ జిల్లా విద్యార్థులు

శాఖ విద్య/కడప రూరల్: విశాఖ, విజయనగరం, వైఎస్సార్‌ జిల్లాలకు చెందిన విద్యార్థులు దేశ ప్రధాని నరేంద్ర మోదీతో ముచ్చటించే అరుదైన అవకాశం దక్కించుకున్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాలకు చెందిన 14 మంది విశాఖ జిల్లా విద్యార్థులు, 13 మంది వైఎస్సార్‌ జిల్లా విద్యార్థులు స్టడీ టూర్‌లో భాగంగా ఢిల్లీకి తీసుకెళ్లారు. గురువారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రధాని మోదీ ముచ్చటించి, వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంట్‌ పరిసర ప్రాంతాలు, విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థుల వెంట పెందుర్తి, గాజువాక హెచ్‌డబ్ల్యూవోలు ఎ.సత్యవతి, కె.అలివేలు మంగ, వైఎస్సార్‌ జిల్లా హెచ్‌డబ్ల్యూవోలు నాగరాజు నాయక్, పద్మజ, ఉన్నారు. వసతి గృహాల్లోని ప్రతిభ కలిగిన విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలనే తలంపుతోనే ప్రభుత్వం, వివిధ సంస్థల సహకారంతో ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్‌ డైరెక్టర్‌ డి.వి.రమణమూర్తి తెలిపారు.

● నకిలీ జీఎస్టీ ఇన్‌వాయిస్‌లు, బిల్లుల అసలు సూత్రధారి హైదరాబాద్ వాసిని డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) విశాఖ జోనల్ యూనిట్ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతడిని ఆర్థిక నేరాల కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 13 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించారు.

ఏఎంవీఐపై హత్యాయత్నం

అడ్డుకున్న డ్రైవర్‌పైనా దాడి

- కొబ్బరి బొండాల వ్యాపారి ఘాతుకం
- వ్యాపారం చేస్తున్న ఆటోను సీజ్ చేసే క్రమంలో కాకినాడలో ఘటన



గాయపడ్డ చిన్నారావును ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, (ఇన్‌సెట్) ఏఎంవీఐ చిన్నారావు

కాకినాడ క్రైం: ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ గడువు ముగిసినందున వాహనాన్ని సీజ్ చేసేందుకు యత్నించిన అధికారి, అతని డ్రైవర్‌పై వాహన యజమాని హత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రం కాకినాడలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ ఇంద్రపాలేనికి చెందిన పెంటా వెంకట దుర్గాప్రసాద్ ఆటోపై కొబ్బరి బొండాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్థానిక ఫెలోషిప్ సెంటర్‌లోని దేవదాయ, ధర్మదాయ శాఖ కార్యాలయం సమీపాన శుక్రవారం ఉదయం ఆటో నిలిపి వ్యాపారం చేసుకుంటున్నాడు. సాధారణ తనిఖీల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)గా విధులు నిర్వర్తిస్తున్న మిద్దే చిన్నారావు అక్కడకు వెళ్లారు. దుర్గాప్రసాద్ ఆటో నంబరు తనిఖీ చేసి, గతేడాది నవంబర్‌లోనే వాహనం ఫిట్‌నెస్ ముగిసిందని, ఇన్స్యూరెన్స్ కూడా లేదని చెప్పారు. ఈ క్రమంలో ఆటోను సీజ్ చేసేందుకు సిద్ధమయ్యారు. వద్దని దుర్గాప్రసాద్ వారించాడు. తాను ఆటో నడుపుతూ వ్యాపారం చేయడం లేదని, కేవలం రోడ్డు పక్కన నిలిపి మాత్రమే జీవనోపాధి కోసం వ్యాపారం చేసుకుంటున్నానని చెప్పాడు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన చిన్నారావు ఆటోను సీజ్ చేసే ప్రక్రియ ప్రారంభించారు. దీంతో దుర్గాప్రసాద్ ఆటో వద్దకు వెళ్లి కొబ్బరి బొండాలు నరికే కత్తి తీసుకొచ్చాడు. కారులో ఉన్న చిన్నారావును బెదిరించేందుకు కారు అద్దంపై కత్తితో వేటు వేశాడు. 'ఏంటి చంపుతావా?' అంటూ చిన్నారావు బయటకి రాబోయారు. అప్పటికే వర్షం పడుతుండడంతో కారు దిగిన వెంటనే చిన్నారావు కాలు జారి పడిపోయాడు. ఆయనపై దుర్గాప్రసాద్ కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. దాడిని నిలువరించేందుకు ఏఎంవీఐ కారు డ్రైవర్ గుత్తుల వీర వెంకట సత్యనారాయణ యత్నించగా దుర్గాప్రసాద్ అతడి పైనా కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో చిన్నారావు మెడ, తల, చేయి, పొట్ట భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. చేతి వేలు తెగి పడింది. పెద్దపేగు పూర్తిగా బయటికి వచ్చేసింది. డ్రైవర్ సత్యనారాయణకు రెండు చేతులపై గాయాలయ్యాయి. డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి క్షతగాత్రులను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వారికి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి తెలిపారు. కాగా కత్తి దాడిలో తెగిపడిన చిన్నారావు చేతి వేలిని అతికించేందుకు జీజీహెచ్ వైద్యులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. చిన్నారావు శరీరంపై మొత్తం 34 కత్తిపోట్లు, గాయాలు గుర్తించామని వైద్యులు తెలిపారు. జీజీహెచ్‌లో బాధిత కుటుంబ సభ్యులను జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు పరామర్శించారు. నిందితుడు దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేశామని టూ టౌన్ సీఐ నాయక్ తెలిపారు.



గాయపడిన సత్యనారాయణ, నిందితుడు దుర్గాప్రసాద్ (ఫైల్)

దివ్యాంగుడికి అరుదైన గుండె ఆపరేషన్

- చిన్న కోతతో శస్త్ర చికిత్స.. వెంటనే కోలుకున్న రోగి
- కర్నూలు పెద్దాస్పత్రి వైద్యుల ఘనత



ఆపరేషన్ అనంతరం లక్ష్మన్న

కర్నూలు(హాస్పిటల్): రక్తం గడ్డకట్టడంతో తీవ్ర అనారోగ్యం బారినపడిన ఓ దివ్యాంగుడికి కర్నూలు పెద్దాస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. చిన్న కోత ఆపరేషన్ కారణంగా రోగి వెంటనే కోలుకోగలిగాడు. కర్నూలు జిల్లా మంత్రాలయానికి చెందిన 30 ఏళ్ల లక్ష్మన్న గుండెలోని మైట్రల్ వాల్వ్ బాగా దెబ్బతినడంతో పాటు మూసుకుపోయింది. అలానే గుండెలో రక్తం గడ్డకట్టడం కూడా మొదలైంది. ఈ గడ్డ ముక్క అదుపు తప్పి మెదుడులోకి వెళ్తే పక్షవాతం వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో అతను చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియోథొరాసిక్ విభాగంలో చేరాడు. హెచ్‌వోడీ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి అతన్ని పరీక్షించి రెగ్యులర్ బైపాస్ సర్జరీ కాకుండా మినిమల్ ఇన్‌వేసివ్ విధానంలో ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో కుడికాలు రక్తనాళాల లోంచి బైపాస్ చేయాల్సి ఉంటుంది. అయితే పోలియో కారణంగా కాలు సన్నగా ఉండటంతో నరం కూడా సన్నబడింది. అయినా ఆపరేషన్ మొదలుపెట్టారు. కుడికాలు గజ్జల్లోని రక్తనాళాల ద్వారా బైపాస్ మొదలు పెట్టి మూడు ఇంచుల చిన్న కోతతో ఛాతీలోకి వెళ్లి ఆ రక్తం క్లాట్‌ను సమూలంగా తీసివేసి ప్లాస్టిక్ కవాటాన్ని మార్చారు. ఆపరేషన్ అనంతరం 3 రోజుల్లోనే లక్ష్మన్న కోలుకున్నాడు.

కృత్తివెన్ను తీరంలో డాల్ఫిన్ కళేబరాలు



కృత్తివెన్ను మండలం పెదగొల్లపాలెం బీచ్‌లో డాల్ఫిన్ కళేబరం

కృత్తివెన్ను: కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలంలోని పెదగొల్లపాలెం బీచ్‌కి శుక్రవారం మూడు డాల్ఫిన్ కళేబరాలు కొట్టుకొచ్చాయి. సాధారణంగా మన సముద్ర జలాల్లో ఇవి చాలా అరుదుగా ఉంటాయని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. వీటిని సౌచాచైనెన్‌షిస్ శాస్త్రీయనామం కలిగిన ఇండో ఫసిఫిక్ హంప్ బ్యాక్ డాల్ఫిన్‌లుగా పిలుస్తారు. ఇవి లోతైన ప్రాంతాలలో ఉండటానికి ఇష్టపడవు. తీరానికి దగ్గరగా ఉండటానికే మక్కువ చూపుతాయి. సాధారణ వేటగాడి వలకు కూడా చిక్కుతాయి. ప్రస్తుతం ఈ జాతి డాల్ఫిన్‌లు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఇవి ఇండియన్ సముద్ర జలాల్లో అరుదుగా కనిపిస్తాయి. మనుషులతో మమేకమయ్యే డాల్ఫిన్‌లు క్షీరద జాతికి చెందినవి. గతంలో కూడా ఈ ప్రాంతంలోకి పెద్ద సంఖ్యలో డాల్ఫిన్‌లు వచ్చిన ఘటనలు ఉన్నాయి.

వేదాల పరిరక్షకుడు వేంకటేశ్వరుడు

- విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- శాస్త్రోక్తంగా చెన్నై టి.నగర్‌లో పద్మావతి అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేకం



మాట్లాడుతున్న స్వరూపానందేంద్ర, చిత్రంలో టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి దంపతులు, వేమిరెడ్డి ప్రశాంతి

సాక్షి, చెన్నై/సింహాచలం: వేదాలను పరిరక్షించడానికి వెలిసిన కలియుగదైవం వేంకటేశ్వరస్వామి అని విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేర్కొన్నారు. ప్రపంచంలో నిరంతరం చతుర్వేద పారాయణ జరిగే దివ్య క్షేత్రం తిరుమల ఒక్కటేనని తెలిపారు. చెన్నై టి.నగర్‌లో టీటీడీ నిర్మించిన పద్మావతి అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేకం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వరూపానందేంద్ర సరస్వతి భక్తులనుద్దేశించి మాట్లాడారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారు చెన్నై వాసులను ఆశీర్వదించడానికి టి.నగర్‌లో కొలువుదీరిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, చెన్నై స్థానిక సలహామండలి అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి కృషితో అమ్మవారి ఆలయం అద్భుతంగా నిర్మించారని ప్రశంసించారు. ఆలయ నిర్మాణానికి స్థలం విరాళంగా ఇచ్చిన సినీ నటి కాంచన, వారి కుటుంబసభ్యులను అభినందించారు. టీటీడీ బోర్డు సభ్యులు డాక్టర్ శంకర్, టీటీడీ ఢిల్లీ స్థానిక సలహా మండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతి పాల్గొన్నారు.

యువతే ప్రపంచ భవిత

ఏఎన్‌యూ అకడమిక్ ఎగ్జిబిషన్‌లో డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసమూర్తి



మాట్లాడుతున్న డీఆర్‌డీఎల్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి

ఏఎన్‌యూ: యువతే ప్రపంచ భవిత అని హైదరాబాద్ డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డాక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజుల పాటు జరిగిన అకడమిక్ ఎగ్జిబిషన్ శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి డాక్టర్ శ్రీనివాసమూర్తి ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మన దేశ విద్యార్థులు ఏ దేశంలో చదివినా, ఉద్యోగం చేసినా మాతృదేశాన్ని మాత్రం మరువొద్దని, మీ విజ్ఞానం, మేధస్సు దేశం కోసం ఉపయోగించాలన్నారు. విద్యార్థుల ఆలోచనలకు కార్యరూపమిచ్చి సమాజాభివృద్ధికి దోహదపడాలని విద్యార్థులకు సూచించారు. ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, అకడమిక్ ఎగ్జిబిషన్ కో-ఆర్డినేటర్ ఆచార్య కె.మధుబాబు, ఆర్కిటెక్చర్ కళాశాల డాక్టర్ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			బులియన్ రూ.లలో ముంబై	
సెన్సెక్స్ ▲ 355 / 57,990	నిఫ్టీ ▲ 114 / 17,100	నాస్‌డాక్	11,650	▽ 66	బంగారం (24 క్యారెట్) 58,882	▽ 121
		డోజోన్స్	31,923	▽ 323	బంగారం (22 క్యారెట్) 58,646	▽ 120
		ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,335	▽ 75	వెండి (కిలో) 71,576	▽ 523
		డాక్స్	14,768	▽ 199		
		షాంఘై	3,251	▲ 24		
		నికాయ్	27,334	▲ 323		

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

బిస్లెరీతో చర్చలకు 'టాటా'

వ్యాపార విస్తరణపై దృష్టి కొనసాగింపు



న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో చేపట్టిన చర్చలకు చెక్ పడినట్లు ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్(టీసీపీఎల్) తాజాగా వెల్లడించింది. ఇటీవల కొద్ది రోజులుగా బిస్లెరీ బ్రాండును టాటా గ్రూప్ కొనుగోలు చేయనున్నట్లు అంచనాలు పెరిగిన నేపథ్యంలో చర్చలు నిలిపివేసినట్లు నియంత్రణ సంస్థలకు టాటా కన్జూమర్ తెలియజేసింది. ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో ఎలాంటి తప్పనిసరి ఒప్పందాలు కుదుర్చుకోలేదని స్పష్టం చేసింది. ఇందుకు ఎలాంటి కట్టుబాట్లనూ ఏర్పాటు చేసుకోలేదని తెలియజేసింది. అయితే వ్యాపార విస్తరణ, వృద్ధి అవకాశాలకున్న వ్యూహాత్మక అంశాలపై దృష్టి కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఇకపైనా బిస్లెరీ ఇంటర్నేషనల్ సహా వివిధ సంస్థలతో చర్చలు నిర్వహించే వీలున్నట్లు వెల్లడించింది. కాగా.. బిస్లెరీ ఇంటర్నేషనల్ విక్రయానికి టీసీపీఎల్‌తోపాటు పలు కొనుగోలుదారులతో చర్చలు నిర్వహిస్తున్నట్లు ప్రమోటర్, వెనుకటితరం పారిశ్రామికవేత్త రమేష్ చౌహాన్ గతేడాది పేర్కొన్నారు. మరోవైపు మరిన్ని మార్కెట్లలో విస్తరించేందుకు అనువుగా టీసీపీఎల్ పలు కంపెనీలను కొనుగోలు చేస్తూ వస్తోంది. టీసీపీఎల్‌కు ఇప్పటికే హిమాలయన్ బ్రాండుతో బాటిల్డ్ వాటర్ విభాగంలో కార్యకలాపాలు ఉన్నాయి.

తాజా వివరణ నేపథ్యంలో టీసీపీఎల్ షేరు 2 శాతం బలపడి రూ. 708 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-2-2023	
విశాఖ	450–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438–00
విజయవాడ	438–00
రిటైల్ ధర (డజను)	66.00
17-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425–00
వరంగల్	427–00
రిటైల్ ధర	4.95

మా ఉత్పత్తులకు హబ్‌గా శ్రీసిటీ

- ఈసారి బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యం
- బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రాబోయే రోజుల్లో తమ ఉత్పత్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ హబ్‌గా మారగలదని ఎయిర్ కండీషనింగ్, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ ఎండీ బి. త్యాగరాజన్ చెప్పారు. ఇప్పటికే అక్కడ ఇన్వెస్ట్ చేసినవి, కొత్తగా చేయబోయేవి కలిపి రాబోయే మూడేళ్లలో మొత్తం రూ. 1,000 కోట్ల పైచిలుకు పెట్టుబడి పెట్టినట్లవుతుందని త్యాగరాజన్ వివరించారు. వ్యూహాత్మక స్థానంలో ఉన్నందున సరుకు రవాణా, నిల్వ చేసుకోవడం వంటి విషయాలకు సంబంధించి తమకు ఇది ప్రయోజనకరంగా ఉంటోందని పేర్కొన్నారు. శుక్రవారమిక్కడ కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించిన సందర్భంగా త్యాగరాజన్ ఈ విషయాలు చెప్పారు. శ్రీసిటీలో రూమ్ ఏసీల తయారీకి సంబంధించి మొత్తం నాలుగు దశల్లో ప్రస్తుతం తొలి దశ పూర్తయి ఇటీవలే ఉత్పత్తి మొదలైందని చెప్పారు. మిగతావి కూడా పూర్తయితే 12 లక్షల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అటు కమర్షియల్ ఏసీల తయారీకి సంబంధించి రెండో ప్లాంటు నిర్మాణం కోసం 40 ఎకరాలు సమీకరించినట్లు, 2024లో పనులు, 2025లో ఉత్పత్తి ప్రారంభం కాగలదని అంచనా వేస్తున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. గత కొద్ది త్రైమాసికాలుగా సానుకూల ఫలితాలు నమోదు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బిలియన్ డాలర్ల ఆదాయం (దాదాపు రూ. 8,200 కోట్లు) అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ. 6,046 కోట్ల ఆదాయం నమోదు చేసింది.



బ్లూస్టార్ కొత్త ఉత్పత్తుల శ్రేణి ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్ రెడ్డి (ఎడమ), ఎండీ బి. త్యాగరాజన్

అంతర్జాతీయంగా విస్తరణ..: కొత్త విభాగాల్లో ప్రవేశించడం కన్నా ఇతర దేశాల్లో మరింత విస్తరించడంపై దృష్టి పెడుతున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. ప్రస్తుతం మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేస్తుండగా అమెరికా, యూరప్ తదితర మార్కెట్లలోనూ కార్యకలాపాలకు సిద్ధమవుతున్నట్లు వివరించారు. ఆయా మార్కెట్లకు ఈ ఏడాది ఆఖరు నుంచే ఎగుమతులు మొదలుపెట్టే అవకాశం ఉందన్నారు.

కొత్త ఫ్రీజర్ల శ్రేణి..

బ్లూస్టార్ ఆవిష్కరించిన కొత్త ఉత్పత్తుల శ్రేణిలో దేశీయంగా తీర్చిదిద్దిన డీప్ ఫ్రీజర్లు, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తులు ఉన్నాయి. వీటి కూలింగ్, నిల్వ సామర్థ్యాలు మరింత అధికంగా ఉంటాయని, వీటిని మహారాష్ట్రలోని వాడా ప్లాంటులో తయారు చేశామని త్యాగరాజన్ తెలిపారు. రాబోయే రోజుల్లో తమ సంస్థ వృద్ధికి కమర్షియల్ రిఫ్రిజిరేషన్ మరింతగా ఊతమివ్వగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఈ విభాగం నుంచి తమకు రూ. 70 కోట్లు, దక్షిణాదిలో రూ. 235 కోట్ల పైచిలుకు ఆదాయం వస్తోందన్నారు. మొత్తం అన్ని విభాగాల రీత్యా చూస్తే తమ సంస్థ 20–25 శాతం వృద్ధి సాధిస్తోందని, పరిశ్రమ వృద్ధి సుమారు 15–20 శాతం మేర ఉంటోందని పేర్కొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం విలీనానికి ఓకే

ఎన్‌సీఎల్‌టీ అనుమతి

న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ రంగ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీనానికి జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో దేశంలోనే అతిపెద్ద మార్టిగేజ్ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనంకానుంది. వెరసి దేశీ కార్పొరేట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద విలీనంగా నమోదుకానుంది. ఇందుకు ఇప్పటికే నియంత్రణ సంస్థలు ఆర్‌బీఐ, సెబీ, పీఎఫ్‌ఆర్‌డీఏ, సీసీఐ అనుమతించాయి. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ సైతం ఓకే చెప్పాయి. ఈ బాటలో రెండు సంస్థల వాటాదారుల నుంచి అనుమతి కోరేందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం క్యూ3 నాటికి విలీనం పూర్తికావచ్చని అంచనా.



ట్యూబులర్ బిడ్‌కు గ్రీన్‌సిగ్నల్

రుణ సంక్షోభంలో చిక్కుకున్న సింటెక్స్ కొనుగోలుకి ప్రొపెల్ ప్లాస్టిక్ ప్రొడక్ట్స్, ప్లాస్టాటో (ట్యూబులర్ పైప్స్) కన్సార్షియం వేసిన బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బిడ్ విలువ రూ. 1,250 కోట్లుగా సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

సరికొత్త ఫీచర్లతో పల్సర్ ఎన్‌ఎస్ సిరీస్

హైదరాబాద్: బజాజ్ ఆటో తన పల్సర్ ఎన్‌ఎస్ నేకెడ్ స్ట్రీట్‌ఫైటర్ లైన్‌కు అప్‌డేట్ వెర్షన్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లోని ఎన్‌ఎస్ 160, ఎన్‌ఎస్ 200 మోడళ్లను సరికొత్త ఫీచర్లతో తీసుకొచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.1.35 లక్షలు.., రూ.1.47 లక్షలుగా ఉన్నాయి. మంచి హ్యాండ్లింగ్ కోసం యూఎస్‌డీ ఫ్రంట్ ఫోర్క్‌లు, మెరుగైన భద్రతకు డ్యూయల్ చానల్ ఏబీఎస్‌ను అమర్చారు. ఇన్ఫినిటీ డిస్‌ప్లే కొత్త పల్సర్లలో ప్రత్యేకం. డిస్‌ప్లే కన్సోల్‌లో ఇప్పుడు గేర్ పొజిషన్ ఇండికేటర్ కూడా ఉంది. ఎన్‌ఎస్ 200 మోడల్ 18.75 ఎన్‌ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6–స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్‌తో జత చేశారు. ఎన్‌ఎస్ 160 మోడల్ 14.6 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇంజిన్ 5–స్పీడ్ గేర్‌బాక్స్‌తో వస్తుంది.



బిగ్‘సి’ ఉగాది ఆఫర్లు



హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ విక్రయ సంస్థ 'బిగ్ సి' ఉగాది పండుగ సందర్భంగా వినూత్న ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై ఆకర్షణీయ రాయితీలు అందిస్తున్నట్లు కంపెనీ సీఎండీ యం.బాలు చౌదరి తెలిపారు. స్మార్ట్ ఫోన్ల కొనుగోలుపై పదిశాతం వరకు క్యాష్ బ్యాక్‌తో పాటు ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా సులభ ఈఎంఐలలో పొందొచ్చన్నారు. స్మార్ట్ టీవీల కొనుగోలుపై 1,500 వరకు క్యాష్ బ్యాక్ ఇస్తుందన్నారు. సులభ ఈఎంఐ పద్ధతిలో ల్యాప్‌టాప్స్ కొనే సౌకర్యం కూడా ఉందన్నారు. "ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుంది. మా రిటైల్ స్టోర్లలో ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలకే ఉత్పత్తులు లభిస్తాయి. ప్రజలంతా ఈ ఆఫర్లను వినియోగించుకోవాలి'' అని బాలు చౌదరి కోరారు.

ఫోన్‌పే రూ. 1,650 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే కొత్తగా 200 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,650 కోట్లు) సమీకరించింది. 12 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ప్రధాన వాటాదారు వాల్‌మార్ట్ ఈ మేరకు నిధులు సమకూర్చింది. సింగపూర్ నుంచి భారత్‌కు కార్యాలయాన్ని మార్చుకున్న నేపథ్యంలో ఫోన్‌పే 1 బిలియన్ డాలర్ల వరకూ మూలధనాన్ని సేకరించే ప్రయత్నాల్లో ఉంది. తాజాగా అందిన నిధులతో ఇప్పటివరకూ 650 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 5,360 కోట్లు) సమీకరించినట్లవుతుంది. మిగతా పెట్టుబడులను కూడా త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ఈ నిధులను బీమా, వెల్త్ మేనేజ్‌మెంట్, రుణాలు, స్టాక్ బ్రోకింగ్ మొదలైన వ్యాపార విభాగాల వృద్ధికి ఉపయోగించుకోనుంది. గూగుల్ పే, పేటీఎంలతో ఫోన్‌పే పోటీపడుతోంది.



ఒడిదుడుకులున్నా... లాభాలే!

- 17,100 వద్ద నిఫ్టీ ముగింపు
- సెన్సెక్స్ లాభం 355 పాయింట్లు
- రెండో రోజూ ముందడుగు



ముంబై: ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు శుక్రవారం లాభాలు గడించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో రికవరీ ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. క్రూడ్ ధరలు దిగిరావడం, రూపాయి బలపడటం కలిసొచ్చాయి. మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. ఉదయం సెన్సెక్స్ 403 పాయింట్లు బలపడి 58,038 వద్ద, నిఫ్టీ 126 పాయింట్లు పెరిగి 17,112 వద్ద మొదలయ్యాయి. భారీ లాభాల ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు తొలి దశలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సూచీలు మిడ్‌సెషన్ కల్లా ఆరంభ లాభాలను కోల్పోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 131 పాయింట్లు నష్టపోయి 57,504 వద్ద, నిఫ్టీ 28 పాయింట్లు పతనమై 16,958 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. ద్వితీయార్ధంలో కనిష్టస్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరి వరకు అదే జోరు కొనసాగడంతో సెన్సెక్స్ 355 పాయింట్లు బలపడి 57,990 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114 పాయింట్లు పెరిగి 17,100 వద్ద నిలిచింది. విస్తృత స్థాయి మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున పెరిగాయి. ఆటో, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌పీఐలు రూ.1817 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1767 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 82.65 స్థాయి వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు 1% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.5% నష్టపోయాయి. యూఎస్ స్టాక్ సూచీలు ఒకశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- బ్లాక్ డీల్ ద్వారా భారీ సంఖ్యలో షేర్లు మారడంతో బయోకాన్ షేరు 9% నష్టపోయి రూ.202 వద్ద స్థిరపడింది.
- రియల్టీ రంగ సంస్థ డీఎల్‌ఎఫ్ షేరు నాలుగుశాతానికి పైగా లాభపడి రూ 375 వద్ద స్థిరపడింది. అతి తక్కువ సమయంలో రికార్డు స్థాయిలో రూ.8,000 కోట్ల విలువైన లగ్జరీ ఫ్లాట్లను విక్రయించడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో ఐదు శాతం పెరిగి రూ.377.50 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- కేంద్రం రూ.70,500 కోట్ల రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లకు అనుమతినివ్వడంతో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ షేరు మూడుశాతం లాభపడి రూ.2,780 వద్ద ముగిసింది.

ఉత్తమ ఆటగాళ్లుగా సవితా పూనియా, హార్దిక్ సింగ్

భారత హాకీ సమాఖ్య (హెచ్‌ఐ) 2022 సంవత్సరానికిగాను భారత జట్టుకు సంబంధించి వార్షిక అవార్డులను ప్రకటించింది. పురుషుల విభాగంలో మిడ్‌ఫీల్డర్ హార్దిక్ సింగ్, మహిళల విభాగంలో సవితా పూనియా హాకీ ఇండియా ఉత్తమ ఆటగాళ్లుగా నిలిచారు. ఒడిశాలో జరిగిన హాకీ ప్రపంచకప్‌లో హార్దిక్ అద్భుత ఆటతీరు కనబర్చాడు. ఎఫ్‌ఐహెచ్ ఉమెన్స్ నేషనల్ కప్ టైటిల్ గెలిపించి ప్రొ లీగ్‌కు భారత జట్టు అర్హత సాధించడంలో కీపర్‌గా, కెప్టెన్‌గా సవిత కీలక పాత్ర పోషించింది. ఇద్దరికీ హాకీ ఇండియా తరఫున రూ. 25 లక్షల చొప్పున నగదు పురస్కారం లభించింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. దీంతో పాటు 2021కు సంబంధించిన అవార్డులను కూడా ప్రకటించగా హర్మన్‌ప్రీత్, సవితా పూనియా అత్యుత్తమ ఆటగాళ్లుగా అవార్డులు అందుకున్నారు. 2022లో సుల్తాన్ జొహర్ కప్ గెలిచిన భారత జూనియర్ జట్టును కూడా ఈ సందర్భంగా సత్కరించారు.



రాహుల్, జడేజా గెలిపించగా...



రాహుల్

- తొలి వన్డే భారత్‌దే
- 5 వికెట్లతో ఓడిన ఆస్ట్రేలియా
- రాణించిన షమీ, సిరాజ్
- ఆదివారం విశాఖపట్నంలో రెండో వన్డే

తొలి వన్డేలో భారత్ విజయలక్ష్యం 189 పరుగులే...దీనిని చూస్తే ఛేదన చాలా సులువనిపించింది. కానీ ఒక దశలో స్కోరు 16/3 కాగా, ఆపై 39/4కు మారింది...ప్రతికూలంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు శ్రమించాల్సి వచ్చింది. చివరకు రాహుల్, జడేజా శతక భాగస్వామ్యం జట్టును విజయం దిశగా నడిపించింది. ఎనిమిది నెలల తర్వాత ఆడిన తొలి వన్డేలో జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శన నమోదు చేయగా, టెస్టుల్లో బ్యాటింగ్‌పై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న రాహుల్ వన్డేల్లో తానేంటో చూపించాడు. అంతకు ముందు భారత బౌలర్లు ఆసీస్‌ను కట్టి పడేశారు. మిచెల్ మార్ష్ మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన జట్టు భారీ స్కోరు చేసేందుకు సరిపోలేదు.

ముంబై: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 35.4 ఓవర్లలో 188 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ మార్ష్ (65 బంతుల్లో 81; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. అనంతరం భారత్ 39.5 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (91 బంతుల్లో 75 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (69 బంతుల్లో 45 నాటౌట్; 5 ఫోర్లు) ఆరో వికెట్‌కు అభేద్యంగా 108 పరుగులు జత చేశారు. 2 వికెట్లు, 1 కీలక క్యాచ్‌తో పాటు బ్యాటింగ్‌లో రాణించిన జడేజా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో భారత్ 1–0తో ఆధిక్యంలో నిలవగా... ఈ నెల 19న వైజాగ్‌లో రెండో వన్డే జరుగుతుంది.

మార్ష్ మినహా...

తన తొలి ఓవర్లోనే ట్రవిస్ హెడ్ (5)ను సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియాకు సరైన ఆరంభం లభించలేదు. అయితే మార్ష్ దూకుడుగా ఆడి జట్టును నడిపించాడు. సిరాజ్ తర్వాతి ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన మార్ష్, సిరాజ్ మరో ఓవర్లోనే రెండు ఫోర్లు బాదాడు. 10 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్ స్కోరు 59 పరుగులకు చేరింది. మార్ష్‌కు సహకరించిన స్టీవ్ స్మిత్ (22)ను కీపర్ రాహుల్ చక్కటి క్యాచ్‌తో వెనక్కి పంపడంతో 72 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. మార్ష్ 51 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కుల్దీప్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి అతను తన జోరును కొనసాగించాడు. అయితే జడేజా బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన మార్ష్, షార్ట్ థర్డ్‌మాన్ వద్ద సిరాజ్‌కు క్యాచ్ ఇచ్చాడు. మార్ష్, లబుషేన్ (15) మూడో వికెట్‌కు 52 పరుగులు జత చేశారు. అంతే...ఆ తర్వాత ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. 20వ ఓవర్లో 129/2తో మెరుగైన స్థితిలో నిలిచిన ఆ జట్టు 36వ ఓవర్ కూడా ముగియక ముందే ముగిసింది. 59 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి 8 వికెట్లు కోల్పోయింది. తన చివరి 14 బంతుల్లో షమీ ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 3 వికెట్లు పడగొట్టగా...సిరాజ్ తన చివరి 10 బంతుల్లో ఒక్క పరుగూ ఇవ్వకుండా 2 వికెట్లు తీశాడు.



మార్ష్

శతక భాగస్వామ్యం...

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఆరంభంలో భారత్ తడబడింది. ఇషాన్ కిషన్ (3) తనకు లభించిన అరుదైన అవకాశాన్ని వృథా చేసుకోగా... స్టార్క్ వరుస బంతుల్లో కోహ్లి (4), సూర్యకుమార్ (0)లను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి భారత శిబిరంలో ఆందోళన పెంచాడు. వ్యక్తిగత స్కోర్ల 2, 7 వద్ద ఇన్‌గ్లిస్, స్మిత్ క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన శుబ్‌మన్ గిల్ (20) దానిని ఉపయోగించుకోలేకపోయాడు. ఈ దశలో రాహుల్, హార్దిక్ పాండ్యా (25) కలిసి జట్టును ఆదుకున్నారు. అయితే స్టొయినిస్ బౌన్సర్‌తో పాండ్యాను అవుట్ చేయడంతో 44 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. విజయానికి మరో 106 పరుగులు చేయాల్సిన ఇలాంటి స్థితిలో ఆస్ట్రేలియాదే పైచేయిగా మారినట్లు అనిపించింది. కానీ రాహుల్, జడేజా జోడి ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వలేదు. చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ వీరిద్దరు పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 73 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఈ జోడీని విడదీసేందుకు ఆసీస్ బౌలర్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది.

స్కోరు వివరాలు:

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) సిరాజ్ 5; మార్ష్ (సి) సిరాజ్ (బి) జడేజా 81; స్మిత్ (సి) రాహుల్ (బి) పాండ్యా 22; లబుషేన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 15; ఇన్‌గ్లిస్ (బి) షమీ 26; గ్రీన్ (బి) షమీ 12; మ్యాక్స్‌వెల్ (సి) పాండ్యా (బి) జడేజా 8; స్టొయినిస్ (సి) గిల్ (బి) షమీ 5; అబాట్ (సి) గిల్ (బి) సిరాజ్ 0; స్టార్క్ (నాటౌట్) 4; జంపా (సి) రాహుల్ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (35.4 ఓవర్లలో ఆలౌట్) 188.**

వికెట్ల పతనం: 1–5, 2–77, 3–129, 4–139, 5–169, 6–174, 7–184, 8–184, 9–188, 10–188. **బౌలింగ్:** షమీ 6–2–17–3, సిరాజ్ 5.4–1–29–3, పాండ్యా 5–0–29–1, శార్దుల్ 2–0–12–0, జడేజా 9–0–46–2, కుల్దీప్ 8–1–48–1.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (ఎల్బీ) (బి) స్టొయినిస్ 3; గిల్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 20; కోహ్లి (ఎల్బీ) (బి) స్టార్క్ 4; సూర్యకుమార్ (ఎల్బీ) (బి) స్టార్క్ 0; రాహుల్ (నాటౌట్) 75; పాండ్యా (సి) గ్రీన్ (బి) స్టొయినిస్ 25; జడేజా (నాటౌట్) 45; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (39.5 ఓవర్లలో 5 వికెట్లకు) 191. వికెట్ల పతనం:** 1–5, 2–16, 3–16, 4–39, 5–83. **బౌలింగ్:** స్టార్క్ 9.5–0– 49–3, స్టొయినిస్ 7–1–27–2, అబాట్ 9–0–31–0, గ్రీన్ 6–0–35–0, జంపా 6–0–37–0, మ్యాక్స్‌వెల్ 2–0–7–0.



జడేజా

గాయత్రి-ట్రెసా జోరు

- సెమీఫైనల్లో భారత జోడి
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 1000 టోర్నీ ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్ – ట్రెసా జాలీ దూకుడు కొనసాగుతోంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి – ట్రెసా జంట వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భారత ద్వయం 21–14, 18–21, 21–12 స్కోరుతో లీ వెన్ మీ – ల్యూ వాన్ వాన్ (చైనా)పై విజయం సాధించింది. 64 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో ప్రపంచ 17వ ర్యాంక్ జోడి గాయత్రి – ట్రెసా అటు అటాకింగ్, ఇటు డిఫెన్స్‌లో చెలరేగింది. గత ఏడాది కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం సాధించినప్పటినుంచి వరుస విజయాలతో సత్తా చాటుతున్న భారత జంట అదే జోరును ఇక్కడా ప్రదర్శించింది. తొలి గేమ్‌ను ధాటిగా ప్రారంభించిన గాయత్రి – ట్రెసా 6–2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. అయితే చైనా జంట 6–6తో స్కోరును సమం చేసింది. ఈ దశలో మళ్లీ చెలరేగిన భారత జోడి ముందుగా 11–8తో ఆధిక్యం ప్రదర్శించి ఆ తర్వాత వరుస పాయింట్లతో 18–12కు దూసుకెళ్లి ఆపై గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం భారత జంటకు గట్టి పోటీ ఎదురైంది. ఏ దశలోనూ ఆధిక్యం అందుకోలేకపోయిన గాయత్రి – ట్రెసా గేమ్‌ను కోల్పోయారు. చివరి గేమ్‌లో మాత్రం మన జట్టుదే హవా నడిచింది. వరుసగా ఆరు పాయింట్లతో 8–1తో ముందంజ వేసిన అనంతరం స్కోరు 11–4..13–5..15–8..18–10...ఇలా సాగింది. 20–12 వద్ద గాయత్రి కొట్టిన ఫోర్‌హ్యాండ్ స్మాష్‌తో భారత జంట విజయం ఖాయమైంది. సెమీ ఫైనల్లో కొరియాకు చెందిన బేక్ హ నా – లీ సా హితో గాయత్రి – ట్రెసా తలపడతారు.



జాస్మిన్, శశి ముందంజ

వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్లు జాస్మిన్ లంబోరియా, శశి చోప్రా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి పోరులో జాస్మిన్ (60 కేజీల విభాగం) రిఫరీ స్టాపింగ్ ద కాంటెస్ట్ (ఆర్‌ఎస్‌సీ) ద్వారా ఎన్‌యాంబెగా ఆంబ్రోస్ (టాంజానియా)ను చిత్తు చేసింది. బౌట్ మొదలైన 12 సెకన్లలోనే జాస్మిన్ విసిరిన పంచ్‌లకు ఆంబ్రోస్ తట్టుకోలేకపోవడంతో రిఫరీ ఆటను ఆపివేసి జాస్మిన్‌ను విజేతగా ప్రకటించారు. 63 కేజీల కేటగిరీలో శశి చోప్రా 5–0 స్కోరుతో ఎంవాంగి టెరిసియా (కెన్యా)పై ఘన విజయం సాధించింది. తర్వాతి రౌండ్‌లో సమడోవా (తజికిస్తాన్)తో జాస్మిన్... కిటో మై (జపాన్)తో శశి తలపడతారు. అయితే 70 కేజీల విభాగంలో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత బాక్సర్ శ్రుతి యాదవ్ 0–5తో జో పాన్ (చైనా) చేతిలో ఓటమిపాలైంది. నేడు భారత బాక్సర్లు నీతూ ఘంఘాస్, మంజు బంబోరియా తొలి రౌండ్‌లో ఆడతారు.



శశి

ఐర్లాండ్‌తో భారత్ టి20 సిరీస్

డబ్లిన్: ఈ ఏడాది ఆగస్టులో భారత్‌తో టి20 సిరీస్‌కు ఐర్లాండ్ బోర్డు ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 18 నుంచి 23 వరకు జరిగే ఈ సిరీస్‌లో ఇరు జట్ల మధ్య మూడు టి20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అయితే మరి కొద్ది రోజుల తర్వాత స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ ఉన్న నేపథ్యంలో భారత్ కోణంలో ఈ టి20 సిరీస్‌కు ప్రాధాన్యత లేదు కాబట్టి ద్వితీయ శ్రేణి జట్టు పాల్గొనే అవకాశం ఉంది.

న్యూజిలాండ్ 155/2

వెల్లింగ్టన్: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (108 బంతుల్లో 78; 13 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. వర్షం, వెలుతురులేమి కారణంగా శుక్రవారం 48 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

'కెంట్' తరఫున అర్ష్‌దీప్ సింగ్

కెంట్: భారత లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ దీప్ సింగ్ వచ్చే సీజన్‌లో ఐదు మ్యాచ్‌లలో 'కెంట్' కౌంటీకి ప్రాతినిధ్యం వహిస్తాడు. అర్ష్‌దీప్ భారత్ తరఫున 3 వన్డేలు, 26 టి20ల్లో ఆడాడు. భవిష్యత్తులో భారత టెస్టు జట్టులో అవకాశాల కోసం ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడమని, కౌంటీలు ఆడితే ప్రదర్శన మెరుగవుతుందని కోచ్ ద్రవిడ్ చేసిన సూచనతో అతను కౌంటీ క్రికెట్ వైపు వెళుతున్నాడు.

శాసనసభలో రెండు బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రులు

సాక్షి, అమరావతి: శాసనసభలో శుక్రవారం రెండు బిల్లులను మంత్రులు ప్రవేశపెట్టారు. ఏపీ విలువ ఆధారిత పన్ను(సవరణ) బిల్లు–2023ను ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఏపీ పారా వెటర్నరీ, అనుబంధ కౌన్సిల్ బిల్లు–2023ను పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సభలో ప్రవేశపెట్టారు.

శ్రీయుత ప్రత్యేక కలెక్టర్ (భూ.సే.) (ఎఫ్.ఏ.సి.) టి.జి.పి. నెల్లూరు వారి కార్యవర్తనములు
ప్రస్తుతము : శ్రీరోణంకి కూర్మనాథ్, ఐ.ఏ.ఎస్.

ఫారం నెం.VII

(2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢి ప్రకటన

ఆర్సీ.ఎ3/144/2019 తేది: 06-02-2023

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణములను 11.01 ఎకరములు ప్రజా ప్రయోజనమునకై అనగా రైట్ మైనర్ ఆఫ్ 14 యల్. మేజర్ శ్రీకొలను డిస్ట్రిబ్యూటరీ క్రింద 2 యల్, డిపి కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.525, 3 యల్ డిపి కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.525, 4 యల్ డిపి కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.525, 5 యల్ డిపి కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.700, 6 యల్ డిపి కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.675, 7 యల్ డిపి కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.675, 8 యల్ డిపి కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.300, 9 యల్ డిపి కి.మీ. 0.000 నుండి 0.250, 10 యల్ డిపి కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.150,11యల్ డిపి కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.150 మరియు 12 యల్ డిపి కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.300 యొక్క జి.కె.యన్. (యన్.యఫ్.సి.) కాలువ ఎక్స్‌టెన్షన్ కొరకు నెల్లూరు జిల్లా, దగదర్తి మండలము, దుండిగం గ్రామమునకు సంబంధించిన భూములు కావలెనని శ్రీ ప్రత్యేక కలెక్టర్, తెలుగు గంగ ప్రాజెక్ట్, నెల్లూరు వారు భావించి నందున, 2013 సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగం ననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములను విచారణ జరిపిన పిమ్మట వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనము నిమిత్తము భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2015-16నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

రూఢి ప్రకటన

శ్రీయుత ప్రత్యేక కలెక్టర్, తెలుగు గంగ ప్రాజెక్ట్, నెల్లూరు వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించిన ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనమునకై అనగా రైట్ మైనర్ ఆఫ్ 14 యల్ మేజర్ శ్రీకొలను డిస్ట్రిబ్యూటరీ జి.కె.యన్. (యన్.యఫ్.సి.) కాలువ ఎక్స్‌టెన్షన్ కొరకు అవసరమైనవని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు మండలం: దగదర్తి గ్రామం: దుండిగం

క్ర. సం.	సర్వే నెం./ సబ్ డి. నెం.	మొత్తము విస్తీర్ణం (ఎ.సెం.)	భూ సేకరణ క్రింద విస్తీర్ణం (ఎ.సెం.)	తరగతి	సంబంధిత ఆసామి పేరు - చిరునామా	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడములు, పంట వివరములు
2 యల్ డి.పి. త్రవ్వుట కొరకు కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.525 వరకు										
1	262-1ఎ	0.90	0.90	పట్టా మెట్ట	నేలపాటి తులసి రామ్ తండ్రి: వెంకట రమణయ్య	263	261	221/1	259	సాగు భూమి
2	262-3ఎ	0.91	0.91	పట్టా మెట్ట	పోతల వెంకటేశ్వర్లు తండ్రి: నాగయ్య	263	261	221/1	259	బీడు
3	263-1	1.01	0.27	పట్టా మెట్ట	పల్లాల గోవిందమ్మ భర్త: మాలకొండయ్య	264	262	501	266	సాగు భూమి
			0.17	పట్టా మెట్ట	దేవరపాటి మోహన్ దాస్ తండ్రి: ధనయ్య	264	262	501	266	సాగు భూమి
			0.57	పట్టా మెట్ట	ఉసురుపాటి చిన్నయ్య తండ్రి: అప్పయ్య	264	262	501	266	సాగు భూమి టేకు-34 జామ-1, పనస-1 సపోట-1 కొబ్బరి-2 వేప-8 మునగ-1 బోరు-1
4	264-2	0.56	0.33	పట్టా మెట్ట	వేలం శంకరయ్య తండ్రి: సుబ్బరామయ్య	265	263	502	266	సాగు భూమి వేప-2
			0.23	పట్టా మెట్ట	వేలం ధనయ్య తండ్రి: వెంకట నరసయ్య	265	263	502	266	సాగు భూమి
6 యల్ డి.పి. త్రవ్వుట కొరకు కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.675 వరకు										
5	420-2	0.55	0.55	పట్టా మెట్ట	గద్దె పద్మ భర్త : బాబు	471	419	421	225	సాగు భూమి
6	421-2	0.40	0.40	పట్టా మెట్ట	గద్దె పద్మ భర్త : బాబు	471	423/2	422, 423/1	421	సాగు భూమి
7 యల్ డి.పి. త్రవ్వుట కొరకు కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.675 వరకు										
7	230-1బి	0.23	0.23	పట్టా మెట్ట	వల్లమూడి దశయ్య తండ్రి: వెంకట సుబ్బయ్య	419	431	418	229 226	సాగు భూమి
8	230-2బి	0.22	0.22	పట్టా మెట్ట	వల్లమూడి వెంకటేశ్వర్లు తండ్రి: వెంకట సుబ్బయ్య	419	431	418	229 226	సాగు భూమి బోరు-1
9	230-3బి	0.25	0.25	పట్టా మెట్ట	వల్లమూడి సుబ్బరామయ్య తండ్రి: వెంకయ్య	419	431	418	229 226	సాగు భూమి
10	230-4బి	0.24	0.24	పట్టా మెట్ట	వల్లమూడి సుబ్బరామయ్య తండ్రి: వెంకయ్య	419	431	418	229 226	సాగు భూమి
11	418-1బి	0.21	0.21	పట్టా మెట్ట	బలుసు రామతులసి భర్త: శ్రీధర్	419	417, 233	424	230 231	సాగు భూమి
12	418-2బి	0.12	0.12	పట్టా మెట్ట	బలుసు రామతులసి భర్త: శ్రీధర్	419	417, 233	424	230 231	సాగు భూమి వేప-1, తాటి-3
13	418-3బి	0.14	0.14	పట్టా మెట్ట	నేలపాటి వరలక్ష్మమ్మ భర్త: వెంకటేశ్వర్లు	419	417, 233	424	230 231	సాగు భూమి వేప-1
14	424-1బి	0.15	0.15	పట్టా మెట్ట	నేలపాటి వరలక్ష్మమ్మ భర్త: వెంకటేశ్వర్లు	423/1	417	425	418	సాగు భూమి
15	424-2బి	0.16	0.16	పట్టా మెట్ట	గోగుల వెంకటసుబ్బయ్య తండ్రి: రామయ్య	423/1	417	425	418	సాగు భూమి జామాయిల్
8 యల్ డి.పి. త్రవ్వుట కొరకు కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.300 వరకు										
16	444-1ఎ2	0.15	0.15	పట్టా మెట్ట	యానంగి రామచంద్రయ్య తండ్రి: మాలకొండయ్య	451	442	445	443	సాగు భూమి
9 యల్ డి.పి. త్రవ్వుట కొరకు కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.250 వరకు										
17	445-4	0.17	0.17	పట్టా మెట్ట	యలపర్తి యూన్సీ రాణి భర్త: శ్రీనివాస చౌదరి	446	441	448	444	సాగు భూమి
18	448-2	0.41	0.41	పట్టా మెట్ట	యలపర్తి తిమ్మయ్య చౌదరి తండ్రి: దోనప్ప	447	440	449		సాగు భూమి
10 యల్ డి.పి. త్రవ్వుట కొరకు కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.150 వరకు										
19	441-4	0.26	0.26	పట్టా మెట్ట	నేలపాటి వెంకటేశ్వర్లు తండ్రి: సుబ్బరామయ్య	445	437	440	442	సాగు భూమి
20	440-3	1.30	1.30	పట్టా మెట్ట	నేలపాటి వెంకటేశ్వర్లు తండ్రి: సుబ్బరామయ్య	448	438	439	441	సాగు భూమి, జామాయిల్
11 యల్ డి.పి. త్రవ్వుట కొరకు కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.150 వరకు										
21	437-3	0.13	0.13	పట్టా మెట్ట	కావ నరసింహాలు తండ్రి: శ్రీరాములు	441	385	438	436	సాగు భూమి
22	438-3	0.67	0.67	పట్టా మెట్ట	యలపర్తి తిమ్మయ్య చౌదరి తండ్రి: దోనప్ప	440	384	439	437	సాగు భూమి
12 ఆర్ డి.పి. త్రవ్వుట కొరకు కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.300 వరకు										
23	384-1బి	0.39	0.39	పట్టా మెట్ట	కొంజేటి నాగేశ్వర రావు తండ్రి: శ్రీరాములు	438	383	ఇసుకపాడు గ్రామం	385	సాగు భూమి
24	384-2ఎ	0.39	0.39	పట్టా మెట్ట	పల్లెల యలమంద రావు తండ్రి: రెడ్డయ్య	438	383	ఇసుకపాడు గ్రామం	385	సాగు భూమి
25	383-1ఎ	0.87	0.87	పట్టా మెట్ట	పల్లెల మనోజ్ తండ్రి: యలమంద రావు	384	382	ఇసుకపాడు గ్రామం	386	సాగు భూమి
26	382-1ఎ	0.22	0.22	పట్టా మెట్ట	పల్లెల రాజ్య లక్ష్మి తండ్రి: యలమంద రావు	383	381	ఇసుకపాడు గ్రామం	386	సాగు భూమి
	మొత్తం	11.01	11.01							

ఈ భూముల ప్లాను శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), సోమశిల ప్రాజెక్ట్, ఆత్మకూరు వారి కార్యాలయములో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును. ఈ భూసేకరణ వలన నిర్వాసితులయినవారు ఎవ్వరును లేరు.

బొగ్గు ఘనులు, ఇనుప రాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలోగాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణము కొరకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గాని తొలగించుట గాని చేయవలెను.

సం/- రోణంకి కూర్మనాథ్, ఐ.ఏ.ఎస్,
ప్రత్యేక కలెక్టర్ (ఎఫ్.ఎ.సి), తెలుగు గంగ ప్రాజెక్ట్, నెల్లూరు

జైకొట్టిన టీచర్లు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాయలసీమ పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ విజయం

సాక్షి, అమరావతి/సాక్షి, తిరుపతి/ చిత్తూరు కలెక్టరేట్/సాక్షి ప్రతినిధి, అనంతపురం :రాష్ట్రంలో స్థానిక సంస్థల కోటాలో తొమ్మిది ఎమ్మెల్సీ స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన వైఎస్సార్‌సీపీ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ప్రభంజనం సృష్టించింది. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి 169 ఓట్ల ఆధిక్యంతో ఏపీటీఎఫ్ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసరెడ్డిపై విజయం సాధించారు. టీడీపీ మద్దతుతో పోటీ చేసిన పీడీఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి మూడో స్థానంలో నిలవడం గమనార్హం. తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి 1043 ఓట్ల ఆధిక్యంతో టీడీపీ మద్దతుతో పోటీ చేసిన పీడీఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిపై ఘన విజయం సాధించారు. ఉమ్మడి రాష్ట్రంలో.. విభజన తర్వాత రాష్ట్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం ఇదే ప్రథమమని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. పశ్చిమ రాయలసీమ, తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ స్థానాలకు ఈనెల 13న ఎన్నికల సంఘం పోలింగ్ నిర్వహించింది. ఓట్ల లెక్కింపును గురువారం ప్రారంభించింది.



గెలుపు అనంతరం విజయ చిహ్నం చూపుతున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

పశ్చిమ రాయలసీమలో..

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ స్థానం నుంచి 12 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ స్థానానికి 25,272 ఓట్లు పోలయ్యాయి. నిబంధనల మేరకు ఓట్లు వేయకపోవడంతో లెక్కింపు సమయంలో 3,867 ఓట్లు చెల్లకుండా పోయాయి. తర్వాత మిగతా ఓట్ల లెక్కింపును చేపట్టారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి మంచి ఆధిక్యం చాటారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు పూర్తయ్యే సరికి 8,846 ఓట్లు వచ్చాయి. ఏపీటీఎఫ్ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసరెడ్డికి 6,853 ఓట్లు వచ్చాయి. టీడీపీ మద్దతుతో పోటీ చేసిన పీడీఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి 4,162 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు పూర్తయ్యే సరికి ఎవరూ 50 శాతం ఓట్లను సాధించకపోవడంతో.. తక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థులను ఒక్కొక్కరిని తొలగిస్తూ.. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. లెక్కింపు ముగిసే సరికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డికి 10,787 ఓట్లు రాగా.. ఒంటేరు శ్రీనివాసరెడ్డికి 10,618 ఓట్లు వచ్చాయి. అప్పటికీ 50 శాతం ఓట్లు సాధించక పోవడంతో ఎన్నికల సంఘం అనుమతితో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి 169 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించినట్లు రిటర్నింగ్ అధికారి కేతన్ గార్గ్ ప్రకటించారు.

తూర్పు రాయలసీమలో..

తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి ఎనిమిది మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ స్థానానికి నిర్వహించిన పోలింగ్‌లో 24,291 ఓట్లు పోలయ్యాయి. 2,356 ఓట్లు చెల్లలేదు. మిగతా ఓట్లలో మొదటి ప్రాధాన్యతలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి మంచి ఆధిక్యాన్ని కనబరిచారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి 10,892 ఓట్లు సాధించారు. టీడీపీ మద్దతుతో పోటీ చేసిన పీడీఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డికి 8,908 ఓట్లు వచ్చాయి. ఎవరికీ 50 శాతం ఓట్లు రాకపోవడంతో తక్కువ ఓట్లు వచ్చిన ఆరుగురు అభ్యర్థులను వరుస క్రమంలో తొలగిస్తూ.. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డికి 11,714 ఓట్లు, టీడీపీ మద్దతుతో పోటీ చేసిన పీడీఎఫ్ అభ్యర్థి బాబురెడ్డికి 10,671 ఓట్లు వచ్చాయి. దాంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి 1,043 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారని రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ ప్రకటించారు. కాగా, చిత్తూరు, అనంతపురంలోని కౌంటింగ్ కేంద్రాల వద్ద తుది ఫలితం వెల్లడికాగానే వివిధ జిల్లాల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా పేల్చి సంతోషం వ్యక్తపరిచారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు.

రాయలసీమ తూర్పు, పశ్చిమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల వివరాలు

మొత్తం పోలైన ఓట్లు	24,741	మొత్తం పోలైన ఓట్లు	25,272
చెల్లని ఓట్లు	2,356	చెల్లని ఓట్లు	3,867
పి.చంద్రశేఖరరెడ్డి (వైఎస్సార్‌సీపీ)	11,714	ఎంవీ రామచంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ)	10,787
బాబురెడ్డి (టీడీపీ, పీడీఎఫ్)	10,671	ఒంటేరు శ్రీనివాసులరెడ్డి (ఏపీటీఎఫ్)	10,618
మెజారిటీ	1,043	మెజారిటీ	169



ఈ విజయం టీచర్ల సమస్యల పరిష్కారానికి దోహదం

తూర్పు, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా తాము మద్దతిచ్చిన అభ్యర్థి గెలుపొందడంపై ఉద్యోగ సంఘాల సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు శ్రీధర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఏపీ జీఈఎఫ్, వైఎస్సార్‌సీపీ, పీఆర్టీయూ ఏపీ అపుస్మా, వైఎస్సార్టీఎఫ్ తదితర 36 సంఘాల మద్దతుతో పోటీ చేసిన తూర్పు, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గ అధికార పార్టీ అభ్యర్థులు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఎం. వి.రామచంద్రారెడ్డి గెలుపు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సుల వల్లే సాధ్యమైందన్నారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులకు సంబంధించిన అంశాలను త్వరితగతిన పరిష్కరించుకోవడానికి ఈ విజయం దోహద పడుతుందని చెప్పారు.

వారధిగా పనిచేస్తా

“ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతోనే గెలుపొందాను. ప్రభుత్వానికి, ప్రభుత్వ.. ప్రైవేట్ ఉపాధ్యాయులకు మధ్య వారధిగా ఉంటూ వారి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను. విద్యా రంగం అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తాం.

– ఎంవీ రామచంద్రారెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

టీచర్ల పక్షాన ఉంటా

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన విద్యా రంగ అభివృద్ధే నన్ను ఎమ్మెల్సీని చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్ల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తా. ఏ ఇతర రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో విద్యాభివృద్ధి జరుగుతోంది.

– పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ”

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా కేటాయింపులు

సాక్షి, అమరావతి : గత ప్రభుత్వాల్లో ఎన్నడూ లేనట్టుగా తమ ప్రభుత్వం బడ్జెట్‌లో సంక్షేమానికి కేటాయింపులు చేసిందని పలువురు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు తెలిపారు. శాసనసభలో శుక్రవారం 2023–24 బడ్జెట్ కేటాయింపులపై చర్చలో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్టు చెప్పారు.

రైతు పక్షాన..



ఆర్బీకేలు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా తదితర పథకాలు, పలు కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం రైతు పక్షాన నిలుస్తోంది. ఆర్బీకేలు వివిధ దేశాలు, రాష్ట్రాల ప్రశంసలు పొందాయి. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాయి. అన్ని వర్గాల ప్రజల మేలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని టీడీపీ దుష్ప్రచారాలకు దిగుతోంది.

– కోన రఘుపతి, బాపట్ల ఎమ్మెల్యే

ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పులు



అమ్మ ఒడి పథకం ద్వారా పాఠశాలల్లో డ్రాపౌట్స్ బాగా తగ్గాయి. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గిరిజన ప్రాంతాల్లో గర్భిణులు, పాలిచ్చే తల్లులు, చిన్నారులకు మెరుగైన పౌష్టికాహారం లభిస్తోంది. మాతా, శిశు మరణాలూ తగ్గాయి. ఇలా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పులొస్తున్నాయి. కులం, మతం, ప్రాంతం, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

– నాగులపల్లి ధనలక్ష్మి, రంపచోడవరం ఎమ్మెల్యే

అన్ని వర్గాలనూ అభివృద్ధి పరిచేలా..



2015లో యూఎన్‌వో ఆమోదించిన ఎస్‌డీజీ గోల్స్‌లోని 17 అంశాల్లో 475 ఇండికేటర్స్ పరిగణనలోకి తీసుకుని ప్రతి ఒక్క వర్గాన్నీ అభివృద్ధి పరిచేలా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారు. అందులో భాగంగానే బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. ఎస్సీల సంక్షేమం కోసం రూ.20వేల కోట్లకు పైగా, ఎస్టీల కోసం రూ.6,900 కోట్లు కేటాయించడం హర్షణీయ.

– అలజంగి జోగారావు, పార్వతీపురం ఎమ్మెల్యే

టీడీపీ నేతలు చర్చకు సిద్ధమా?



పారదర్శకంగా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రూ.1.97 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో మా ప్రభుత్వం జమ చేసింది. ఈ విషయంపై మేం చర్చకు సిద్ధం. టీడీపీ నాయకులు కూడా వారి ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిన మేలుపై చర్చకు రావాలి. విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలకు పెద్దపీట వేస్తూ సీఎం జగన్ పాలన కొనసాగుతోంది.

– కిలారి రోశయ్య, పొన్నూరు ఎమ్మెల్యే

కొనసాగుతున్న పట్టభద్రుల ఓట్ల లెక్కింపు

- మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికీ దక్కని మ్యాజిక్ ఫిగర్

చిత్తూరు కలెక్టరేట్/సాక్షి, విశాఖపట్నం/సాక్షి ప్రతినిధి, అనంతపురం : తూర్పు, పశ్చిమ రాయలసీమ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎవరూ గెలుపునకు సరిపడా ఓట్లు సాధించకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లే గెలుపును నిర్ణయించనున్నాయి. తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి మొదటి ప్రాధాన్యతా ఓట్లలో టీడీపీ అభ్యర్థి శ్రీకాంత్ ముందంజలో ఉన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి స్వల్ప ఆధిక్యతలో కొనసాగుతున్నారు. ఉత్తరాంధ్రకు సంబంధించి టీడీపీ మద్దతిచ్చిన అభ్యర్థి వెంపాడ చిరంజీవిరావు ముందంజలో ఉన్నారు. ఈ మూడు నియోజకవర్గాలకు సంబంధించి శనివారం తుది ఫలితం వెలువడే అవకాశం ఉంది.

టీడీపీ కార్యాలయంలా కౌంటింగ్ కేంద్రం

స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్లుగా టీడీపీ నేతల తిష్ట

సాక్షి ప్రతినిధి, అనంతపురం : అనంతపురం జేఎన్‌టీయూ కళాశాలలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలా మారింది. పలువురు టీడీపీ నాయకులు కౌంటింగ్ కేంద్రంలోనే తిష్టవేసి వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులకు కౌంటింగ్ ఏజెంట్లుగా పాసులు తీసుకుని లోపలకు వెళ్లారు. శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీకే పార్థసారథి, వైఎస్సార్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, పరిటాల శ్రీరామ్ మామ ఆలం నరసానాయుడుతో పాటు మరో ఐదుగురు ఏజెంట్ల రూపంలో లోపలే ఉన్నారు. కౌంటింగ్ సిబ్బందిపైనా ప్రతాపం చూపిస్తున్నారు. టీడీపీ అభ్యర్థికి సంబంధించి ఏవైనా చెల్లని ఓట్లు ఉంటే వాటిని పట్టి పట్టి మరీ చూసిన తర్వాతే చెల్లని ఓట్లుగా పరిగణించేలా చేస్తున్నారు. అదే ఇతర పార్టీలవైతే పక్కన పడేయండంటూ ఆదేశాలిస్తున్నారు. ఈ పరిస్థితిని చూసి.. కౌంటింగ్ కేంద్రమా లేక తెలుగుదేశం పార్టీ కార్యాలయమా అని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ప్రశ్నించారు. వారిని వెంటనే బయటకు పంపించాలని డిమాండ్ చేశారు. కాగా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులుతో పాటు పలువురు కీలక నాయకులు కౌంటింగ్ కేంద్రానికి సమీపంలో తిష్ట వేశారు. పరిస్థితిని బట్టి అల్లర్లు సృష్టించడానికి వ్యూహ రచన చేసినట్లు సమాచారం.

టీడీపీ కట్టల్లోకి వైఎస్సార్‌సీపీ ఓట్లు!

- 8వ రౌండులో ఆరు ఓట్లు టీడీపీ ఖాతాలోకి
- మొత్తం ఓట్లు తిరిగి లెక్కించాలని అభ్యర్థి రవీంద్రారెడ్డి డిమాండ్



సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌లో తీవ్ర తప్పిదం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి వేసిన ఓట్లను తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బండిల్స్‌లో కలిపారు. 8వ రౌండు ఓట్ల లెక్కింపులో 19వ టేబుల్ వద్ద ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారాన్ని గమనించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌంటింగ్ ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ ఓట్లను తిరిగి లెక్కించగా ఆరు ఓట్లు టీడీపీ కట్టలో కలిశాయని స్పష్టమైంది. దీనిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు తెలియకుండా ఎన్ని ఓట్లను ఇలా కలిపారోనన్న అనుమానం ఉందని, మొత్తం ఓట్లను తిరిగి లెక్కించాలని రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు లేఖ కూడా రాశారు. ఇంతమంది కౌంటింగ్‌లో ఉన్నప్పుడే ఇలా తమ ఓట్లను టీడీపీ ఖాతాలో కలిపేయడం దారుణమన్నారు. తొలి, రెండో రౌండులో వెయ్యి ఓట్లకు పైగా మెజారిటీ వస్తే, మూడో రౌండు నుంచి 20, 30 ఇలా తూకమేసినట్టు మెజారిటీ రావడంపైనా అనుమానాలున్నాయన్నారు. కాగా, ఒకసారి కౌంటింగ్ పూర్తయి బండిల్స్‌ను కలిపేస్తే తిరిగి లెక్కించడం కుదరదని, అభ్యంతరం వ్యక్తం చేసిన ఏ బాక్స్ అయినా తిరిగి లెక్కిస్తామని రిటర్నింగ్ అధికారి చెప్పారు.

సామాజిక న్యాయంలో చరిత్ర సృష్టిస్తున్న సీఎం జగన్

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో విప్లవాత్మక మార్పు
- టీడీపీ సభ్యులు వాస్తవాలు జీర్ణించుకోలేకపోతున్నారు
- శాసన మండలిలో వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- మంత్రి బదులిస్తుండగా టీడీపీ సభ్యులు వెళ్లిపోవడాన్ని తప్పుబట్టిన చైర్మన్
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం, బడ్జెట్‌పై చర్చ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయంలో సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో విప్లవాత్మక మార్పు వచ్చిందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం, బడ్జెట్, వ్యవసాయ బడ్జెట్‌లపై శుక్రవారం శాసన మండలిలో చర్చ జరిగింది. డొక్కా మాణిక్యవరప్రసాద్ చర్చను ప్రారంభించగా, సభ్యులు ప్రస్తావించిన పలు అంశాలకు మంత్రి కాకాణి సమాధానం ఇచ్చారు. మంత్రి మాట్లాడుతుండగానే టీడీపీ సభ్యులు వాకౌట్ చేసి వెళ్లిపోయారు. టీడీపీ సభ్యుల చర్యను మండలి చైర్మన్ మోషేన్ రాజు తప్పుపట్టారు. గవర్నర్ ప్రసంగం, బడ్జెట్‌లపై టీడీపీ సభ్యులకు మాట్లాడే అవకాశం ఇచ్చామని, వారు మాట్లాడి, మంత్రి సమాధానం చెప్పే సమయంలో వెళ్లిపోవడం సరైన పద్ధతి కాదని అన్నారు. వెళ్లిపోవడానికి ముందే డిసైడ్ అయ్యి వచ్చినట్టు ఉందని మోషేన్‌రాజు అన్నారు.



అనంతరం మంత్రి కాకాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నవరత్నాలతో పాటు అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఇంత గొప్ప కార్యక్రమాలను టీడీపీ హయాంలో చేయలేదని, ఇప్పుడు వాళ్లు వాస్తవాలు జీర్ణించుకోలేకపోతున్నారని మంత్రి మండిపడ్డారు. పేదల బతుకులు మార్చేలా, వారి పిల్లలు బాల కార్మికులుగా మిగ్గిపోకుండా అమ్మ ఒడి వంటి అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టి చదువులు చెప్పిస్తున్న దార్శనికుడు సీఎం జగన్ అని అన్నారు. సీఎం జగన్ పేద పిల్లలకు ఇంగ్లిష్ చదువులు చెప్పిస్తుంటే, దానిపైనా టీడీపీ వాళ్లు బురద చల్లారన్నారు. తండ్రి వైఎస్ స్ఫూర్తితో అంతకంటే ఎక్కువగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక చర్యలతో రైతన్నలకు మేలు చేస్తున్న ప్రభుత్వం తమదేనని అన్నారు. కౌలు రైతుకు కూడా నూరు శాతం మేలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు వ్యవసాయం దండగ అని అంటే.. వ్యవసాయాన్ని పండగ చేసింది సీఎం జగన్ అని చెప్పారు. ఈ చర్చలో సభ్యులు వరుదు కళ్యాణి, ఇక్బాల్, తోట త్రిమూర్తులు, కేఎస్ లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ షాబ్జీ, శ్రీనివాసరెడ్డి, పి.అశోక్‌బాబు, కేఈ ప్రభాకర్ మాట్లాడారు.

సోషల్ మీడియా ప్రచారంలో వాస్తవంలేదు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు జరగదు
- పులివెందులలో టీడీపీకి అధిక ఓట్లు వచ్చాయని అసత్య ప్రచారం
- ట్విట్టర్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం వెల్లడి

సాక్షి, అమరావతి : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పులివెందులలో అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంటే టీడీపీ అభ్యర్థికి అధిక ఓట్లు వచ్చాయని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం శుక్రవారం ట్విట్టర్‌లో తెలిపింది. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ వాదన పూర్తిగా నిరాధారమని పేర్కొంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ.. ఎమ్మెల్యే ఎన్నికల మాదిరిగా నియోజకవర్గాల వారీగా జరగదని గుర్తుచేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విడివిడిగా కాకుండా పోలైన ఓట్లన్నీ కలిపే లెక్కింపు చేస్తారని స్పష్టంచేసింది.



త్వరలో ఎన్నికల సంఘం తుది వివరాలను ప్రకటిస్తుందని, అసత్య వార్తలను నమ్మవద్దని కోరింది.



SMART BAZAAR | SMART SUPERSTORE
Reliance
కనీసం 5% అన్నీ ఎమ్ఆర్‌పి పై
+ ప్రతిరోజు అదనపు డిస్కౌంట్
*కిరాణా సరుకులన్నిటిపై
చక్కెర 1 kg ₹9* ప్రతిరోజు
*₹1499 మరియు అంతకంటే మించిన షాపింగ్‌పై
స్మార్ట్ కానుక ఈ ఉగాది వేడుక
11TH - 22ND MARCH
SMART BAZAAR
పార్వతీపురం: వెంకటేశ్వర కళామందిర్, ఎదురుగా. డైలీ మార్కెట్. • రాజమండ్రి: శ్యామలాంబ ఆలయ వీధి. విజయవాడ: శుభం కల్యాణ వేదిక, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వక్కన, రామవరప్పాడు రింగ్. • గుంటూరు: శివ సిటీ సెంటర్, చంద్రమౌళి నగర్; • ఐటీసీ ఎదురుగా, చుట్టుగుంట దగ్గర, శ్రీనివాసరావు పేట; • KKR ఫంక్షన్ ప్లాజా, నగరంపాలెం. • గూడూరు: PSR మాల్, కొత్త RTC బస్టాండ్ వక్కన, HDFC బ్యాంక్ దగ్గర. • నెల్లూరు: MGB ఫెలిసిటీ మాల్, GNT రోడ్. • కర్నూలు: రిలయన్స్ పెట్రోల్ స్టేషన్ వక్కన, నంద్యాల రోడ్. • రాజంపేట: MRK కాంపౌండ్, LIC ఆఫీస్ దగ్గర, RS రోడ్. • తిరుపతి: STV నగర్, అన్నమాచార్య రోడ్డు. కందుకూరు: రాజ్ థియేటర్, పామూరు బస్టాండ్ వక్కన. • మార్కాపురం: బస్ స్టాండ్ ఎదురుగా.
SMART SUPERSTORE
ఆళ్లగడ • అనంతపురం • భీమవరం • చిత్తూరు • గుంటూరు • జగ్గయ్యపేట • కాకినాడ • కర్నూలు • మదనపల్లె • నందిగామ • నర్సరావుపేట • నెల్లూరు • ఒంగోలు • పలమనేరు • పొన్నూరు • ప్రొద్దుటూరు • రాజమండ్రి • తాడేపల్లిగూడెం • తణుకు • తిరుపతి • విజయవాడ • వినుకొండ • విశాఖపట్నం • విజయనగరం • వుయ్యూరు.
బిగ్ కోకోనట్ 1 యూనిట్ మార్కెట్ ధర ₹25 మా ధర ₹21
రా మ్యాంగో 1 kg మార్కెట్ ధర ₹55 మా ధర ₹47
వాటర్‌మెలన్ కిరణ్ 1 kg మార్కెట్ ధర ₹24 మా ధర ₹19
ఆరెంజ్ 1 kg మార్కెట్ ధర ₹80 మా ధర ₹69
గ్రేప్స్ సోనాకా సీడ్‌లెస్ 1 kg మార్కెట్ ధర ₹79 మా ధర ₹69
ఇండియా గేట్ బాస్మతి రైస్ రోజానా 5 kg + సన్‌రిచ్ సన్ ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్ 5 ℓ కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹1577 ఆదా చేసుకోండి ₹498 మా ధర ₹1079
మైదా / శనగపిండి / బొంబాయి రవ్వ 500 g / 1 kg ఎమ్ఆర్‌పి ₹45 మొదలుకుని BUY 1 GET 1 FREE
పార్థ్ బెల్లం 450 g ఎమ్ఆర్‌పి ₹48 ఆదా చేసుకోండి ₹13 మా ధర ₹35
శెనగ పప్పు 1 kg మార్కెట్ ధర ₹70 మా ధర ₹63
కందిపప్పు 1 kg మార్కెట్ ధర ₹125 మా ధర ₹118
లూస్ సోనా మసూరి బియ్యం ప్రీమియమ్ / లూజ్ (వీడి) హైదరాబాదీ బిరియాని రైస్ 1 kg మార్కెట్ ధర ₹55 / ₹120 మా ధర ₹49/₹105
లూజ్ షుగర్ ఎస్ 1 kg మార్కెట్ ధర ₹45 మా ధర ₹37
గుడ్ లైఫ్ బాదం / జీడిపప్పు (W320) 500 g ఎమ్ఆర్‌పి ₹549 / ₹499 ఆదా చేసుకోండి ₹228 / ₹100 మా ధర ₹321/ ₹399
ఫార్చ్యూన్ సన్‌లైట్ సన్‌ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్ 1 ℓ ఎమ్ఆర్‌పి ₹149 ఆదా చేసుకోండి ₹20 మా ధర ₹129
హెరిటేజ్ ఆగ్‌మార్క్ ఘీ (గ్రేడ్ స్పెషల్) 1 ℓ ఎమ్ఆర్‌పి ₹730 ఆదా చేసుకోండి ₹120 మా ధర ₹610
హెరిటేజ్ టోటల్ కర్డ్ 450 g ఎమ్ఆర్‌పి ₹30 మా ధర ₹27
నెస్లే మిల్క్‌మెయిడ్ కండెన్స్‌డ్ మిల్క్ 380 g ఎమ్ఆర్‌పి ₹139 ఆదా చేసుకోండి ₹15 మా ధర ₹124
ఎమ్‌టిఆర్ సేమ్యా 850 g ఎమ్ఆర్‌పి ₹87 మొదలుకుని మా ధర ₹59 మొదలుకుని ఆదా చేసుకోండి ₹28
మిరిండా ఆరెంజ్ / 7 అప్ / పెప్సీ 2.25 ℓ (సెలెక్ట్ వేరియంట్స్) ప్రతి దానికి ఎమ్ఆర్‌పి ₹99 మొదలుకుని BUY 2 GET 1 FREE
మీరాలెల్లీ షీట్ మాస్క్ / నీతా మెహందీ కోన్ / గ్లిమ్మర్ కాజల్ / నివియా / ఎంగేజ్ డియో (సెలెక్ట్ రేంజ్) (సెలెక్ట్ వేరియంట్స్) ఎమ్ఆర్‌పి ₹40 మొదలుకుని BUY 1 GET 1 FREE
పూజ సామాగ్రి రేంజ్ (సెలెక్ట్ వేరియంట్స్) ఎమ్ఆర్‌పి ₹25 మొదలుకుని BUY 1 GET 1 FREE
లూస్ స్టీల్ డిన్నర్ వేర్ (సెలెక్ట్ రేంజ్) ఎమ్ఆర్‌పి ₹49 మొదలుకుని BUY 1 GET 1 FREE
Pigeon క్లాసిక్ లైట్ ఐవరీ మిక్సర్ గ్రైండర్ 550W ఎమ్ఆర్‌పి ₹3015 మా ధర ₹1299
Prestige డెకోర్ బ్లాక్ 3 పీసెస్ నాన్ స్టిక్ కుక్ వేర్ సెట్ ఎమ్ఆర్‌పి ₹3740 మా ధర ₹1599
HAPPY LIVING WELSPUN DREAMLINE TRIDENT డబుల్ బెడ్ షీట్ (సెలెక్ట్ రేంజ్) ఎమ్ఆర్‌పి ₹1199 మొదలుకుని BUY 1 GET 2 FREE
మెన్స్ వేర్ ప్రారంభం నుండి ₹299
ఉమెన్స్ వేర్ ప్రారంభం నుండి ₹199
కిడ్స్ వేర్ ప్రారంభం నుండి ₹129
వద్ద కూడా లభ్యం SMART POINT fresh Signature
Pay with MobiKwik GET FLAT ₹40 CASHBACK
*T&C Apply : Min Transaction of ₹750 | Valid Once Per User Valid from 1st to 31st March 2023
మీకు సమీపంలో ఉన్న స్టోర్ లొకేట్ చేయడానికి స్కాన్ చేయండి
నియమ నిబంధనలు వర్తిస్తాయి. స్టాక్స్ ఉన్నంతవరకు ఆఫర్లు వెల్లుతాయి. ఆఫర్‌లన్నీ నోటీస్ చేయకుండానే మార్పు చేయబడగలవు. చూపించబడిన ఉత్పాదనల బొమ్మలు/ఫోటోగ్రాఫులు కేవలం ప్రదర్శన కోసం మాత్రమే. హోమ్‌వేర్ మరియు అపరెల్ ఆఫర్లు ఎంపిక చేయబడిన స్మార్ట్ బజార్ మరియు స్మార్ట్ సూపర్ స్టోరులలో మాత్రమే వర్తిస్తాయి. ఉత్పాదనలన్నిటి యొక్క ఎమ్ఆర్‌పి అన్ని పన్నులతో కూడి ఉంటుంది. పళ్లు మరియు కూరగాయలు యొక్క ఆఫర్‌లన్నీ 19 మార్చి 2023 వరకు వెల్లుతాయి. ఇతర ఆఫర్‌లన్నీ 22 మార్చి 2023 వరకు వెల్లుతాయి. ఆక్షేపణలన్నీ ముంబయిలోని కోర్టులో ప్రత్యేక అధికారానికి మాత్రమే లోబడి ఉంటాయి.

క్లుప్తంగా...

'బీసీ'ల పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వండి

కేంద్రాన్ని కోరిన ఎంపీలు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు

సాక్షి, న్యూఢిల్లీ: బీసీ విద్యార్థుల కోసం ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు.. మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఆర్. కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి వీరేంద్రసింగ్‌తో వారు సమావేశమయ్యారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, వసతి గృహాలు, గురుకుల స్కూళ్ల నిర్వహణ, బీసీ కార్పొరేషన్ రుణాలు తదితర పథకాలకు కేంద్రం తరఫున 60 శాతం గ్రాంట్ ఇవ్వాలని కోరారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న బీసీ కాలేజీల హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు సొంత భవనాలు నిర్మించేందుకు 80 శాతం గ్రాంట్ ఇవ్వాలని కోరారు. బీసీ కార్పొరేషన్ల ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అంకెల గారడీ

టీడీపీ ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు

సాక్షి, అమరావతి: ఎన్నికలకు ముందు రకరకాల హామీలిచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. ఈ నాలుగేళ్లలో అంకెల గారడితో ప్రజలను మభ్యపెట్టిందని టీడీపీ ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు అన్నారు. శాసన సభలో శుక్రవారం బడ్జెట్‌పై మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలను పట్టించుకోకుండా బడ్జెట్‌కు రూపకల్పన చేశారని ఆరోపించారు.

ప్రజల మద్దతు టీడీపీకే అని తేలింది : చంద్రబాబు

సాక్షి, అమరావతి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజల మద్దతు తెలుగుదేశం పార్టీకే ఉన్నట్లు తేలిందని అధినేత చంద్రబాబు తెలిపారు. శుక్రవారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో పార్టీ శాసన సభాపక్ష సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థులంతా కష్టపడ్డారన్నారు. అధికార పార్టీ ప్రలోభాలకు గురి చేసినా ఓటర్లు లొంగలేదన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో అందరికీ అర్థమైందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో సాధారణ ఎన్నికల వరకు కష్టపడాలని కోరారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలను ఇంకా గట్టిగా లేవనెత్తాలని సూచించారు. సీఎం జగన్ హడావుడిగా ఢిల్లీ వెళ్లి రాష్ట్రానికి ఏం తెచ్చారో చెప్పాలన్నారు.

చిట్టి చిల్లీ... చాలా ఘాటు గురూ!



- గొల్లప్రోలు పొట్టి మిర్చికి మంచి డిమాండ్
- పొలం వద్దే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- దుబాయ్, మలేషియా దేశాలకు ఎగుమతి
- రైతులే మార్కెటింగ్ చేసుకునేలా ఏర్పాట్లు

పిఠాపురం: చిట్టి చిల్లీ... చూడటానికి చెర్రీ పండులా ఎర్రగా గుండ్రంగా ఉంటుంది. నోరూరిస్తుంది. కానీ ఒక్కసారి కొరికితే చెంబుడు నీళ్లు తాగినా మంట తగ్గదు. అంతటి ఘాటు ఉన్న ఈ చిట్టి మిరపకాయల ధర కూడా సాధారణ మిర్చి కన్నా మూడు రెట్లు అధికంగా ఉంటుంది. ఈ చిట్టి మిర్చికి పుట్టినిల్లు కాకినాడ జిల్లా గొల్లప్రోలు ప్రాంతమైనా... మరాఠా వాసులతోపాటు దుబాయ్, మలేషియా దేశాల ప్రజలకు దీనిపై మక్కువ ఎక్కువ.

సొంతగా విత్తనం తయారీ...

గొల్లప్రోలు మండలంలోని రేగడి భూములు పొట్టి మిరప సాగుకు అనుకూలం. గొల్లప్రోలు, చేబ్రోలు, దుర్గాడ, చెందుర్తి, తాటిపర్తి, ఎ.విజయనగరం గ్రామాలలో సుమారు 600 ఎకరాలలో పొట్టి మిరపను సాగు చేస్తున్నారు. రైతులే సొంతగా విత్తనాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. తమకు పండిన పంటలో నాణ్యమైన కాయలను ఎంపిక చేసుకుని ఎండబెట్టి విత్తనాన్ని సిద్ధం చేసుకుంటారు. ఎకరాకు 70 నుంచి 80 బస్తాలు దిగుబడి వస్తుంది. వాతావరణం అనుకూలిస్తే పెట్టుబడి పోను ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.90 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ చిట్టి మిరపకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వ్యాపారులు పొలం వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ముంబై, పుణె ప్రాంతాలకు తరలించి అక్కడి నుంచి దుబాయ్, మలేషియా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రతి సంవత్సరం 250 నుంచి 350 టన్నుల వరకు ఎగుమతి చేస్తారు. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ నగరాల్లోని స్టార్ హోటళ్లకు విక్రయిస్తున్నారు. వ్యాపారులు టన్ను పొట్టి మిర్చిని విదేశాల్లో రూ.7లక్షల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.



విరగ కాసిన పొట్టి మిరప

పదేళ్లుగా సాగు చేస్తున్నా



పదేళ్లుగా పొట్టి మిరప సాగు చేస్తున్నా. మొత్తం మీద మిరప సాగు లాభదాయకంగా ఉంది. ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేయడం వల్ల మంచి దిగుబడి వస్తోంది. ఆదాయం కూడా బాగుంది.

– వెలుగుల బాబ్జి, మిరప రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

రైతులే మార్కెటింగ్ చేసుకునేలా చర్యలు



ప్రస్తుతం రైతు దగ్గర వ్యాపారులు కేజీ రూ.300 వరకు కొంటున్నారు. దానిని రూ.1.200లకు అమ్ముకుంటున్నారు. రైతులే స్వయంగా విక్రయించుకునేలా మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

– ఎలియాజర్, డీపీఎం ప్రకృతి వ్యవసాయ శాఖ, కాకినాడ

410 ఎకరాల్లో పొట్టి మిర్చి సాగు



గొల్లప్రోలు మండలంలో ఈ ఏడాది 410 ఎకరాల్లో పొట్టి మిర్చి సాగు చేశారు. ఉద్యానశాఖ ద్వారా ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు అందిస్తున్నాము. మంచి డిమాండ్ ఉన్న పంట కావడంతో రైతులు ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు.

– బీవీ రమణ, జిల్లా ఉద్యాన శాఖాధికారి, కాకినాడ

కాల పరిమితికి మించి ఈడీ కస్టడీకి ఇవ్వడం తగదు

'స్కిల్' కుంభకోణం కేసులో ఎంఎస్‌జే కోర్టు ఉత్తర్వులను తప్పుపట్టిన హైకోర్టు

సాక్షి, అమరావతి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం నిందితులను జ్యుడిషియల్ రిమాండ్ కాల పరిమితికి మించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కస్టడీకి ఇస్తూ విశాఖపట్నం మెట్రోపాలిటన్ సెషన్స్ (ఎంఎస్‌జే) కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు తప్పుపట్టింది. ఆ ఉత్తర్వుల్లో కొంత భాగాన్ని కొట్టేసింది. నిందితుల జ్యుడిషియల్ రిమాండ్ ఈ నెల 18తో ముగుస్తున్నందున, ఈడీ కస్టడీ కూడా ఆ రోజు వరకే ఉంటుందని తెలిపింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో నిందితులను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఈడీ కస్టడీకి అప్పగిస్తూ విశాఖ ఎంఎస్‌జే కోర్టు ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ నిందితులు సౌమ్యాద్రి శేఖర్ బోస్, వికాస్ నాయక్ ఖన్వేల్కర్, ముకుల్ చంద్ర అగర్వాల్, సురేష్ గోయల్ తదితరులు హైకోర్టును ఆశ్రయించారు.

పశుసంవర్ధక శాఖకు స్కోచ్ అవార్డుల పంట

వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాలకు సిల్వర్ స్కోచ్..

- వెటర్నరీ టెలి మెడిసిన్ కాల్ సెంటర్‌కు.. పశు వ్యాధుల నిర్ధారణ ల్యాబ్స్..
- ఆంధ్ర గో పుష్టి కేంద్రాలకు స్కోచ్ మెరిట్ అవార్డులు
- గతంలో ఎన్నడూ లేని రీతిలో గుర్తింపు

సీఎం విజన్‌కు ఇది గుర్తింపు..



మా శాఖకు గతంలో ఎన్నడూ ఇంతలా గుర్తింపు లభించలేదు. ఇన్ని అవార్డులు కూడా దక్కలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌తో గడిచిన 44 నెలల్లో ఎన్నో రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. వాటి ద్వారా రైతులకు మరింత నాణ్యమైన సేవలు అందించగలుగుతున్నాం. ఒకే ఏడాది నాలుగు స్కోచ్ అవార్డులు దక్కడం అరుదైన గౌరవంగా భావిస్తున్నా.

– డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్, డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు 2023–24 సంవత్సరానికి సంబంధించి స్కోచ్ అవార్డుల పంట పండింది. ఈ శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాలకు సిల్వర్ స్కోచ్ దక్కగా, వెటర్నరీ టెలి మెడిసిన్ కాల్ సెంటర్, పశువుల వ్యాధి నిర్ధారణ ల్యాబ్స్‌తో పాటు ఆంధ్ర గోపుష్టి కేంద్రానికి స్కోచ్ మెరిట్ అవార్డులు వరించాయి. దేశంలోనే వినూత్నంగా నియోజకవర్గానికి రెండు చొప్పున రాష్ట్రంలో తొలిసారిగా రూ.240 కోట్లతో 340 సంచార పశు ఆరోగ్యసేవా రథాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటి ద్వారా ఇప్పటివరకు 3,298 ఆర్బీకేల పరిధిలో 2.25 లక్షల పశువులకు వైద్యసేవలందించగా, 2.02 లక్షల మంది రైతులు లబ్ధిపొందారు. అలాగే, దేశంలోనే తొలిసారి రూ.7 కోట్లతో టెలిమెడిసిన్ కాల్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా రైతుల నుంచి వచ్చిన 1.46 లక్షల ఫోన్‌కాల్స్‌ను అటెండ్ చేశారు. శాస్త్రవేత్తలు, సంబంధిత వైద్యాధికారుల ద్వారా సలహాలు సూచనలు అందిస్తున్నారు. సకాలంలో వ్యాధి నిర్ధారణ చేయడం ద్వారా మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలందించాలన్న సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటుచేసిన 154 వైఎస్సార్ వెటర్నరీ ల్యాబ్స్ ద్వారా ఇప్పటివరకు 3.09 లక్షల శాంపిల్స్ పరీక్షించి సకాలంలో అవసరమైన వైద్య సేవలు అందించగలిగారు. అదే విధంగా రూ.17.40 కోట్లతో 58 వైఎస్సార్ దేశవాళీ గో జాతుల పెంపకం కేంద్రాలను ఏర్పాటుచేసారు. ఒక్కో కేంద్రానికి 20 దేశీ ఆవులు, ఓ ఆంబోతును అందించారు. వీటినుంచి సేకరించే పాల ద్వారా తయారుచేసే ఉత్పత్తులను ఆంధ్ర గో పుష్టి పేరిట విక్రయించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా గో పుష్టి కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటికే విజయవాడలో దీనిని ఏర్పాటుచేయగా ఇందుకు విశేష ఆదరణ లభిస్తోంది. త్వరలో విశాఖ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రిలలో ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ వినూత్న కార్యక్రమాలకే స్కోచ్ సంస్థ 2023 సంవత్సరానికి సిల్వర్, మెరిట్ సర్టిఫికెట్లకు ఎంపిక చేసింది.

వరుసగా అవార్డులే అవార్డులు

ఇక పాడి పరిశ్రమాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణల ఫలితంగా రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు గతంలో ఎన్నడూలేని రీతిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కగా, పెద్దఎత్తున ప్రశంసలు లభిస్తున్నాయి. ఇప్పటికే ఈ శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు రూపొందించిన పశుసంరక్షక్ యాప్‌కు 2021–22లో స్కోచ్ సిల్వర్ అవార్డు దక్కింది. గతేడాది బెస్ట్ స్టేట్ ఇన్ ఏహెచ్ మేనేజ్‌మెంట్ కేటగిరిలో ఇండియా యానిమల్ హెల్త్ అవార్డ్–2022 దక్కగా, యానిమల్ హెల్త్ లీడర్‌షిప్ అవార్డు–2022, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా నుంచి 2020లో అవార్డు ఆఫ్ ఎక్సలెన్స్ దక్కింది.

తెలంగాణ

హక్కులపై దాడులు!

- మోదీని గద్దె దించితేనే ప్రజాస్వామ్య పరిరక్షణ
- బీజేపీ ఓటమి కోసం ప్రగతిశీల శక్తుల ఏకీకరణ
- సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి

సాక్షిప్రతినిధి, వరంగల్: 'దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగహక్కులపై దాడులు జరుగుతున్నాయి.. మతోన్మాద రాజకీయాలు, కార్పొరేట్‌ల దోపిడీతో ప్రజలు అల్లాడుతున్నారు.. నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే ప్రజాస్వామ్యం పరిరక్షణ జరుగుతుంది. ప్రగతిశీల శక్తులను కూడగట్టి ప్రజా ఉద్యమాలతోనే హక్కులను సాధించుకుందాం' అని సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. దాడులను తిప్పికొట్టేందుకు ప్రజలు, ప్రజాస్వామికవాదులు సంఘటితం కావాలని కోరారు. శుక్రవారం వరంగల్, హనుమకొండలలో జరిగిన పలు కార్యక్రమాల్లో సీతారాం ఏచూరి పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 29 వరకు సాగే రాష్ట్రవ్యాప్త జన చైతన్యయాత్రలను ప్రారంభించారు. కాకతీయ యూనివర్సిటీలో పీవీ నరసింహారావు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ''చేంజింగ్ సినారియో ఆఫ్ ఇండియన్ ఫెడరలిజం''అనే అంశంపై నిర్వహించిన సింపోజియంలో మాట్లాడారు. వరంగల్‌లోని అజంజాహి మిల్ (ఓ సిటీ) మైదానంలో జరిగిన బహిరంగసభలో సీతారాం ప్రసంగించారు. మోదీ ప్రభుత్వంలో మతోన్మాద రాజకీయాలు, కార్పొరేట్ సంస్థల దోపిడీ కవల పిల్లలుగా తయారయ్యాయని విమర్శించారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై దేశద్రోహులనే ముద్రవేసి సీబీఐ, ఈడీలతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఈడీ, సీబీఐ దాడుల వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని, దేశంలో 5,542 కేసులు నమోదు చేస్తే అందులో శిక్ష పడింది కేవలం 0.5 శాతమేనన్నారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్‌లను ఉపయోగించుకుంటూ ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని నిందించారు. సీఎం కేసీఆర్ కూతురు ఎమ్మెల్సీ కవిత మద్యం పాలసీలో తప్పు చేసినట్లు గుర్తిస్తే విచారణ చేసి రుజువైతే జైలు శిక్షలు వేసినా తమ పార్టీలు తప్పు పట్టవని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. అయితే కేవలం సీఎం కేసీఆర్‌ను లొంగదీసుకోవడం కోసం కవితను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రజాచైతన్య యాత్రలు ప్రారంభంకానుండగా తొలుత వరంగల్‌లో సీతారాం ఏచూరి శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా మొదట కాజీపేటనుంచి బైక్‌ర్యాలీ, హనుమకొండ 'కుడా'మైదానం, వరంగల్ జిల్లా ఆజంజాహి మిల్లు మైదానం కేంద్రాల్లో బహిరంగ సభలు నిర్వహించారు. కాగా ఈ యాత్రకు సంఘీభావం తెలుపుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు బహిరంగసభలో పాల్గొని ప్రసంగించారు.

సెర్ప్‌తో హైఫర్ ఇంటర్నేషనల్ ఒప్పందం

- మహిళల జీవనోపాధి కల్పనకు ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చిన సంస్థ
- పశువులు, కోళ్ల పెంపకం తదితరాలకు మార్కెటింగ్‌లో సహకారం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ పేద మహిళలకు ప్రతి నెలా శాశ్వత ఆదాయం వచ్చేలా జీవనోపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు హైఫర్ ఇంటర్నేషనల్–ఇండియా స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. వ్యవసాయ ఆధారిత వృత్తులపై ఆధారపడిన పేద మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు పాడి పశువులు, కోళ్ల పెంపకం, చిన్న జీవాల పెంపకంతో పాటు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాల కల్పన తదితరాలకు ఆ సంస్థ సహకరిస్తుంది. దీనికి సంబంధించిన అవగాహన ఒప్పందంపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) సీఈవో ఇంతియాజ్ అహ్మద్, హైఫర్ ఇంటర్నేషనల్–ఇండియా సంస్థ ప్రతినిధులు పరస్పరం సంతకాలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలతో లబ్ధిపొందిన మహిళలు వివిధ వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని శాశ్వత జీవనోపాధి పొందేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమూల్, హిందూస్తాన్ యునీలీవర్, ఐటీసీ, అజియో–రిలయన్స్ తదితర ప్రముఖ దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. దీంతో ఇప్పటికే 8,65,918 మంది మహిళలు కూలి పనుల నుంచి వ్యాపారాల బాట పట్టారు. ఈ నేపథ్యంలో పేద మహిళలకు మరింత తోడ్పాటు ఇచ్చేందుకు సెర్ప్ అధికారులు హైఫర్‌తో ఒప్పందం చేసుకున్నారు. కార్యక్రమంలో సురిత సన్‌దోషం నేతృత్వంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

హైఫర్ సహకారంతో రైతుల అభివృద్ధికి కృషి:కాకాణి

హైఫర్ సంస్థ సహకారంతో రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్, ఎఫ్‌పీవో) ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. అమెరికా ప్రధాన కేంద్రంగా పేదరికం, ఆకలి, పర్యావరణం అంశాలపై పనిచేస్తున్న హైఫర్ సంస్థ సీఈవో సురిత సన్‌దోషం బృందంతో ఆయన శుక్రవారం సచివాలయంలో భేటీ అయ్యారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అందించే సహకారంపై చర్చించారు.

టీటీడీలో రాజాం వేంకటేశ్వరాలయం విలీనం

- 3.5 ఎకరాల విస్తీర్ణంలో ఆలయం నిర్మించిన జీఎంఆర్
- టీటీడీ ఈవో ధర్మారెడ్డికి పత్రాలు అందించిన బాలాజీ ట్రస్టు సభ్యులు



అంతకాపల్లిలోని శ్రీపద్మావతి సహిత భూదేవి వేంకటేశ్వరస్వామి ఆలయం

సాక్షి ప్రతినిధి, విజయనగరం/ తిరుపతి అలిపిరి: విజయనగరం జిల్లా రాజాం మండలం అంతకాపల్లిలోని పద్మావతి సహిత భూదేవి వేంకటేశ్వర స్వామి ఆలయం టీటీడీలో విలీనమైంది. సుమారు 3.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఆలయాన్ని బాలాజీ ట్రస్టు సభ్యులు నిర్వహిస్తున్నారు. ఆలయానికి సంబంధించిన పత్రాలను వారు శుక్రవారం టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు. ఇక నుంచి ఆలయంలో టీటీడీ పద్ధతి ప్రకారమే స్వామివారికి సేవలన్నీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావు (జీఎంఆర్) నిర్మించిన ఈ ఆలయాన్ని బాలాజీ ట్రస్టు పర్యవేక్షణలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకూ నిర్వహిస్తున్నారని చెప్పారు. దీన్ని టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించాలని మల్లికార్జునరావు కోరారని, టీటీడీ పాలకమండలి అందుకు ఆమోదించిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధి ఈశ్వరరావు, గ్రంధి నీలాచలం, గ్రంధి భాస్కరరావు, కొల్లూరు వెంకటనాగేశ్వరరావు, జీఎంఆర్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు బనాయిస్తున్నారు..

నారా లోకేశ్



పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న లోకేశ్

ములకలచెరువు/తనకల్లు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.. అక్రమ కేసులు బనాయిస్తున్నారు.. మై డియర్ జగన్.. నువ్వు కేసులు పెట్టుకున్నా తగ్గేదేలే' అంటూ నారా లోకేశ్ చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రారంభమైన యువగళం పాదయాత్రలో భాగంగా శుక్రవారం ములకలచెరువులో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. లోకేశ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను నిలువునా ముంచుతున్న వైఎస్సార్‌సీపీ 2024 ఎన్నికల్లో కనుమరుగు కావడం ఖాయమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. టి.సదుం పాపాఘ్ని ఏటి నుంచి నిత్యం వంద టిప్పర్ల ఇసుక అక్రమంగా తరలిపోతోందని ఆరోపించారు. కాగా, పాదయాత్ర శుక్రవారం సాయంత్రం శ్రీసత్యసాయి జిల్లాలోకి ప్రవేశించింది. అన్నమయ్య జిల్లా ములకలచెరువు నుంచి జిల్లా సరిహద్దు ప్రాంతమైన తనకల్లు మండలం చీకటిమానిపల్లి సమీపంలోని విడిది కేంద్రానికి ఆయన చేరుకున్నారు.

'ఈనాడు'పై చర్యలు తీసుకోండి

పీసీఐకి ఫిర్యాదు చేసిన మస్తాన్‌వలీ

సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవల కాలంలో 'ఈనాడు' దినపత్రికలో తప్పుడు వార్తలు ప్రచురిస్తున్నారని.. ఆ పత్రికపై చర్యలు తీసుకోవాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు గుంటూరు జిల్లా పేరిచర్లకు చెందిన మస్తాన్ వలీ ఫిర్యాదు చేశారు. ఏపీ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే ఉద్దేశంతో వ్యక్తిగత ద్వేషంతో వాస్తవాలు ధ్రువీకరించకుండా వార్తలు ప్రచురించారని పేర్కొన్నారు. ఈనాడుకు స్వీయ నియంత్రణ ఉండాలని, ఈనాడు ఎడిటర్–ఇన్–చీఫ్‌కు లేఖ రాసినట్లు మస్తాన్ వలీ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 18 । మార్చి । 2023



నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి నిత్యాన్నదానానికి ఏలూరుకు చెందిన తిమ్మరాజు, వెంకట సుష్మ దంపతులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.



ఆరు అంశాలకు ఆమోదం

మచిలీపట్నంటౌన్: అజెండాలోని నాలుగు అంశాలు, టేబుల్ అజెండాలోని రెండు అంశాలకు మచిలీపట్నం కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శుక్రవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు.



1,10,687 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,05,566 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,10,687 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

పెనమలూరు పాఠశాలకు రూ. 2 లక్షల విరాళం



పెనమలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత రూ. 2 లక్షల విరాళం అందజేశారు. పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రవాస భారతీయుడు, పూర్వ విద్యార్థి అర్వపల్లి ప్రతాప్ మాతృభూమిపై మమకారంతో తల్లిదండ్రులు పుష్పావతి, శ్రీకృష్ణమూర్తి జ్ఞాపకార్థం రూ. 2 లక్షల చెక్కును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.దుర్గాభవానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేయటంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుడు కిలారు వీరబ్రహ్మాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ)/చిలకలపూడి(మచిలీపట్నం): ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. కృష్ణాజిల్లాలో ఈ పరీక్షకు 19,696 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 19,323 మంది విద్యార్థులు హాజరయ్యారు. 373 మంది విద్యార్థులు హాజరుకాలేదని ఆర్ఐవో పి. రవికుమార్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో 37,945 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 37,289 మంది విద్యార్థులు హాజరయ్యారు. 656 మంది విద్యార్థులు హాజరుకాలేదు. ఎన్టీఆర్ జిల్లాలోని బెంజ్ సర్కిల్ వద్ద శ్రీ చైతన్య కళాశాల, కృష్ణలంక లోని గవర్నమెంట్ జూనియర్ కళాశాల, భవిష్య కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో పి. రవికుమార్ పరిశీలించారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ జరగలేదని పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ సందర్శన



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ పరిధిలో ఇటీవల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన శ్రీనగర్ కాలనీ 33/11కేవీ ఏఐఎస్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను శుక్రవారం ఏపీసీపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జె. పద్మజనార్దనరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం వినియోగదారుల సౌకర్యార్థం బిల్లులు వసూళ్ల, విద్యుత్తు బిల్లుల సమస్యల పరిష్కారం కొరకు ఉపకేంద్రం ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ మురళీమోహన్, టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్‌ను ఆదేశించారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఖోఖో చాంపియన్ షిప్ చీఫ్ రిఫరీగా మడక ప్రసాద్



గుడివాడ రూరల్: ఆసియన్ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలకు గుడివాడ ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మడక ప్రసాద్‌ను చీఫ్ రిఫరీగా ఎంపికయ్యారు. ఇండియన్ ఖోఖో ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ ఎంఎస్ త్యాగి వివరాలు తెలుపుతూ అసోం రాష్ట్రంలోని గువాహటి నందు ఈనెల 20నుండి 23వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయన్నారు. ఈ పోటీల్లో చీఫ్ రిఫరీగా రాష్ట్ర ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడు అవార్డు సాధించిన మడక ప్రసాద్‌ను ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను రాష్ట్ర ఖోఖో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ ఆర్‌కే ప్రసాద్, ఎం.సీతారామిరెడ్డి, ఎస్పీఎస్ పాఠశాల హెచ్‌ఎం టీఎంఈ రాణిలు హర్షం వ్యక్తం చేశారు.

24 నుంచి ఇంటర్వ్యూలు

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నంలోని కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిన వివిధ పోస్టుల భర్తీకి ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె. సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూ టైం షెడ్యూల్, విద్యార్హతలు, వేతనం వివరాల కోసం వెబ్‌సైట్ https://machilipatnam.kvs.ac.in ను సందర్శించాలన్నారు. అప్లికేషన్‌ను కూడా ఈ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.



బందలాయిచెరువులో కల్లాల్లోని మినుమును బస్తాల్లోకి ఎత్తుతున్న కూలీలు



జగ్గయ్యపేట రామచంద్రునిపేటలో కల్లాల్లో ఆరబోసిన మిర్చి



వత్సవాయిలో నేలవాలిన మొక్కజొన్న

అకాల కష్టం

వర్షం గుబులు.. రైతు దిగాలు

- ద్రోణి ప్రభావంతో పలుచోట్ల మోస్తరు వర్షం
- కల్లాల్లోనే మినుము ఉండటంతో ఆందోళన
- పంటను కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్న అన్నదాతలు

కంకిపాడు: అకాల వర్షంతో అన్నదాతలకు దిగులు పట్టుకుంది. చేతికొచ్చిన పంట ఎక్కడ నోటికి దక్కకుండా పోతుందోనన్న భయం నెలకొంది. వర్షాలకు పంట నాణ్యత దెబ్బతిని మార్కెట్‌లో ధర పడిపోయే ప్రమాదం ఉండటంతో ఆందోళన తారస్థాయికి చేరింది. కోస్తాంధ్రపై ఏర్పడ్డ ద్రోణి ప్రభావంతో గురువారం అర్ధరాత్రి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం కూడా జిల్లాలో పలు చోట్ల చిరుజల్లులు నుంచి మోస్తరు వర్షం పడింది. వర్షానికి తోడు తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. చలిగాలులు, వర్షం నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

అన్నదాతల వెన్నులో వణుకు..

ప్రస్తుత రబీ సీజన్‌లో మినుము, పెసర పంట తీత పనులు పూర్తయ్యి నూర్పిడి పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. పంట మార్కెట్‌కు, ఇంటికి చేర్చుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.10 లక్షల హెక్టార్లలో మినుము, 10 వేల ఎకరాల్లో పెసర పంటలు సాగయ్యాయి. మరో వైపు మొక్కజొన్న కోత, పసుపు దుంప తీత, వంటకం పనులు నిర్వహిస్తున్నారు. కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న గింజలు, ఉడికించిన పసుపు దుంపలు ఉన్నాయి. ద్రోణి ప్రభావంతో కురిసిన వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. నూర్పిడికి సిద్ధంగా ఉంచిన మినుము గూళ్లు (కుప్ప) తడిసిపోకుండా పరదాలను కప్పి పంటను సంరక్షించుకునేందుకు పాట్లు పడ్డారు.



బందలాయిచెరువులో తడిసిన మినుములను ఆరబెడుతున్న కూలీలు

పనల మీద ఉన్న మినుము, పెసర గూళ్లు తడిసిపోయాయి. వర్షానికి మినుము, పెసర కాయలు పగిలిపోయి గింజ వృథాగా పోతుందని, కాయలు తడవటం, చలిగాలుల తీవ్రతకు బూజుపట్టి నాణ్యత దెబ్బతింటుందని వాపోతున్నారు. తడిచిన మినుము, పెసర గూళ్లను పొడి వాతావరణం రాగానే గాలికి ఆరబెట్టి తిరిగి గూళ్లు వేసుకుంటున్నారు. గూళ్లపై పరదాలు కప్పి పంటను సంరక్షించుకుంటున్నారు. కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న, ఉడకబెట్టి కల్లాల్లో ఎండబోసిన పసుపు కొమ్ములు కూడా వర్షం బారిన పడ్డాయి. మోస్తరు వర్షానికి పంట తడవటంతో నాణ్యత దెబ్బతినకుండా పంటను ఆరబోసుకునే పనిలో రైతులు, కూలీలు నిమగ్నమయ్యారు.

ఇప్పటి వరకూ అంతా బాగుంది..

ఇప్పటి వరకూ వాతావరణ పరిస్థితులు అనుకూలించి అపరాలు, పసుపు, మొక్కజొన్న దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వర్షం తమ ఆశలపై నీళ్లు పోస్తుందని అన్నదాతలు వాపోతున్నారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విపత్తు తొలగితే పంట నాణ్యత తగ్గకుండా ఉంటుందని, దిగుబడులకు తగ్గట్టు ఆశించిన ధర అందుతుందని అన్నదాతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉరుకులు.. పరుగులు..

ఎన్టీఆర్ జిల్లాలో కూడా పలు చోట్ల శుక్రవారం తెల్లవారుజామున నుంచి వర్షం కురిసింది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో అకాల వర్షం రైతును తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా మిర్చి రైతులు పంటను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. పెనుగంచిప్రోలు మండలంలో కల్లాల్లో ఉన్న మిర్చి పంటపై పరదాలు కప్పి రక్షించుకునే ప్రయత్నం చేశారు. వర్షంతో పాటు ఈదురుగాలులు బలంగా వీయడంతో పలు చోట్ల మొక్కజొన్న కూడా నేలవారింది. జగ్గయ్యపేట మండలంలోని షేర్ మహ్మద్‌పేట, అనుమంచిపల్లి, గండ్రాయి, తిరుమలగిరి, తక్కెళ్లపాడు, చిల్లకల్లు గ్రామాలలో ఈదురు గాలుకు మొక్కొజన్న బాగా దెబ్బతింది. వత్సవాయిలో కూడా మొక్కజొన్న, పెసర వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురుగాలులు వీయడంతో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

ఈదురుగాలులు లేకపోతే..

అవనిగడ్డ: అకాల వర్షం ముంచెత్తినప్పటికీ కృష్ణా జిల్లాలో ఈదురుగాలులు లేకపోవడంతో మొక్కజొన్న, మామిడి పంటలకు మేలు చేసినట్టయింది. ఈ వర్షం వల్ల మొక్కజొన్న పంటకు నీటి తడులు అందించకుండా పోతుంది. మొక్క ఏపుగా పెరిగి మొక్కజొన్న పొత్తులు బలంగా పెద్దవిగా వస్తాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పూత మీదున్న మామిడి పంటకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. పూత నిలబడి పిందె, కాయలు బలంగా వస్తాయన్నారు. అయితే ఎన్టీఆర్ జిల్లాలో మాత్రం మొక్కజొన్నకు నష్టమే జరిగింది.

రెండు పంటలు పనల మీదే ఉన్నాయి..



రబీ సీజన్‌లో మినుము, పెసర పంట 25 ఎకరాల్లో సాగు చేశాను. తీత పనులు పూర్తి చేసి పనల మీద ఉంచాను. వర్షంతో పనలు అన్నీ తడిసిపోయాయి. మళ్లీ రెండు రోజులు వానలు అంటున్నారు. చాలా ఆందోళనగా ఉంది. వర్షాలు కురిస్తే పంట మొక్క వచ్చి నాణ్యత దెబ్బతింటుంది. ప్రకృతి కరుణించాలని వేడుకుంటున్నాం.

– నెరుసు నాని, రైతు, ఉప్పలూరు, కంకిపాడు మండలం

ఆరబెట్టిన పంట తడిసిపోయింది..



ఈ సంవత్సరం మొత్తం రెండు ఎకరాలు సాగు చేశాను. రెండు ఎకరాలకు రూ.54వేలు ఖర్చయ్యాయి. మూడు రోజుల పాటు వర్షాలు ఉంటాయని గురువారం మిషన్‌తో 1.20 ఎకరాలు నూర్పించాను. ఈ రోజు ఆరబెట్టి ఇంటికి తీసుకెళదామనుకున్నాను. ఇంతలోనే కురిసిన వర్షానికి మినుములు తడిసిపోయాయి. మరో 80 సెంట్లలో కూలీలతో లాగించిన పంటను పట్టాలతో కప్పించాను. గాలి ఆడకపోతే బూజు పట్టేస్తుంది.

– బడే కృష్ణార్జునులు, రైతు, బందలాయిచెరువు, అవనిగడ్డ

ఆయువు తీసిన అప్పులు

- ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య
- మృతుల్లో కొత్తమాసు ఫణీంద్ర, సుధ దంపతులు
- ఫణీంద్ర తల్లి రాజేశ్వరి మరణంపై పలు అనుమానాలు



ఫణీంద్ర దంపతులు (ఫైల్)



రాజేశ్వరి(ఫైల్)

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అప్పులు కుప్పగా పెరిగాయి. తీసుకున్న అసలు చెల్లించినా వడ్డీ, ఆపై చక్రవడ్డీ చెల్లించాలంటూ వేధింపులు. అప్పులు తీర్చే మార్గం లేక... వేధింపులు భరించలేక కన్నతల్లితో సహా ఒకే కుటుంబంలో ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. భార్య, భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా తల్లి మృతి అనుమానాలకు తావిస్తోంది. ఎన్టీఆర్ జిల్లా భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న గొల్లపూడి గ్రామంలో జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది. పోలీసులు, మృతుని సోదరుడు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..

గొల్లపూడి వన్ సెంటర్ పోస్టాఫీసు రోడ్డులోని హిమాగ్న హోమ్స్ నందు ఫ్లాట్ నంబర్ 204లో కొత్తమాసు ఫణీంద్ర (36) తన తల్లి కొత్తమాసు రాజేశ్వరి (55), భార్య కొత్తమాసు వెంకట సాయి మోహన సుధతో (28) కలిసి నివాసం ఉంటున్నాడు. ఫణీంద్ర మా డిజైన్ పేరుతో ఇంటర్ నెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. దీనికి తోడు ఇతరుల నుంచి డబ్బులు తీసుకుని రొటేషన్ వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. ఇతను తన మేనమామతో పాటు ఇతరుల వద్ద అప్పులు, బ్యాంకు లోన్లు తీసుకున్నాడు. సొంత మేనమామ జాలురు సుబ్బారావు వద్ద తీసుకున్న రూ.10 లక్షల అప్పునకు, నెలకు రూ.10 వేల వడ్డీ చెల్లిస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం వరకు దీనిని చెల్లిస్తూ వచ్చాడు.

ఫణీంద్ర ఇంట్లో సూసైడ్ నోట్..

నాగఫణీంద్ర సోదరుడు ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఉదయం ఫణీంద్రకు ఫోన్ చేశాడు. ఫణీంద్ర, అతని భార్య, తల్లి ఇంట్లో ఏ ఒక్కరూ ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో అనుమానం వచ్చిన ప్రవీణ్ గొల్లపూడిలోని ఫణీంద్ర ఇంటికి వచ్చి చూశాడు. ఇంటి తలుపులు కొట్టినా తీయకపోవడంతో వాచ్‌మన్ సహాయంతో తలుపులు పగుల గొట్టి లోపలికి ప్రవేశించాడు. నాగఫణీంద్ర, అతని భార్య సుధ వంట గదిలోని సీలింగ్ ఫ్యాన్ కొక్కేనికి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించారు. తల్లి రాజేశ్వరి బెడ్ రూంలో వెల్లకిలా పడి ఉంది. ఆ పక్కనే ఉన్న కంప్యూటర్ టేబుల్‌పై సూసైడ్ నోట్ పెట్టి ఉంది. సూసైడ్ నోట్‌లో తమ మరణానికి మేనమామ జాలురు సుబ్బారావు, అతని భార్య భారతి, అతని కుమారుడు మణికంఠ, కుమార్తె స్రవంతి కారణమని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు.

తల్లి మరణం.. అనుమానాస్పదం

కాగా నాగ ఫణీంద్ర తల్లి రాజేశ్వరి మరణం పలు అనుమానాలకు తావిస్తోంది. రాజేశ్వరి బెడ్‌రూంలో మంచంపై పడి ఉంది. ఆమె ముఖానికి ప్లాస్టిక్ కవర్ చుట్టి గడ్డం కింద ముడి వేసి ఉంది. ఫణీంద్ర దంపతులు ఆత్మహత్య చేసుకోవడానికి ముందే తల్లిని చంపేశారా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి, కన్న తల్లి, కళ్ల ముందే చనిపోయిన తరువాత కొడుకు, కోడలు ఆత్మహత్యకు పాల్పడ్డారనే కోణంలో పోలీసులు పరిశీలిస్తున్నారు. ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు రాజేశ్వరి మరణంపై పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హస్త కళ ప్రదర్శన భళా

లేపాక్షి శిల్పబజార్ ప్రారంభం



స్టాల్‌లోని చీరలను తిలకిస్తున్న ప్రభుత్వ పరిశ్రమల, వాణిజ్య ముఖ్యకార్యదర్శి సునీత

పటమట(విజయవాడతూర్పు): తక్కువ ధరలకే హస్తకళా ఉత్పతులు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు గాంధీ శిల్పకళ బజార్‌ను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల, వాణిజ్య ముఖ్యకార్యదర్శి కె. సునీత అన్నారు. శుక్రవారం పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో జాతీయ స్థాయి లేపాక్షి శిల్పబజార్‌ను ఆమె ప్రారంభించారు. హస్తకళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో 100కు పైగా స్టాల్స్ ద్వారా ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించటం అభినందనీయమని తెలిపారు. కేంద్ర హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణలక్ష్మి మాట్లాడుతూ దేశంలోని కర్నాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, రాజస్థాన్, మహారాష్ట్ర, బీహార్, ఒడిశా, తెలంగాణ, పశ్చిమబెంగాల్, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో పేరుగాంచిన హస్తకళలను ప్రదర్శిస్తున్నామని తెలిపారు. ఇందులో కలంకారి, ప్రింటింగ్, పెయింటింగ్, కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, లేసు అల్లికలు, చెక్కతో తయారైన కళాకృతులు, టెర్రకోట పాటరీలు, తాటాకు వస్తువులు, తివాచీలు, కేన్ వస్తువులు, మంగళగిరి చీరలు, చేనేత వస్త్రాలు, హైదరాబాద్ ముత్యాలు, బ్లాక్‌మెటల్ వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితో పాటు నిర్మల్‌పెయింటింగ్, ఇతర రాష్ట్రాలకు చెందిన ఎంబ్రాయిడరీ, గాజు ఆభరణాలు, మధుబని పెయింటింగ్స్, బ్లూపాటరీ వస్తువులు, చిత్రపటాలు, సిల్వర్ పిలిగ్రీ, లక్కగాజులు, డోక్రా కేస్టింగ్, డ్రైఫ్లవర్స్ వంటివి ప్రదర్శనలో ఉంచామన్నారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో లేపాక్షి ఓఎస్‌డీ లక్ష్మీనాథ్, చైర్‌పర్సన్ వి. విజయలక్ష్మి, ఎండీ బాల సుబ్రహ్మణ్య రెడ్డి, ఈడీ ఎం. విశ్వ, మేనేజర్ సురేష్, డీసీహెచ్‌వో సువర్చల, ఎగ్జిబిషన్ ఇన్‌చార్జి మేనేజర్ బి. శైలజ, మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



తిరువూరులో సీఎం పర్యటన ఏర్పాట్లను సమీక్షిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు. చిత్రంలో జేసీ శ్రీవాస్ నుపూర్, ఎమ్మెల్సీ తలశిల, ఎమ్మెల్యే రక్షణనిధి తదితరులు

తిరువూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న తిరువూరు విచ్చేస్తున్న సందర్భంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. జగనన్న విద్యాదీవెన పథకం నిధుల విడుదల చేసే కార్యక్రమాన్ని ఆరోజు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు సభా ప్రాంగణం వద్ద పనులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమానికి విచ్చేసే విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు పార్టీ నాయకుల వాహనాల పార్కింగ్, సీటింగ్ తదితర సౌకర్యాలకు సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అవసరమైనన్ని ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని, వర్షం కురిసినా సభా ప్రాంగణంలో ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ఉన్నత విద్య చైర్మన్ హేమచంద్రారెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే కె. రక్షణనిధి, జేసీ నివాస్ అజయ్ నూపుర్, డీసీపీ మేరీ ప్రశాంతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్బీకేలో రాజస్థాన్ వ్యవసాయాధికారులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గొల్లపూడి రైతు భరోసా కేంద్రాన్ని రాజస్థాన్ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రతినిధి బృందం శుక్రవారం సందర్శించింది. రాజస్థాన్ రాష్ట్ర వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ మీరా, ఏ. అజయ్‌కుమార్ పచోడియా ఇతర బృందం సభ్యులు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. రైతు భరోసా కేంద్రం ద్వారా అమలవుతున్న పథకాలు, ఎరువుల సరఫరా, వివిధ వ్యవసాయ వనరుల సరఫరా, క్రాప్ పంటల నమోదు, పంటల బీమా పథకం వంటి అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులతో అధికారులు ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు, ఎరువుల పంపిణీ, పంటల గిట్టు బాటు ధర వంటి అంశాలపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ కార్యాలయానికి చెందిన జేడీఏ శ్రీధర్ పాల్గొన్నారు.



రైతులతో ముఖాముఖిలో రాజస్థాన్ అధికారులు

గుడివాడలో బరితెగించిన టీడీపీ

- ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం అంటూ ప్రధాన రహదారిపై సంబరాలు
- బాణసంచాతో వాహనాదారులకు ఇబ్బందులు
- అడ్డుకున్న పోలీసులపైనా దౌర్జన్యం
- అధికారంలోకి వచ్చాక అంతుచూస్తామంటూ బెదిరింపులు



సీఐ గోవిందరాజులును వేలు చూపి బెదిరిస్తున్న రావి వెంకటేశ్వరరావు

గుడివాడరూరల్: కృష్ణాజిల్లా గుడివాడలో తెలుగుదేశం పార్టీ నాయకులు మరోసారి బరితెగించారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిందని ప్రధాన రహదారిలో సంబరాల పేరిట నానా హంగామా సృష్టించారు. అడ్డుకోబోయిన పోలీసులపై మాజీ ఎమ్మెల్యే, గుడివాడ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావు దౌర్జన్యానికి దిగి బెదిరింపులకు పాల్పడ్డారు.

అసలేం జరిగిందంటే..

విశాఖలో టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం సాధించడంతో శుక్రవారం గుడివాడ నెహ్రూచౌక్‌లో టీడీపీ నేతలు బాణసంచా కాల్చుతూ సంబరాలు ప్రారంభించారు. వన్‌టౌన్ సీఐ గోవిందరాజులు, ఎస్ఐ గౌతమ్‌కుమార్‌లు తమ సిబ్బందితో నెహ్రూచౌక్ వద్దకు చేరుకుని అనుమతులు లేకుండా రోడ్డుపై ర్యాలీ, బాణసంచా కాల్చడం నిషేధమని, ఇక్కడ నుంచి వెళ్లి పోవాలని రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులకు చెప్పే ప్రయత్నం చేశారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతున్న సమయంలో అనుమతులు లేని ర్యాలీలు నిర్వహించి విద్యార్థులకు, వాహనచోదకులకు ఇబ్బంది కలిగించే పనులు చేయడం సరి కాదని వారించారు.

రావి వీరంగం..

బాణసంచా కాల్చడం ఆపాలని కోరిన పోలీసులపై రావి వెంకటేశ్వరరావు దౌర్జన్యం చేశారు. అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని, వచ్చేది తమ ప్రభుత్వమని, తాము అధికారంలోకి వస్తే మీ అంతు తేలుస్తామని సీఐను వేలు చూపి బెదిరించారు. ఒకానొక దశలో సీఐ, ఎస్ఐల పైపైకి వేలుచూపిస్తూ దూసుకొచ్చారు. పోలీసు అధికారులు, సిబ్బంది వారించినా రావి, వారి అనుచరులు వెనక్కి తగ్గకుండా ప్రవర్తించారు. రాష్ట్రంలో అత్యధిక ఎమ్మెల్సీల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించినా ఆ పార్టీ శ్రేణులు రోడ్డెక్కకుండా పార్టీ కార్యాలయంలోనే విజయోత్సవ కార్యక్రమాలు చేసుకుంటే, ఒక చోట తమ అభ్యర్థి విజయం సాధించాడని హంగామా చేయడాన్ని పట్టణ ప్రజలు సైతం తప్పుబట్టారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

పెనమలూరు: ఆటో ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు దుర్మరణం చెందిన ఘటన గంగూరు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగూరు గ్రామ పరిధి కరెంట్ ఆఫీసు వద్ద గుర్తు తెలియని వృద్ధుడు (65) గురువారం రాత్రి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా కంకిపాడు నుంచి విజయవాడ వైపు వస్తున్న ట్రక్ ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వృద్ధుడు గళ్ల టీషర్టు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు.

పెడన: నందమూరు జయంతి కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు చనిపోయాడు. జోగి నాంచారయ్య అనే వ్యక్తి (60) ఒంటరిగా జీవిస్తున్నాడు. నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని కారు వెనుక నుంచి ఢీ కొట్టి వెళ్లిపోయింది. ప్రభుత్వాసుపత్రికి తరలించే సమయంలో చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గమ్మకు రూ.6 లక్షల బంగారు నగలు



బంగారపు హారం, నక్లెస్‌లను ఈవోకు అందచేస్తున్న దాతలు



మంత్రి బొత్స సత్యనారాయణకు అమ్మవారి ప్రసాదాలు అందిస్తున్న ఈవో భ్రమరాంబ, అర్చకులు



ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డికి ప్రసాదాలు అందిస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లికి చెందిన భక్తులు రూ.6 లక్షల విలువైన బంగారపు లక్ష్మీ కాసుల హారం, కాసుల నక్లెస్‌లను శుక్రవారం విరాళంగా అందచేశారు. భీమవరపు సామిరెడ్డి, జె.వి.డి.వి.ప్రసాద్‌రెడ్డి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి బంగారపు హారాలు అందచేశారు. సుమారు రూ. 3.5 లక్షల వ్యయంతో 52 గ్రాముల బంగారు లక్ష్మీ కాసుల హారం, రూ.2.5 లక్షల వ్యయంతో 25 గ్రాముల కాసుల నక్లెస్‌ను అమ్మవారికి సమర్పించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

దుర్గమ్మ సేవలో మంత్రి బొత్స కుటుంబం...

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబ సమేతంగా దుర్గమ్మను దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఈవో భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలను సమర్పించారు.

మంత్రి చెల్లుబోయిన...

దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రిని ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. దర్శనం తర్వాత వేద పండితులు ఆశీర్వచనం అమ్మవారి ప్రసాదాలు అందచేశారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్...

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి దుర్గమ్మను దర్శించుకున్నారు. విజయ్‌ప్రతాప్‌రెడ్డిని ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. ఈవో భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలు, పట్టు వస్త్రాలను అందచేశారు. పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, కట్టా సత్తెయ్య, కేసరి నాగమణి పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి, సర్వజన సంక్షేమానికి ప్రతీక బడ్జెట్

ప్రభుత్వ విప్ ఉదయభాను



జగ్గయ్యపేట అర్బన్: ఆంధ్రరాష్ట్ర సమగ్రాభివృద్ధి, సర్వజన సంక్షేమానికి ప్రతీక ఏపీ బడ్జెట్ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాజీ లేని వైఖరి అనుసరిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రూ.2,79,279.27 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టడం అభినందనీయమని చెప్పారు. అన్ని రంగాలకు ప్రాధాన్యమిస్తూ కేటాయింపులు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనార్టీ, కాపు, ఈబీసీ వర్గాల అభ్యున్నతికి పెద్ద పీట వేశారని తెలిపారు. పేదల సొంతింటి కల సాకారం కోసం రూ.6,291 కోట్లు కేటాయించారని వెల్లడించారు. జనరంజక బడ్జెట్‌పై ప్రతిపక్షాలు అర్థరహిత విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. డీబీటీ ద్వారా అవినీతి రహిత పాలన, పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధి, ఉపాధి కల్పనలో ఏపీ అగ్రగామిగా నిలుస్తుంటే ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుడుతుందన్నారు. ఉనికి కోసం తప్పదు కాబట్టే బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్నాయన్నారు. సీఎం జగనన్న పాలన పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

వైద్య చికిత్సకు ఎమ్మెల్యే రూ. 50 వేలు సాయం



నగదును అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

గన్నవరం: మధుమేహ వ్యాధితో బాధపడుతున్న విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడుకు చెందిన కొమరవల్లి ఆశీర్వాదం వైద్య చికిత్సకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ. 50 వేలు ఆర్థిక సాయం చేశారు. శాసనసభ్యుని కార్యాలయంలో శుక్రవారం ఆశీర్వాదం కుటుంబ సభ్యులకు నగదును ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యులు కాకర్లమూడి సువర్ణరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మధుమేహ వ్యాధి వల్ల ఆశీర్వాదం కాలుకు ఇన్‌ఫెక్షన్ కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ నేతలు ఎమ్మెల్యే వంశీమోహన్ దృష్టికి తీసుకురావడంతో ఆయనకు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కాలును కొంత భాగం తొలగించడంతో ప్రాణపాయం నుంచి బయటపడ్డారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు ఆతని వైద్యానికి అయినా పూర్తి ఖర్చును అందజేసినట్లు తెలిపారు. ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ళ పూర్ణచంద్రరావు, గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, ఎంపీటీసీలు గంగుల శ్రీనివాసరావు, దూరు రత్నం, పార్టీ నేతలు రామిశెట్టి వెంకటేశ్వరరావు, కోనేరు సుబ్బారావు, సమ్మెట సాంబశివరావు పాల్గొన్నారు.

'గేట్'లో భూపతి కుమార్‌కు 308వ ర్యాంక్



కూన భూపతి కుమార్ (ఫైల్)

గుడివాడరూరల్: జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గేట్‌లో నందివాడ మండలంలోని ఇలపర్రు శివారు లక్ష్మీనరసింహపురం (ఎల్‌ఎస్‌పురం) గ్రామానికి చెందిన కూనభూపతి కుమార్ 308వ ర్యాంక్ సాధించి జిల్లా ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింప చేశాడు. ఎల్‌ఎస్‌పురం గ్రామానికి కూన ఆదినారాయణ, నీలవేణి దంపతులు కుమారుడైన భూపతికుమార్ ప్రాథమిక విద్యాభ్యాసం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సాగింది. పదో తరగతి శ్రీకాకుళం జిల్లాలోని అమ్మమ్మ, తాతయ్యల వద్ద చదివి 9.8 గ్రేడ్ పాయింట్స్ సాధించాడు. పాలిటెక్నిక్‌ను కాకినాడలోని ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాలలో చదివి 9.0 జీపీఏ సాధించాడు. ఈసెట్‌లో సైతం రాష్ట్ర స్థాయిలో 28వ ర్యాంక్ సాధించడం విశేషం. ఇంజినీరింగ్ విద్యను భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చదివి 8.0 జీపీఏ సాధించాడు. గేట్ పరీక్షలకు హాజరైన కుమార్ గురువారం రాత్రి విడుదలైన ఫలితాల్లో 308వ ర్యాంక్ సాధించి గ్రామం పేరును జాతీయస్థాయిలో నిలిపాడు. విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థి భూపతికుమార్‌ను గ్రామస్తులు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

• చల్లపల్లిలో అత్యధిక వర్షపాతం

అవనిగడ్డ: చల్లపల్లి మండలంలో అత్యధికంగా 27.8 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు.

లంచం కేసులో పంచాయతీ కార్యదర్శికి ఏడాది జైలు

విజయవాడ స్పోర్ట్స్: లంచం తీసుకుంటూ పట్టుబడిన పంచాయతీ కార్యదర్శికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎ.సత్యానందం శుక్రవారం తీర్పు చెప్పారు. గుంటూరు జిల్లా గురజాల మండలం పులిపాడు గ్రామ పంచాయతీకి చెందిన వల్లేరు వెంకటేశ్వర్లు నుంచి అదే గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.కాశీవిశ్వనాథం రూ. 2 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం పంచాయతీ కార్యదర్శి లంచం తీసుకున్నట్లు ఏసీబీ అధికారుల విచారణలో వెల్లడైంది. 2011 ఏప్రియల్ 23వ తేదీన జరిగిన ఈ ఘటనపై ఏసీబీ అధికారులు రెండు సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసి కాశీవిశ్వనాథంను కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరుపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.ఎస్.ఆనందజ్యోతి న్యాయస్థానానికి వాదనలు వినిపించారు. విచారణ అనంతరం రెండు సెక్షన్‌లలో నేరం రుజువు కావడంతో నిందితుడు కాశీవిశ్వనాథంకు ఒక్కో సెక్షన్‌కు ఒక్కో ఏడాది చొప్పున జైలు శిక్షతో పాటు రూ. 2,500 జరిమానా విధించారు. రెండు శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని, జరిమానా నగదు చెల్లించకుంటే అదనంగా మరో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి ఏడేళ్ల జైలు

విజయవాడ స్పోర్ట్స్: ఓ యువతి ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మీ శుక్రవారం తీర్పు చెప్పారు. విజయవాడ నగరంలోని క్రీస్తురాజుపురానికి చెందిన మెండెం రాజేష్ అలియాస్ బాబి అదే ప్రాంతానికి చెందిన ఓ యువతికి ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి కొన్నాళ్ల తరువాత మొహం చాటేశాడు. అంతేగాకుండా ఆ యువతికి వేరే వ్యక్తులతో అక్రమ సంబంధం ఉందని ఆరోపణలు చేస్తూ మానసికంగా హింసించాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన ఆ యువతి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. 2017 అక్టోబర్ 16వ తేదీన జరిగిన ఈ ఘటనపై సంబంధిత మాచవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. రెండు రోజుల తరువాత నిందితుడు బాబిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ జి.కల్యాణి కోర్టుకు వాదనలు వినిపించారు. పది మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు బాబికి జైలు శిక్షతో పాటు రూ. 5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

చిలకలపూడి(మచిలీపట్నం): దివ్యాంగురాలిపై లైంగికదాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి డాక్టర్ షేక్ మొహమ్మద్ ఫజులుల్లా శుక్రవారం తీర్పు చెప్పారు. చందర్లపాడు మండలం కాసరబాద గ్రామంలో 12 సంవత్సరాల దివ్యాంగురాలిపై 2015 జనవరి 6వ తేదీన అదే గ్రామానికి చెందిన కోట బాబూరావు లైంగికదాడికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఏపీపీ ముంజులూరి వెంకటమహేష్ 15 మంది సాక్ష్యులను విచారించగా నిందితుడు బాబూరావు పై నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి జీవిత ఖైదు, రూ. 1500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన దేవరకొండ శివలక్ష్మయ్య, మొగిలి వెంకట రవికుమార్ జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో హెడ్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్నారు. కొన్ని రోజులుగా శివలక్ష్మయ్య మార్కెట్‌యార్డులోని ఈవీఎంల రక్షణలో విధులు నిర్వహిస్తున్నాడు. లక్ష్మయ్య విధుల్లో ఉండగా వెంకటరవికుమార్ పూటుగా మద్యం తాగి మార్కెట్ యార్డులోకి వెళ్లాడు. విధి నిర్వహణలో ఉన్న లక్ష్మయ్య చెంపపై కొట్టటంతో పాటు మెడ పట్టుకుని బలంగా వెనక్కి తోశాడు. ఈ ఘటనలో లక్ష్మయ్య సమీపంలోని నాపరాయిపై పడటంతో తలకు బలమైన గాయమైంది. బాధితుడు జరిగిన విషయాన్ని ఏఆర్ అధికారులకు ఫోన్ చేసి చెప్పాడు. అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని లక్ష్మయ్యను వైద్యం నిమిత్తం సర్వజన ఆసుపత్రికి తరలించారు. రవికుమార్ తీరుపై ఎస్పీ జాషువా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తోటి ఉద్యోగిపై దాడికి పాల్పడిన రవికుమార్‌ను అప్పటికప్పుడు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేసు నమోదు చేసిన చిలకలపూడి పోలీసులు శుక్రవారం రవికుమార్‌ను కోర్టులో హాజరు పరచినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఫైబర్ టెక్నీషియన్ మృతి

కంచికచర్ల: విద్యుత్‌షాక్‌తో ప్రైవేటు టెక్నీషియన్ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు మోడల్‌కాలనీకి చెందిన నరసాపురపు రాజేష్ (32)అనే వ్యక్తి ఏపీ ఫైబర్ నెట్‌లో ప్రైవేటు టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మండలంలోని బత్తినపాడు వెళ్లే ఫైబర్ కేబుల్‌ను కనెక్ట్ చేసేందుకు విద్యుత్ పోల్ ఎక్కాడు. ప్రమాదవశాత్తు విద్యుత్‌వైర్లు తగలటంతో కింద పడగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పారిశుద్ధ్య మెరుగుదలకు అధిక ప్రాధాన్యం

స్వచ్ఛ భారత్ కేంద్ర బృంద సభ్యుడు కడియాల కుమార్



ఘన వ్యర్థ కేంద్రాన్ని పరిశీలించిన కేంద్ర కమిటీ సభ్యుడు కుమార్, అధికారులు

గుడివాడరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య మెరుగుదలకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని స్వచ్ఛ భారత్ మిషన్ కేంద్ర కమిటీ సభ్యుడు కడియాల కుమార్ అన్నారు. మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో స్వచ్ఛ భారత్ మిషన్ కేంద్ర బృంద సభ్యులు స్థానిక అధికారులతో కలసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కడియాల కుమార్, స్థానిక అధికారులు ఘన వ్యర్థ పదార్థాల కేంద్ర నిర్వహణ తీరును పరిశీలించారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను ఎప్పటికప్పుడు సేకరించి ఘన వ్యర్థ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. సర్పంచ్ వెలగలేటి రమ్య, పంచాయతీ కార్యదర్శి పాగోలు పూర్ణచంద్రరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన సాంబశివరావు

పెనమలూరు: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన యనమలకుదురులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇందిరానగర్ 2 కు చెందిన దేవాంగుల సాంబశివరావు (32) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య లక్ష్మి తిరుపతమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాంబశివరావు ఇటీవల కాలంలో చాలా అప్పులు చేశాడు. పైగా మద్యానికి బానిసగా మారటంతో భార్య గొడవపడి వారం కిందట పుట్టింటికి వెళ్లి పోయింది. అప్పటి నుంచి ఆయన ఒంటరిగానే ఇంట్లో ఉంటున్నాడు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాంబశివరావు శుక్రవారం ఉదయం 7 గంటలకు వచ్చాడు. కొడుక్కి భోజనం పెట్టడానికి తల్లి చెంగాలమ్మ ఇంటికి వెళ్లి చూడగా సాంబశివరావు సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. ఆమె వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. ఆర్థిక బాధలు, భార్య పుట్టింటికి వెళ్లిందన్న బాధతో తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి పై కత్తితో హత్యాయత్నం

పెనమలూరు: ఇద్దరు మిత్రులు మధ్య వివాదం తలెత్తడంతో హత్యాహత్నం ఘటన జరిగింది. సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప వసంతనగర్‌కు చెందిన కనుమూరి విజయ్ పనీపాటలేకుండా ఇంటి వద్ద ఉంటూ రోజూ మద్యం తాగుతాడు. అయితే గురువారం అదే ప్రాంతానికి చెందిన అతని మిత్రుడు మజీద్‌తో కలిసి రాత్రి పొద్దుపోయే వరకు కామయ్యతోపు వద్ద ఉన్న బార్‌లో మద్యం తాగారు. బార్ నుంచి బయటకు వచ్చిన తరువాత మజీద్ ఇంకా మద్యం ఇప్పించమని విజయ్‌ను కోరాడు. దీనికి విజయ్ నిరాకరించటంతో కోపంతో మజీద్ కత్తితో దాడి చేశాడు. కత్తి గాయాలతో విజయ్ విజయవాడ ఆస్పత్రిలో చేరాడు. బాధితుడి సోదరుడు వినయ్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు శుక్రవారం హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

వీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

పటమట(విజయవాడతూర్పు): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతి పత్రం అందించారు. శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన పేషీ వద్ద కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, నగర కార్యదర్శి దోనేపూడి కాశీనాథ్, బోయి సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు ప్రారంభం



లబ్బీపేట(విజయవాడతూర్పు): సీతారామపురం చలమలవారి వీధిలో రూ.10 లక్షల వ్యయ అంచనాతో చేయనున్న భూగర్భ డ్రైనేజీ పనులను శుక్రవారం 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలపడంతో ఈ విషయాన్ని వీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించినట్లు అనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో చంటి, శంకర్, వెంకట్రామిరెడ్డి, కుక్కల రమేష్, డివిజన్ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టైటాన్ ఫాస్ట్రాక్ స్టోర్ ప్రారంభం



లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాత్మాగాంధీ రోడ్డులో ఏర్పాటు చేసిన టైటాన్ వరల్డ్ హీలియోస్, ఫాస్ట్రాక్ ట్రాంబో, ఐప్లస్ స్టోర్‌ను గురువారం ఆ సంస్థ రీజినల్ బిజినెస్ హెడ్ శరద్ ఆర్ ప్రారంభించారు. కార్యక్రమంలో రీజినల్ బిజినెస్ మేనేజర్ రేవతి రంగన్, టైటాన్ కంపెనీ బిజినెస్ అసోసియేట్ రత్నప్రభ తదితరులు పాల్గొన్నారు. ఈ స్టోర్‌లో విభిన్న స్టైల్, పర్సనాలిటీలకు సరిపోయే వాచీలను అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. వెయ్యికిపైగా డిజైన్‌లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

99 బస్సు సర్వీసుకు స్పందన

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సిటీ టెర్మినల్ నుంచి కంకిపాడు వరకు ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన రూట్ నంబర్ 99 కి ప్రయాణికుల నుంచి మంచి స్పందన వస్తోందని విజయవాడ జోన్–2 చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జాన్ సుధాకర్ గురువారం విలేకరులకు తెలిపారు. ఈ రూటులో ప్రతి అరగంటకు ఒక బస్సును నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు కోరితే మరిన్ని రూట్‌లలో బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

21 నుంచి నూకాలమ్మ జాతర

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సొరంగం రోడ్డులోని నూకాలమ్మ ఆలయంలో ఈ నెల 21 నుంచి జాతర మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 21వ తేదీ కలశస్థాపన అనంతరం నిత్య పూజలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 1వ తేదీ అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని, నదీ జలాలను తీసుకువచ్చి అభిషేకాలు చేస్తారని తెలిపారు. 2వ తేదీ ఆదివారం నూకాలమ్మ ఆలయం నుంచి ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయం వరకు సంబరం జరుగుతుందని వివరించారు.

రేపు సిమెంటు తొట్టెల పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేసవిలో మూగజీవాలకు మంచినీటిని అందించడానికి అవసరమైన నీటి తొట్టెలను ఈ నెల 19వ తేదీ ఆదివారం ఉచితంగా పంపిణీ చేయనున్నామని జీవకారుణ్యం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఉదయం 10 గంటలకు భవానీపురంలోని ఐరన్ కాంప్లెక్స్‌లో ఇస్తారని తెలిపారు.

ప్రతిభావంతుడు



బొమ్మలు గీస్తున్న గోపీమనోజ్



కలెక్టర్ ఢిల్లీరావుకు బొమ్మను గీసి అందజేస్తున్న విద్యార్థి గోపి

- బీఎస్ఆర్‌కే హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి గోపి మనోజ్
- డ్రాయింగ్, బీట్ బాక్సింగ్, పెన్సిల్ కార్వింగ్, స్టోరీ టెల్లింగ్‌లో ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): డ్రాయింగ్, బీట్ బాక్సింగ్, పెన్సిల్ కార్వింగ్, స్టోరీ టెల్లింగ్‌లో ప్రతిభ చూపుతున్నాడు నాగపూరి గోపీమనోజ్. ఇతను మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్‌లోని బోయపాటి శివరామకృష్ణ మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థి.

అతను పుట్టిన మొదటి ఏడాదిలోనే తల్లి అనారోగ్య కారణంగా మరణించింది. తండ్రి మద్యానికి బానిసై అతన్ని పట్టించుకోకపోవడంతో పెదనాన్న దగ్గర ఉండి చదువుకుంటున్నాడు. అతనికి సోదరి ఉంది. గోపి మనోజ్ ఎవ్వరి వద్ద శిక్షణ తీసుకోకుండానే డ్రాయింగ్, బీట్ బాక్సింగ్, పెన్సిల్ కార్వింగ్‌ల్లో ప్రతిభ చూపుతున్నాడు. ఆయా రంగాల్లోని నిష్ణాతులు ఎవరైనా తనకు శిక్షణ ఇస్తే మరింత ప్రతిభ చూపుతానని చెబుతున్నాడు. చదువులోనూ సత్తా చాటుతున్నాడు.



పెన్సిల్ లెడ్‌పై అక్షరాలు

అవలీలగా మహానీయులు చిత్రాలు

మహాత్మాగాంధీ, నేతాజీ, సీవీ రామన్, సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇలా మహనీయుల జయంతులు, వర్ధంతుల సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించే కార్యక్రమాల్లో వారి చిత్రాలను గోపి మనోజ్ గీస్తాడు.

మురిసిన ఢిల్లీరావు

బీఎస్ఆర్‌కే హైస్కూల్‌లో గత నెల 17న స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపి మనోజ్ కలెక్టర్ ఢిల్లీరావు బొమ్మను గీసి ఫ్రేమ్ కట్టించి అందజేశారు. తన బొమ్మను చూసిన కలెక్టర్ మురిసిపోయి గోపిమనోజ్‌ను అభినందించారు.

చదువులోనూ ముందంజ

గోపి మనోజ్ మొదటి తరగతి నుంచి మా పాఠశాలలోనే చదువుతున్నాడు. అప్పటి నుంచి చదువులో ప్రతిభ చూపేవాడు. క్రమంగా డ్రాయింగ్ వేస్తూ ఉండేవాడు. ఏదైనా పాఠశాల స్థాయిలో జరిగే డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్ పోటీలకు గోపి మనోజ్‌ను పంపితే బహుమతితో రావాల్సిందే.

–కె.నాగరాజు, బీఎస్ఆర్‌కే హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు

డ్రాయింగ్ అంటే చిన్నతనం నుంచి ఇష్టం

నాకు చిన్నతనం నుంచే డ్రాయింగ్ అంటే ఇష్టం. అప్పటి నుంచే చిన్నపాటి బొమ్మలను గీసేవాడిని. నాకు గురువు ఎవ్వరూ లేరు. ఒక్కడినే ప్రాక్టీస్ చేస్తున్నాను. స్టోరీ టెల్లింగ్‌తో పాటుగా గొంతు ద్వారా ఐదు రకాల వాయిద్యాల సౌండ్‌లను(బీట్ బాక్సింగ్) చేయగలను. పెన్సిల్ లోపల ఉండే ములుకు(లెడ్)పై ఇంగ్లిష్ అక్షరాలు చెక్కడం (పెన్సిల్ కార్వింగ్) కూడా ప్రాక్టీస్ చేస్తున్నాను. చదువుతో పాటుగా ఈ అంశాలపై దృష్టి పెడుతున్నాను. డ్రాయింగ్, పెన్సిల్ కార్వింగ్‌లో శిక్షణ ఇస్తే ఆయా రంగాల్లో మరింతగా పట్టు దొరుకుతుంది.

–నాగపూరి గోపిమనోజ్, బీఎస్ఆర్‌కే హైస్కూల్, మొగల్రాజపురం

నవరత్నాలతో పేదల జీవితాల్లో మార్పు

రామలింగేశ్వరనగర్‌లో హర్షం వ్యక్తం చేసిన మహిళలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): 'నాకు ఇద్దరు ఆడపిల్లలు.. పెద్దమ్మాయి వివాహం చేశాను.. చిన్న అమ్మాయిని ఇంజినీరింగ్ చదివిస్తున్నాను. గతంలో ఫీజు కట్టాలంటే ఇబ్బందిగా ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికి మూడు సార్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చింది' అని రామలింగేశ్వరనగర్‌కు చెందిన విద్యార్థి కావ్య తల్లి సాయిలక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు. డివిజన్‌లోని మహిళలు సాన సుబ్బలక్ష్మి, టి సత్యవతి ప్రభుత్వం ఇస్తున్న పింఛన్‌తో ఒకరిని డబ్బులు అడగకుండా నెల ఖర్చులకు సరిపోతున్నాయన్నారు. జగనన్న చేయూత రెండు సార్లుగా రూ.36 వేలు ఇచ్చారని ... కొంత వరకు అప్పులు తీర్చుకున్నామని, నవరత్నాలు పేదల జీవితాలను మారుస్తున్నాయని లక్ష్మి చెప్పారు. రామలింగేశ్వరనగర్ 69, 70 సచివాలయాల పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆ ప్రాంతంలో గడప గడపకూ వెళ్లారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని మహిళలు అవినాష్‌తో చెప్పారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబుకు పట్టం కడితే అప్పుల ఆంధ్రగా మార్చివేశారని దేవినేని అవినాష్ దుయ్యబట్టారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పరిపాలన అందిస్తూ... అర్హులైన అక్కా, చెల్లెమ్మలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల చెల్లారావు, కామేష్, సూర్యనారాయణ, ఈశ్వరరావు, శ్రీను, బాబి, రామచంద్రారావు, కొండా రెడ్డి పాల్గొన్నారు.



రామలింగేశ్వరనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న అవినాష్, దుర్గ తదితరులు

సంపూర్ణ ఆరోగ్యానికి నిద్ర దివ్య ఔషధం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఆరోగ్యవంతమైన జీవన విధానంలో నిద్ర కీలక పాత్ర పోషిస్తోందని సైకాలజిస్ట్ డాక్టర్ పీవీ రాధిక చెప్పారు. ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిద్ధార్థ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో సంపూర్ణ ఆరోగ్యం–నిద్ర అనే అంశంపై సదస్సు జరిగింది. రాధిక మాట్లాడుతూ ప్రస్తుతం నిద్రలేమితో యువత అనేక మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రపంచంలో 50 శాతం మంది సంపూర్ణ నిద్రకు దూరంగా ఉంటున్నారన్నారు. నిద్ర లేమి కారణంగా శ్వాస సంబంధిత సమస్యలతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారని వివరించారు. మనిషి కనీసం రోజులో 6 నుంచి 8 గంటలు నిద్ర పోతేనే ఆరోగ్యంగా ఉంటారని, సరైన జీవనశైలితో ఇది సాధ్యమవుతోందని తెలిపారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ యువత ఎక్కువ సమయాన్ని సోషల్ మీడియాలో గడుపుతున్నారని, మొబైల్ వినియోగం కూడా అవసరానికి మించి ఉపయోగిస్తూ సమయాన్ని వృథా చేస్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం డాక్టర్ రాధికను కళాశాల ప్రతినిధులు సత్కరించారు.



రాధికను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

రాష్ట్ర స్థాయికి సోలార్ స్నేక్ గార్డ్ ప్రాజెక్ట్ ఎంపిక

చిలుకూరు(ఇబ్రహీంపట్నం): కొత్తచిలుకూరు ఎంపీయూపీ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని షేక్ నాగమాలిక రూపొందించిన సోలార్ స్నేక్‌గార్డ్ ప్రాజెక్ట్ జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మానక్ ఎగ్జిబిషన్ పోటీలకు ఎంపికైంది. ఇళ్లు, పొలాలు, వద్ద పెద్దలు, చిన్నారులను పాములు కాటు వేయకుండా రక్షణ పొందే విధంగా ఈ ప్రాజెక్ట్ రూపొందించింది. ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికై నందుకు ఎంఈవో పుష్పలత, గైడ్ ఉపాధ్యాయురాలు టి.శ్రీదేవి, జిల్లా సైన్స్ అకడమిక్ కోఆర్డినేటర్ ఎస్‌వీఎన్ విజయలక్ష్మి, హెచ్‌ఎం రమేష్‌బాబు తదితరులు బాలికను అభినందించారు.



టెన్త్ మోడల్ టెస్ట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

ఇబ్రహీంపట్నం: ఇటీవల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టెన్త్‌క్లాస్ ప్రజ్ఞా వికాస మోడల్ టెస్ట్‌లో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. స్థానిక కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాల, క్రాంతి కాన్వెంట్ బాలబాలికలకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు వీటిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలిరెడ్డి, కరస్పాండెంట్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మత్తు పదార్థాల నిర్మూలన, వాటి వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. మత్తు పదార్థాల వినియోగంతో మానసిక, ఆరోగ్య, ఆర్థిక పరంగా ఇబ్బందులకు గురవుతారని సంస్థ ఏరియా కోఆర్డినేటర్ ప్రియాంక తెలిపారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు కిడ్నీ, టీబీ, క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వ్యసనం నుంచి డీ–ఎడిక్షన్ చికిత్సతో బయటపడొచ్చన్నారు. వివరాలకు 94904 92020లో సంప్రదించాలన్నారు.

ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్



బాలికల అక్రమ రవాణా, ట్రాఫికింగ్‌పై జరిగిన సదస్సులో మాట్లాడుతున్న చంద్రయ్య

మైలవరం: నేటి యువత ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారని హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర సమన్వయకర్త వై.చంద్రయ్య తెలిపారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సీడీపీఓ సంయుక్త ఆధ్వర్యంలో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ఎంబీఎం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం బాలికల అక్రమ రవాణా, లైంగిక దోపిడీపై అవగాహన కార్యక్రమం జరిగింది. చంద్రయ్య మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఇప్పటివరకు 26,500 మంది యువతులను, మహిళలను కాపాడి వారికి పునరావాసం ఏర్పాటు చేశామన్నారు. మైలవరం సీడీపీఓ పుష్పలత మాట్లాడుతూ ఏ అమ్మాయి కూడా అక్రమ రవాణాకు గురికాకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శోభ, శ్రీలత, తులసీ, గౌసియా బేగం, శ్రావ్య శృతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్

పటమట(విజయవాడతూర్పు): రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం సర్కిల్–1 పరిధిలోని 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పారిశుద్ధ్య సిబ్బంది ప్రధాన రహదారులు శుభ్రం చేసిన తర్వాత అంతర్గత రోడ్లను క్లీన్ చేయాలన్నారు. సైడ్ డ్రెయిన్లలో మురుగునీటి పారుదల విధానాన్ని పర్యవేక్షించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఇంటింటి చెత్త సేకరణ నిత్యం 100 శాతం నమోదు చేయాలని, డ్రైన్లలో వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలో వాటర్ పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చూడాలని చెప్పారు. ఈ పర్యటనలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య విధానాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎంవీఐపై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి

డీటీసీ పురేంద్ర

విజయవాడ స్పోర్ట్స్: కాకినాడలో మోటారు వాహన తనిఖీ అధికారి(ఎంవీఐ)పై కొబ్బరి బొండాల వ్యాపారి దాడి చేయడం బాధాకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీటీసీ ఎం.పురేంద్ర డిమాండ్ చేశారు. ఎంవీఐపై దాడిని ఖండిస్తూ డీటీసీ కార్యాయల ఉద్యోగులు శుక్రవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డీటీసీ మాట్లాడుతూ విధుల్లో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ చిన్నారావుపై కొబ్బరి బొండాల వ్యాపారి పెంటా వెంకటకుమార్ కత్తితో కిరాతంగా దాడి చేయడం అమానుషమన్నారు. రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజబాబు మాట్లాడుతూ తనిఖీ సమయంలో వాహన రికార్డులను యజమానులు చూపించాలని, అధికారులు తప్పుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలేగానీ భౌతిక దాడులు చేయడం సమంజసం కాదన్నారు. నిరసన కార్యక్రమంలో ఆర్టీవో ఆర్.జగదీశ్వరరాజు, అధికారులు ఎస్.శ్రీనివాస్, కె.ఎల్.బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డీటీసీ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అంబేడ్కర్ పార్కు పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): కృష్ణలంక హైవే వెంటఉన్న అంబేడ్కర్ పార్కులో జరుగుతున్న పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శుక్రవారం నగర పర్యటనలో భాగంగా ఆయన పార్కును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పార్కు పనులను అదనపు యంత్రాలు, వర్కర్లను ఏర్పాటు చేసి త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (కె.వి సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పార్కు పనులు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మసీదులకు గంజి రవ్వ అందజేత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని మసీదులకు వెలంపల్లి ఫౌండేషన్ ద్వారా గంజికి వినియోగించే రవ్వను శుక్రవారం అందించారు. బ్రాహ్మణవీధిలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కార్యాలయం వద్ద ఆయన కుమార్తె సాయి అశ్విత చేతుల మీదుగా పలు మసీదులకు గంజి తయారీకి వాడే రవ్వను విరాళంగా అందించారు. ఆమె మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ నెలలో పవిత్రంగా ఉపవాస దీక్షలు చేస్తారన్నారు. ఉపవాస విరమణ సమయంలో తాగే గంజి తయారీకి వాడే రవ్వను అందించాలని నిర్ణయించామన్నారు. ఒక్కో మసీదుకు వంద కిలోల చొప్పున అందించామన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదుల అభివృద్ధికి వెలంపల్లి అన్ని రకాల సహకారాలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ వెలంపల్లి రాఘవ నర్సింహరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ వాజీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మసీదు నిర్వాహకులకు రవ్వను అందిస్తున్న వెలంపల్లి సాయిఅశ్విత

నీరు నిల్వ లేకుండా చూడండి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలో 'ఫ్రైడే–డ్రైడే' కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముందుగా ఉత్తర కొరియా నుంచి నగరానికి విచ్చేసిన బీట్రిస్ ఎజిడ్ అనే పీహెచ్‌డీ రీసెర్చర్ నగరంలోని పారిశుద్ధ్య విధానం తీరు, దోమల వ్యాప్తి, నియంత్రించే పద్ధతులను తెలుసుకున్నారు. రీసెర్చ్ కన్సల్టెంట్ పావని పండ్యాల ఆమెకు వీటి గురించి అర్థమయ్యేలా వివరించారు. అనంతరం ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని, మనం నివసించే ప్రదేశాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలంటూ వాంబేకాలనీ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ దోమల వ్యాప్తిపై అవగాహన కల్పించుకొని, దోమల నియంత్రణకు కృషి చేయాలంటూ ర్యాలీ నిర్వహించారు. కార్పొరేషన్ బయాలజిస్ట్ సూర్యకుమార్‌నాయక్, మలేరియా ఇన్‌స్పెక్టర్ పి.రాజ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జయపాల్, మలేరియా సూపర్‌వైజర్ బి.బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య విభాగ పనితీరు, దోమల వ్యాప్తిని తెలుసుకుంటున్న రీసెర్చర్ బీట్రిస్ ఎజిడ్

కానూరులో మదర్సా వార్షికోత్సవం

పెనమలూరు:తాడిగడప పురపాలక సంఘం కానూరు పాతచెక్‌పోస్టు పాము వెంకయ్య వీధిలో ఉన్న మదర్సా అల్ జామియా దారుస్సుఫ్ఫా మొదటి వార్షికోత్సవం గురువారం రాత్రి నిర్వహించారు. మత గురువులు హజ్రత్‌మౌలానా అబ్దుల్ ఖాదిర్ సాహెబ్, అబ్దుల్ వహాబ్‌సాహెబ్ పాల్గొని మాట్లాడుతూ ఆధ్యాత్మిక విద్య ప్రాముఖ్యతను ఖురాన్ గ్రంథంలో బోధించిన అంశాలు వివరించారు. గురువు ఖారీ మొహమ్మద్ ఫహీమ్‌ఖాస్మి నాజమ్ దారుస్సుఫ్ఫాలో బాలలకు అందిస్తున్న విద్యను గురించి వివరించారు.



మబ్బు కుంచెలకెన్ని అందాలో..గగన కాన్వాసుపై చిత్తరువులైపోతూ.. కారుమబ్బులు కదలివచ్చి శుక్రవారం నగర గగనతలంలో కనువిందు చేస్తున్న ఈ చిత్రాన్ని 'సాక్షి' బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

• తెలంగాణ

గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌ రద్దు!

- దీంతోపాటు ఏఈఈ, డీఏఓ పరీక్షలు కూడా..
- ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్‌: ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్షను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (టీఎస్‌పీఎస్సీ) రద్దు చేసింది. దీనితోపాటు గత రెండు నెలల్లో నిర్వహించిన 'అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ (ఏఈఈ), డివిజనల్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ (డీఏఓ)' పరీక్షలనూ రద్దు చేస్తున్నట్టు కమిషన్‌ శుక్రవారం ప్రకటించింది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్‌) ప్రాథమిక నివేదికపై శుక్రవారం కమిషన్‌ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. చైర్మన్‌, సభ్యులు, కార్యదర్శి పాల్గొన్న ఈ భేటీలో గ్రూప్‌-1 పరీక్షతో పాటు ఏఈఈ, డీఏఓ పరీక్షలపై చర్చించి.. వాటిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే మార్చి ఐదున నిర్వహించిన అసిస్టెంట్‌ ఇంజనీర్‌ (ఏఈ) పరీక్షను రద్దు చేయడం తెలిసిందే. కాగా, గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్షను జూన్‌ 11వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. మిగతా పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో వెల్లడిస్తామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి తెలిపారు.

చంద్రయాన్‌-3 'సామర్థ్య' పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చంద్రుడిపై పరిశోధనల కోసం ఈ ఏడాది జూన్‌ నెలాఖరులోపు చంద్రయాన్‌-3 ప్రయోగం నిర్వహించడానికి పకడ్బందీగా సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా బెంగళూరులోని యూఆర్‌ శాటిలైట్‌ సెంటర్‌లో మూడు మాడ్యూల్స్‌తో కూడిన చంద్రయాన్‌-3 ఉపగ్రహాన్ని తయారుచేసి అక్కడే దాని శక్తి సామర్థ్యాలను ఇటీవల పరీక్షించామని ఇస్రో గురువారం రాత్రి తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఆర్బిటర్‌ మాడ్యూల్‌, ల్యాండర్‌ మాడ్యూల్‌, రోవర్‌ మాడ్యూల్‌ మూడు విభాగాలుగా చంద్రయాన్‌-3 ఉపగ్రహాన్ని రూపొందించారు. చంద్రుడిపై ఉన్న వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించి ఆ ఉపగ్రహాన్ని పరీక్షించారు. ప్రయోగ సమయంలో ఎదురయ్యే కఠినమైన కంపనం, ధ్వని వాతావరణాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని ధ్రువీకరించుకునేందుకు అవసరమైన పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని ఇస్రో వెల్లడించింది.



బెంగళూరులోని యూఆర్‌ రావు శాటిలైట్‌ సెంటర్‌లో చంద్రయాన్‌-3 ఉపగ్రహాన్ని పరీక్షిస్తున్న దృశ్యం

భారత్‌-ఫ్రాన్స్‌ అంతరిక్ష సంబంధాలు బలోపేతం

భారత్‌-ఫ్రాన్స్‌ దేశాల అంతరిక్ష సంబంధాలు మరింత బలోపేతం చేసేందుకు ఫ్రెంచి ప్రభుత్వం నిరంతరం పనిచేయడానికి అంగీకారం తెలిపిందని ఇస్రో తన వెబ్‌సైట్‌లో శుక్రవారం పేర్కొంది. ఫ్రాన్స్‌ విదేశాంగ మంత్రిత్వశాఖ సమన్వయంతో ఆ దేశ నేషనల్‌ అసెంబ్లీ విదేశీ వ్యవహారాల పార్లమెంట్‌ స్టాండింగ్‌ కమిటీ అధ్యక్షుడు జీన్‌-లూయిస్‌ బౌర్లాంగెస్‌ నేతృత్వంలో ఫ్రెంచి ప్రతినిధి బృందం గురువారం బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. ఇస్రోలోని హ్యూమన్‌ స్పేస్‌ ఫ్లైట్‌ సెంటర్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఆర్‌.ఉమా మహేశ్వరన్‌ ఆధ్వర్యంలో ఇస్రో, డాస్‌ ప్రతినిధి బృందం ఫ్రెంచి ప్రతినిధుల బృందానికి భారత అంతరిక్ష కార్యక్రమాల గురించి వివరించింది.

ఏపీ ఇన్‌ పార్లమెంట్‌

ఏపీలో తగిన యూరియా నిల్వలున్నాయి

లోక్‌సభలో కేంద్రం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో 2022-23 రబీ సీజన్‌కు తగిన యూరియా నిల్వలు ఉన్నాయని కేంద్ర ఎరువులు రసాయనాలు శాఖ సహాయ మంత్రి భగవంత్‌ ఖుబా తెలిపారు. 2022-23 రబీ సీజన్‌కు గానూ 12-3-23 నాటికి 7.82 లక్షల మెట్రిక్‌ టన్నులు అవసరం ఉండగా 11.69 లక్షల మెట్రిక్‌ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు వైఎస్సార్‌సీపీ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2022-23కు గానూ 12-3-23 నాటి లెక్కల ప్రకారం 15.82 లక్షల మెట్రిక్‌ టన్నులు అవసరం కాగా.. 17.76 లక్షల మెట్రిక్‌ టన్నులు అందుబాటులో ఉన్నట్లు కేంద్ర సహాయ మంత్రి వెల్లడించారు.

మంగళగిరి ఎయిమ్స్‌లో 960 పడకలు

ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన పథకంలో భాగంగా మంగళగిరి ఎయిమ్స్‌ సహా 22 ఎయిమ్స్‌ల్లో 18,250 పడకలు మంజూరు చేశామని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్‌ తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్‌కు 960 బెడ్‌లు మంజూరు చేశామని వైఎస్సార్‌సీపీ సభ్యుడు వైఎస్‌ అవినాష్‌రెడ్డి ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో మానవ అక్రమ రవాణా కేసుల తగ్గుదల

ఆంధ్రప్రదేశ్‌లో మానవ అక్రమ రవాణా కేసులు తగ్గుముఖం పడుతున్నాయని కేంద్ర మహిళ శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. 2019లో 245 కేసులు నమోదు కాగా 2020లో 171, 2021లో 168 కేసులు నమోదైనట్లు వైఎస్సార్‌సీపీ సభ్యురాలు చింతా అనూరాధ ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌ఆర్‌బీ మెరుగుదల

ఆంధ్రప్రదేశ్‌లో సెక్స్‌ రేషియో ఎట్‌ బర్త్‌ (ఎస్‌ఆర్‌బీ) మెరుగుదలలో ఉందని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 2014-15లో ఎస్‌ఆర్‌బీ 921 ఉండగా 2021-22 నాటికి 950కి చేరుకుందని వైఎస్సార్‌సీపీ సభ్యులు మార్గాని భరత్‌రామ్‌, సంజీవ్‌కుమార్‌ల ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

సీఆర్‌ఐవైఎన్‌ ఏర్పాటు ప్రతిపాదన లేదు

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో సెంట్రల్‌ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ యోగా, న్యాచురోపతి (సీఆర్‌ఐవైఎన్‌) ఏర్పాటు ప్రతిపాదన ఏదీలేదని కేంద్ర ఆయుష్‌ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్‌ ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో 12 సఖి నివాస్‌లు

ఆంధ్రప్రదేశ్‌లో వర్కింగ్‌ ఉమెన్‌ నిమిత్తం 12 సఖి నివాస్‌లు పనిచేస్తున్నాయని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. 2019-20లో 1.46 కోట్లు విడుదల చేశామని వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఎన్‌. రెడ్డెప్ప ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

డీఎంఎఫ్‌ ఏర్పాటు ప్రతిపాదన ఉంది

రక్షణ బలగాల ఆధునికీకరణ నిమిత్తం డిఫెన్స్‌ మోడరనైజేషన్‌ ఫండ్‌ (డీఎంఎఫ్‌) ఏర్పాటు ప్రతిపాదన ఉందని రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌ భట్‌ తెలిపారు. ఆర్థిక మంత్రిత్వశాఖతో సంప్రదింపులు చేసి ఫండ్‌ అమలుచేయడానికి తగిన యంత్రాంగం రూపొందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సభ్యుడు బాలశౌరి ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

రైల్వే అండర్‌బ్రిడ్జిలు నిర్మించండి
కేంద్రమంత్రి వైష్ణవ్‌కు ఎంపీ సత్యవతి విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ : అనకాపల్లి నియోజకవర్గంలోని మూలపేట నుంచి సత్యనారాయణపురం, లంకెలపాలెం సమీప రైల్వే లెవెల్‌ క్రాసింగ్‌ల వద్ద రైల్వే అండర్‌ బ్రిడ్జిలు నిర్మించాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో శుక్రవారం భేటీ అయిన ఎంపీ సత్యవతి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయా అండర్‌ బ్రిడ్జిల నిర్మాణం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటోందని ప్రజల ఇబ్బందులు గమనించి త్వరగా పూర్తిచేయాలని కోరారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌ పనులు వేగవంతం చేయాలని కూడా కేంద్రమంత్రికి ఎంపీ సత్యవతి విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్‌ స్మృతివనం పనుల వేగం పెంచండి



అంబేడ్కర్‌ స్మృతివనం నిర్మాణ పనులను సమీక్షిస్తున్న మంత్రులు ఆదిమూలపు, బొత్స, మేరుగు, కొట్టు

సాక్షి, అమరావతి: సమన్వయంతో పని చేసి అంబేడ్కర్‌ స్మృతివనం పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను మంత్రుల కమిటీ ఆదేశించింది. శుక్రవారం సచివాలయంలో అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్‌, మంత్రి మేరుగు నాగార్జున, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్‌ సమీక్ష నిర్వహించారు. పురపాలక శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శ్రీలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి జయలక్ష్మి స్మృతివనం పనుల పురోగతిని మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. పనుల్లో ఎక్కడా లోపాలు జరగకుండా.. సీఎం జగన్‌ సూచనల ప్రకారం స్మృతివనాన్ని తీర్చిదిద్దాలని ఆదేశించారు. 125 అడుగుల అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఢిల్లీలో ఇప్పటికే సిద్ధమైన విగ్రహం విడిభాగాలను రాష్ట్రానికి త్వరగా తెప్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్మృతివనంలో అంబేడ్కర్‌ జీవిత విశేషాలను తెలియజేసే శిల్పాలు, గ్రంథాలయంతో పాటు సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను వేగంగా ఏర్పాటు చేయాలన్నారు. మ్యూజికల్‌ వాటర్‌ ఫౌంటెన్లు ఏర్పాటు చేయాలని, చుట్టూ ఉండే ఫుట్‌పాత్‌ను కూడా సీఎం సూచించిన విధంగా అందంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అధికారులు కె.హర్షవర్ధన్‌, అదితి సింగ్‌, నరసింహారావు, కేపీసీ ప్రాజెక్ట్స్‌ డైరెక్టర్‌ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బహుజనుల సంక్షేమానికి పెద్దపీట

901వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: బడ్జెట్‌లో బహుజనుల సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డికి తాము ఎప్పటికీ రుణపడి ఉంటామని, కులవాదంతో అధికారం కోసం వెంపర్లాడుతున్న బాబు అండ్‌ కో ఆటలు సాగవని గుర్తుంచుకుని మసలుకోవాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌ యాక్సిస్‌ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 901వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. బహుజనులకు ఆర్థికంగా అండగా నిలుస్తూ సంక్షేమం, అభివృద్ధిని చేరువ చేస్తున్న ప్రభుత్వ చర్యలను చూసి కులవాదులకు అక్కసు పెరుగుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పేదలకు 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలు మంజూరు చేసి గూడు కల్పించిన జగనన్న చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. అమరావతి పేరుతో 29 గ్రామాల్లో కులవాదులు చేస్తున్న పెట్టుబడి ఉద్యమం పూర్తిగా ముగిసిందని తెలిపారు. యువగళం పేరుతో అజ్ఞాని లోకేశ్‌ను చంద్రబాబు ప్రజల్లోకి పంపాడన్నారు. బాబు ఇకనైనా తప్పుడు యత్నాలు మానుకోకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఇందుపల్లి సుభాషిణి, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్‌ కార్యదర్శి శ్రీకాంత్‌ రాజీనామా

- వైఎస్సార్‌సీపీలో చేరిక
- బడ్జెట్‌లో కాపు సంక్షేమానికి రూ.4,887 కోట్ల కేటాయింపు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సాక్షి, అమరావతి : కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్‌ కార్యదర్శి పెన్నేరు శ్రీకాంత్‌ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను కాపు సంక్షేమ సేన రాష్ట్ర అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్యకు పంపినట్టు శ్రీకాంత్‌ ప్రకటించారు. ఏపీ కాపు సంక్షేమ అభివృద్ధి సంస్థ(కార్పొరేషన్‌) చైర్మన్‌ అడపా శేషగిరి సమక్షంలో వంద మంది అనుచరులతో శ్రీకాంత్‌ వైఎస్సార్‌సీపీలో చేరారు. కాపుల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలన్న ఉద్దేశంతో తాను వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు చెప్పారు. కాపు సంక్షేమానికి 2023-24 బడ్జెట్‌లో రూ.4,887 కోట్లు కేటాయించి కాపుల మేలుకు చర్యలు చేపడుతున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు చెబుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏపీ కాపు కార్పొరేషన్‌ ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అడపా శేషగిరి మాట్లాడారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాపు కార్పొరేషన్‌ చైర్మన్‌ అడపా శేషు

జిల్లా వార్తలు

పంట నష్టాన్ని అధిగమించండిలా..



ఎన్టీఆర్‌ జిల్లా పెనుగంచిప్రోలులో వర్షానికి మిర్చి కల్లాలపై కప్పిన పట్టాలు

కంకిపాడు: అకాల వర్షంతో పంట నష్టపోకుండా తగు చర్యలు చేపడితే నష్టాలను అధిగమించొచ్చని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు. మిరప, మామిడి పంట సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను ఉద్యానశాఖ కృష్ణాజిల్లా ఏడీ దయాకర్‌ తెలిపారు.

మిరప పంటలో ఈ జాగ్రత్తలు అవసరం...

- ప్రస్తుతం మిరప పంట కోత (రెండు, మూడు కోతలు) కల్లాల్లో పంట ఎండుతున్న దశలో ఉంది.
- కల్లాల్లో ఉన్న కాయలను తడవకుండా టార్పాలిన్‌ పట్టాలతో కప్పి జాగ్రత్త చేసుకోవాలి.
- అధిక తేమ వల్ల పంట మీద ఉన్న కాయలకు కాయకుళ్లు వచ్చే అవకాశం ఉంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మాంకోజెబ్‌ (లీటరుకు 2.5 గ్రాములు) లేదా, క్లోరోథలోనిల్‌ (లీటరుకు 2 గ్రాములు) లేదా థయోఫినైట్‌ మిథైల్‌ (లీటరుకు 2 గ్రాములు) పిచికారీ చేసుకోవాలి.
- తెగులు ఉధృతి నివారించటానికి డైఫిన్‌కొనజోల్‌ 0.5 మిల్లీలీటర్లు లేదా ప్రొపికొనజోల్‌ 1 మిల్లీలీటరు పిచికారీ చేయాలి. తరువాత కాబ్రియో టాప్‌ లీటరుకు 3 గ్రాములు, లేదా ఆజాక్సీస్ట్రోబిన్‌ 1 మిల్లీలీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
- సూక్ష్మ పోషక మిశ్రమం ఎగ్రోమిన్‌మాక్స్‌ లీటరు నీటికి 2.5 గ్రాములు, మరియు స్థూల పోషక మిశ్రమం (13-0-45) లీటరు నీటికి 5 గ్రాములు చొప్పున పంటపై పిచికారీ చేయాలి.
- వర్షాలు ఆగిన తరువాత కోత కోసి ఎండబెట్టే సమయంలో కాయకుళ్లు ఆశించిన కాయలను వేరు చేసి విడిగా ఎండబెట్టుకోవాలి.


మామిడి రైతులకు సూచనలు...

- కురుస్తున్న అకాల వర్షాలకు, ఈదురు గాలులకు కాయలు రాలటం, కాయలపై మచ్చలు వచ్చే అవకాశం ఉంది. సెంటీ మీటరు కంటే అధిక వర్షం పడిన ప్రాంతాల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. మామిడి తోటలు పూత దశ నుంచి కాయలు కోతకు వచ్చే వివిధ దశల్లో ఉంది.
- కాయలు 100 గ్రాములు కంటే ఎక్కువగా ఉన్న తోటల్లో వర్షం కారణంగా పిందెలు గట్టిపడి మంచి సైజు వచ్చే అవకాశం ఉంది.
- కాయలు, పూత ఉన్న తోటల్లో కాయమచ్చ తెగులు, పూరెమ్మ మాడు తెగులు రావొచ్చు. సమస్య ఏర్పడిన తోటల్లో ఇమిడాక్లోప్రిడ్‌ 0.3 మిల్లీలీటర్లు మరియు కార్బండిజమ్‌ 1 గ్రాములు, లేదా కార్బండిజమ్‌ 50 శాతం 1 గ్రాము మరియు మ్యాంకోజెబ్‌ 2.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.
- చిన్న పిందెలు, పూత దశల్లో ఉన్న తోటల్లో లేత చిగుర్లు వస్తాయి.
- లేత చిగురులు ఆశించే రసం పీల్చే పురుగు వాటితో పాటుగా తేనెమంచు పురుగు, తామర పురుగులు ఆశించే అవకాశం ఉంది. అలాంటప్పుడు ఇమిడాక్లోప్రిడ్‌ 0.3 మిల్లీలీటర్లు, ఫిప్రొనిల్‌ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ఈదురు గాలులు వల్ల పెద్ద కాయలు రాలినట్లయితే వాటిని చెక్కు తీసి చిన్న ముక్కలు కింద చేసి ఎండబెట్టి మామిడి పొడి చేసుకోవచ్చు. వర్షాల వల్ల తోటలో పైపాటు చేసి కలుపు లేకుండా చూసుకోవాలి.

సృజన.. సందేశాల సమ్మిళితం



పెయింటింగ్‌ వేస్తున్న శ్రీను



ప్రస్తుతం ఉపాధినిస్తున్న వాల్‌ పెయింటింగ్‌

- చిత్రలేఖనంలో రాణిస్తున్న బంటుమిల్లి వాసి బొమ్మల శ్రీను
- వాల్‌ పెయింటింగ్‌ నుంచి మైక్రో ఆర్ట్‌ వరకు ఎన్నో చిత్రాలు

నందిగామ: మాటలతో చెప్పలేని ఎన్నో భావాలను ఒక చిత్రం చెప్పగలదు. ఎన్నో సందేశాలను ఇవ్వగలదు..అందుకే చిత్రలేఖనానికి అంతటి ప్రత్యేక స్థానం. బాల్యంలో ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో చిత్రకళలో నైపుణ్యం సాధించి, గడచిన 35 ఏళ్లుగా జీవం ఉట్టిపడే చిత్రాలను గీస్తూ మనసు దోచుకుంటున్నారు రాజులపాటి శ్రీనివాసరావు. పలు సందేశాత్మక చిత్రాలతో ప్రశంసలు అందుకున్నారు.

కృష్ణాజిల్లా బంటుమిల్లికి చెందిన రాజులపాటి శ్రీనివాసరావు ఇంటర్‌ వరకు చదువుకున్నాడు. బాల్యం నుంచి బొమ్మలు వేయడం అంటే ఆసక్తి. చిన్నతనంలో చెరువు మట్టితో బొమ్మలు చేసేవాడు. ఇతడిలోని ఆసక్తిని గమనించిన ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. దీంతో చిత్రలేఖనంతో పాటు మైక్రో ఆర్ట్‌, బాడీ పెయింటింగ్‌, కుండలు, రాళ్లు, బియ్యపు గింజలపై చిత్రాలు గీయడంలో శ్రీనివాసరావు నైపుణ్యం సాధించాడు. డిమాండ్‌ దృష్ట్యా ఇటీవల వాల్‌ పెయింటింగ్‌ కూడా ప్రారంభించాడు. వివిధ సందర్భాల్లో ఆయన గీసిన చిత్రాలు వివిధ స్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో 4 బంగారు, 30 వెండి పతకాలు, 69 అవార్డులు తెచ్చిపెట్టాయి.

పంచముఖి చిత్రంతో మరింత పేరు..

తన చిత్రాలతో బొమ్మల శ్రీనుగా పేరుగాంచిన శ్రీనివాసరావుకు పంచముఖి చిత్రం ఎంతో పేరు తెచ్చి పెట్టింది. దేశ విదేశాలలో కూడా ఈ చిత్రానికి ప్రస్తుతం మంచి ఆదరణ లభిస్తోంది. వాస్తు దోషానికి ఈ చిత్రాన్ని వినియోగిస్తున్నారని శ్రీను తెలిపాడు. గీసే ప్రతి చిత్రంలోను అనేక చిత్రాలు దాగి ఉంటాయి. ఏ పేరునైనా ఒక చిత్రంగా మలచ గలగడం ఇతని ప్రత్యేకత.

శ్రీనుకు పేరు తెచ్చిన పంచముఖి చిత్రం






గిన్నిస్‌ బుక్‌లో స్థానం సంపాదించాలి..

నేను గీసిన లక్షలాది చిత్రాలలో ఎక్కువ శాతం సందేశాత్మకమైనవే. ఒక చిత్రంలో పలు సందేశాత్మక చిత్రాలు కనపడేలా గీయగలను. ప్రస్తుతం వాల్‌ పెయింట్‌కు మంచి క్రేజ్‌ ఉన్నందున ఆ చిత్రాలే గీస్తున్నాను. జీవితంలో ఎప్పటికైనా ఈ కళ ద్వారా గిన్నిస్‌ బుక్‌లో స్థానం సంపాదించుకోవాలన్నది నా కోరిక.

\- రాజులపాటి శ్రీనివాసరావు, చిత్రకారుడు

సత్తా చాటిన తొండపి విద్యార్థిని

గేట్‌లో ఆలిండియా 64వ ర్యాంకు



స్వప్నమాధురి

సత్తెనపల్లి: పల్లెటూరి విద్యా కుసుమం ఆలిండియా గేట్‌ ఫలితాల్లో గుబాళించింది. అన్నదాత కుటుంబాన జన్మించిన చదువుల చందమామ ఉత్తమ ర్యాంకుతో మెరిసింది. ఆలిండియా గేట్‌ ఫలితాల్లో పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం తొండపి గ్రామానికి చెందిన చల్లా శ్రీనివాసరావు, అనురాధ దంపతుల కుమార్తె స్వప్నమాధురి 67.67 మార్కులతో ఆలిండియా 64వ ర్యాంకు కైవసం చేసుకుంది. చల్లా శ్రీనివాసరావు, అనురాధ దంపతులు మూడేళ్ల క్రితం సత్తెనపల్లి వచ్చి జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె అయిన స్వప్నమాధురి మొదటి నుంచి చదువుల్లో ముందంజలో ఉండేది. పదో తరగతి సత్తెనపల్లి శ్రీరాఘవేంద్ర బాలకుటీర్‌లో విద్యనభ్యసించి 98 శాతం మార్కులు సాధించింది. ఇంటర్మీడియెట్‌ ఎంపీసీలో 989 మార్కులతో రాష్ట్రంలోనే నాలుగో ర్యాంకు కైవసం చేసుకుంది. వీవీఐటీలో బీటెక్‌ ఈసీఈలో ఫస్ట్‌క్లాస్‌ విత్‌ డిస్టింక్షన్‌తో ప్రతిభ చాటింది. ప్రస్తుతం బెంగళూరులోని డీఆర్‌డీవోలో ఉద్యోగం చేస్తూ గేట్‌ పరీక్షలు రాసింది. శుక్రవారం విడుదల చేసిన గేట్‌ ఫలితాల్లో 64వ ర్యాంకు కొల్లగొట్టింది.

ప్రపంచ దేశాల చూపు మనవైపే

- షిబ్‌పూర్‌లోని ఐఐఈఎస్‌టీ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ పార్థసారథి చక్రబర్తి
- ఘనంగా ప్రారంభమైన విజ్ఞాన్‌ సృజనాంకుర 2కే23

చేబ్రోలు: ప్రపంచ దేశాల చూపు ప్రస్తుతం మన దేశం వైపే ఉందని షిబ్‌పూర్‌లోని ఐఐఈఎస్‌టీ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ పార్థసారథి చక్రబర్తి అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్‌ యూనివర్సిటీలో రెండు రోజుల జాతీయ స్థాయి ''సృజనాంకుర-2కే23'' కార్యక్రమం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రొఫెసర్‌ పార్థసారథి చక్రబర్తి మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. సరికొత్త ఇన్నోవేషన్స్‌ను సృష్టించే విద్యార్థులు వాటిపై పేటెంట్స్‌ను పొందడం వలన దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు నాలెడ్జ్‌ను ఒకరికొకరు పంచుకుంటేనే కొత్త కొత్త ఐడియాలు పుట్టుకు వచ్చే అవకాశం ఉందన్నారు.

ఏపీ ప్రభుత్వ ఐఅండ్‌పీ అడ్వైజర్‌ రాజీవ్‌ వైఎస్సార్‌ మాట్లాడుతూ విద్యార్థులు ఒక్క ఐడియాతో మీ జీవితాన్ని మార్చేసుకోవచ్చన్నారు. దేశంలో ఎన్నో సమస్యలున్నాయని... వాటిలో ఒక్క సమస్యకు సృజనాత్మకతతో కూడిన పరిష్కారం కనుగొన్నట్లయితే జీవితంలో స్థిరపడిపోవచ్చన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ప్రొఫెసర్‌ పార్థసారథి చక్రబర్తి, చిత్రంలో లావు రత్తయ్య



విజ్ఞాన్‌ సృజనాంకుర కార్యక్రమంలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

విజ్ఞాన్‌ విద్యాసంస్థల చైర్మన్‌ లావు రత్తయ్య మాట్లాడుతూ యువత వినూత్న ప్రయోగాలతో ప్రపంచస్థాయి శాస్త్రవేత్తలుగా మారాలని ఆకాంక్షించారు. జాతీయస్థాయి సృజనాంకుర-2కే23 కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి 20వేల మందికిపైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. సృజనాంకురలో మొత్తం 9 కేటగిరీల్లో ఆటోమేషన్‌, ఇన్ఫ్రా ఇంజినీరింగ్‌, ఫుడ్‌ ప్రాసెసింగ్‌, కెమికల్‌ టెక్నాలజీ, కంప్యూటర్‌ అప్లికేషన్స్‌, ఫార్మా అండ్‌ లైఫ్‌ సైన్సెస్‌, ఎలక్ట్రానిక్స్‌, మేనేజ్‌మెంట్‌ స్టడీస్‌, బేసిక్‌ సైన్స్‌ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. వీసీ పి.నాగభూషణ్‌, రిజిస్ట్రార్‌ ఎంఎస్‌ రఘునాథన్‌, ప్రిన్సిపాల్స్‌ పాల్గొన్నారు.

శనివారం జరిగే సృజనాంకుర 2కే23 ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వందేభారత్‌ ఎక్స్‌ప్రెస్‌ ఇన్నోవేటర్‌ సుధాన్షు మణి, న్యూఢిల్లీలోని బోట్‌ల్యాబ్‌ డైనమిక్స్‌ ఎండీ డాక్టర్‌ సరిత అహ్లావత్‌, నూకాన్‌ ఏరోస్పేస్‌ ఆపరేషన్స్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ అరవింద్‌ కే సింగ్‌ హాజరవుతున్నట్లు వీసీ నాగభూషణ్‌ తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శనివారం ॥ 18-3-2023
V

కుర్రాళ్లు వినరు.
బైక్ ఎక్కి తుర్రుమంటారు.
భర్తలకు నిర్లక్ష్యం.
హెల్మెట్ లేకుండానే బయలుదేరుతారు.
ఇంటి మగవారి అసురక్షిత ప్రయాణం
స్త్రీలకు ఎప్పుడూ ఆందోళనకరమే.
ప్రతి ఇంట్లోని స్త్రీలు
ఆ ఇంటి మగవారికి రాఘవేంద్ర కుమార్‌ను చూపాలి.
స్నేహితుణ్ణి ప్రమాదంలో కోల్పోయిన అతను
సొంత డబ్బుతో ఇప్పటికి 56,000 హెల్మెట్లు పంచాడు.
పురుషులైనా స్త్రీలైనా హెల్మెట్ లేకుండా బండెక్కారంటే
ఇంటి మీదకు ముప్పు తెచ్చినట్టే అంటాడు రాఘవేంద్ర.
అతను చెప్పేది వినండి.


రాఘవేంద్ర

● హెల్మెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా

మీ పిల్లలకు ఇతన్ని చూపండి

'ఒంటి మీద ఎక్కడా దెబ్బ లేదు. తల ఒక్క దానికే తగిలింది' అని అయినవారిని కోల్పోయి ఏడ్చేవారు ఎందరో ఉన్నారు. ఆ తలకు దెబ్బ తగలని రీతిలో జాగ్రత్త తీసుకుని ఉంటే వారంతా బతికేవారు. హెల్మెట్ వాడితే బతికేవారు.

చట్టాలు ఎన్ని చెప్పినా, నిబంధనలు విధించినా జీవితాన్ని సీరియస్‌గా తీసుకోని వారు ఎప్పుడూ ఉంటారు. వారు ఎక్కడో వేరే కుటుంబాలలో ఉంటారనుకోవద్దు. మన కుటుంబాల్లో కూడా ఉంటారు. కాలేజీకి వచ్చిన కొడుకు, ఉద్యోగానికి వెళ్లే భర్త, ట్రయినింగ్‌లో ఉన్న కూతురు.. వీరు కూడా 'అ.. ఏముందిలే' అనుకుని హెల్మెట్ వాడకుండా ఉండొచ్చు.

అలాంటి వారు తన కంట పడితే ఊరుకోడు రాఘవేంద్ర కుమార్ (36). ఇతణ్ణి అందరూ ఇప్పుడు 'హెల్మెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అంటారు. నోయిడాలో నివాసం ఉండే ఇతను ఉద్యోగం వదిలేశాడు. ఇతర పనులు మానేశాడు. కేవలం హెల్మెట్‌కు సంబంధించిన చైతన్యం కోసం పని చేస్తున్నాడు. అతడు రోజూ చేసే పని కారు వేసుకుని, అందులో కొన్ని హెల్మెట్లు పడేసుకుని నోయిడా ఆగ్రాల మధ్య ఉండే ఆరు లేన్ల యమునా ఎక్స్‌ప్రెస్‌కు చేరుకుంటాడు. ఆ దారి మీద బైక్ వేసుకుని హెల్మెట్ లేకుండా ఎవరైనా వెళుతుంటే వారిని వెంబడించి ఆపుతాడు. హెల్మెట్ వాడకపోతే ఉండే ప్రమాదం గురించి చెప్పి ఉచితంగా హెల్మెట్ ఇచ్చి పంపుతాడు.

'2014 నుంచి నుంచి నేను హెల్మెట్‌లు పంచుతున్నాను. ఇప్పటికి 56 వేల హెల్మెట్లు పంచాను. నేను పంచిన రోజునో ఆ తర్వాత ఐదారు రోజుల్లోనో ప్రమాదానికి గురై నేనిచ్చిన హెల్మెట్ వల్ల ప్రాణాలు కాపాడుకున్న వారు 30 మంది ఉన్నారు. వారంతా ఎంతో సంతోషంతో కృతజ్ఞతతో నాకు ఫోన్ చేసి తాము ప్రాణాలతో ఉండటానికి కారణం నేనేనని చెబుతారు. చాలామందికి భారీ యాక్సిడెంట్లు అయ్యి కాళ్లు చేతులు విరిగినా తల మాత్రం ఏమీ కాకపోవడంతో బతికిపోయారు' అంటాడు రాఘవేంద్ర కుమార్.

అయితే అతనికి కూడా హెల్మెట్ విలువ ప్రాణ స్నేహితుడు మరణించాకే తెలిసింది. బిహార్‌కు చెందిన రాఘవేంద్ర కుమార్ 2009లో నోయిడా వచ్చి లా కోర్సులో



చేరాడు. అదే బిహార్ నుంచి ఇంజినీరింగ్ చేయడానికి వచ్చి కృష్ణకుమార్ అతని రూమ్మేట్ అయ్యారు. ఇద్దరూ ప్రాణ స్నేహితులు అయ్యారు. కాని 2014లో కొత్తగా వేసిన యమున ఎక్స్‌ప్రెస్ వే మీద హెల్మెట్ లేకుండా వెళుతూ కృష్ణకుమార్ యాక్సిడెంట్‌కు లోనయ్యాడు. ఒంటి మీద ఒక్క దెబ్బ లేదు. తలకే తగిలింది. మరణించాడు. ' వాళ్లింట్లో వాళ్లకి నా స్నేహితుడు ఒక్కగానొక్క కొడుకు కావడంతో వాడి అమ్మా నాన్నల గుండెలు పగిలి పోయాయి. హెల్మెట్ ఉంటే బతికేవాడు కదా అన్న బాధ ఇప్పటికీ వదల్లేదు నన్ను' అంటాడు రాఘవేంద్ర.

అప్పటి నుంచి అతడు ఒక ఉద్యమంగా హెల్మెట్లు పంచుతున్నాడు. భార్య కొత్తల్లో సహకరించింది. కాని రాఘవేంద్ర కుమార్ దాదాపు తన ఆస్తులన్నీ అమ్మి ఇప్పటికి రెండు కోట్ల వరకు ఖర్చు చేసి హెల్మెట్లు పంచాడు. 'ఉన్నదంతా ఊడ్చేశాను. పర్వాలేదు. బిహార్‌లోని నా సొంత పల్లెకు వెళ్లిపోతాను' అని ఇటీవల అతను ప్రకటించాడు.

కాని అది పైమాటే. తనకు సరైన ప్రోత్సాహం లభిస్తే దేశంలో హెల్మెట్ల బ్యాంకులు తెరవాలని ఎవరైనా సరే అరువు తీసుకుని వెళ్లి వాడుకునేలా హెల్మెట్లు అందుబాటులో ఉంచాలని అతని కోరిక. '4 ఏళ్ల పైబడిన పిల్లలకు హెల్మెట్లు తప్పనిసరి చేయాలని నేను సుప్రీం కోర్టులో పిల్ వేశాను. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కూడా కలిశాను' అంటాడు రాఘవేంద్ర. 'ప్రాణం పోతే ఏం చేసినా తిరిగి రాదు' అంటాడు.

హెల్మెట్‌ను వాడటానికి ఇష్టపడని ప్రతి ఒక్కరికి రాఘవేంద్ర చెబుతున్న విషయం అర్థం కావాలి. ప్రాణం ఉంటే లోకం ఉంటుంది. ●

హ్యాపీ పేరెంటింగ్

వసపిట్ట పాఠాలు


కృష్ణమాధురి

తల్లిదండ్రులుగా పిల్లలను చూసుకోవాల్సిన విధానాన్ని, తల్లిగా తన అనుభవాన్ని కళ్లకు కడుతూ యూ ట్యూబర్‌గా రాణిస్తోంది హైదరాబాద్ కొండాపూర్‌లో ఉంటున్న చిలుకూరి కృష్ణ మాధురి, నాలుగు, ఏడాదిన్నర వయసున్న పిల్లలతో కలిసి, తన స్వీయ అనుభవాలను షేర్ చేస్తుంటుంది. మాధురి మూడేళ్లుగా చేస్తున్న ఈ ప్రయత్నాలు... పిల్లల పెంపకంలో తను తీసుకునే జాగ్రత్తలు ఎంతోమంది తల్లులకు పాఠాలు అవుతున్నాయి. ఈ విషయాల గురించి మాధురి మాట్లాడుతూ ...

''నేను పుట్టి పెరిగింది రాజమండ్రిలో. మావారిది గుంటూరు. మా వారి ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉండేవాళ్లం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఉన్న నేను పిల్లల పుట్టడంతో ఇంటి దగ్గరే ఉండిపోయాను. పిల్లలపై తపన, వారి ఆరోగ్య జాగ్రత్తలు, పెంపకం విషయాలన్నీ తల్లిగా నాకు ప్రతిరోజూ ఓ పాఠమే. వీటిని నలుగురితో పంచుకుంటే కొంత మంది తల్లులకైనా ఉపయోగపడుతుంది కదా అని సరదాగా వీడియోలు తీసి, యూ ట్యూబ్‌లో పోస్ట్ చేసేదాన్ని.

వాయిస్ ఆఫ్ వసపిట్ట

పిల్లల అల్లరి మాటలకు పెద్దవాళ్లు ముద్దుగా పెట్టే పేరు వసపిట్ట. నలుగురిలో ప్రత్యేకంగా ఉండాలని చిన్నప్పటి నుంచి కాస్త ఎక్కువగా మాట్లాడేదాన్ని. అందుకే, అందరూ నన్ను వసపిట్ట అని పిలిచేవారు. దీంతో ఛానెల్‌కి ఇదే పేరు బాగుంటుందని ఎంచుకున్నాను. మూడేళ్లు అవుతోంది ఇది స్టార్ట్ చేసి. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చాక నా పోస్టులు మరిన్ని పెరిగాయి.

పెంపకాన్ని పరిచయం చేస్తూ..

అమ్మ తన పిల్లలను ఏ విధంగా పెంచుతుందనే విషయాల గురించి వెతికితే తెలుగులో ఎక్కువ బ్లాగర్స్ లేరు. ఉన్నా, వివరంగా చెప్పేవారు లేరు. పిల్లల పెంపకం అనగానే చాలా వరకు డాక్టర్లు, డైటీషియన్లు కనిపిస్తారు. వాళ్లు చెప్పేవి అందరూ ఆచరణలో పెడుతున్నారో లేదో తెలియదు. నేను డాక్టర్ దగ్గరకు పిల్లలను తీసుకెళ్లినప్పుడు, అక్కడ వారిచ్చిన మందులు, జాగ్రత్తల నుంచి అన్నీ నా ఛానెల్ ద్వారా పరిచయం చేస్తుంటాను.



రోజువారి పనులు

చిన్న పిల్లలున్న ఇల్లు ఎలా ఉంటుందో తల్లులందరికీ అనుభవమే. ఇల్లు పీకి పందిరేస్తారు అంటుంటారు. ఇలాంటప్పుడు చిన్నపిల్లలకు క్రమశిక్షణ ఎలా అలవాటు చేయాలి, దుమ్ము, కాలుష్యం నుంచి వారిని ఎలా కాపాడాలి, టీవీ చూడకుండా తినడం ఎలా అలవాటు చేయాలి, స్క్రీన్ టైమ్ ఎందుకు తగ్గించాలి.. ఇలాంటివి పిల్లలను ఇన్‌వాల్వ్ చేసి చెప్పడం వల్ల చాలా మంది కనెక్ట్ అయ్యారు. అంతేకాదు, వాళ్లంతట వాళ్లు పనులు చేసుకోవడం, వంటలో సాయం చేయడం.. వంటివి పిల్లలకు పెద్దవాళ్లు అలవాటు చేయాలి. వీటిని మా పిల్లలను చూపిస్తూ 'హ్యాపీ పేరెంటింగ్' అనేది తెలియజేయాలనుకున్నాను. అదే చేస్తున్నాను.

ఆనందకరమైన లక్ష్యం

మదర్ హుడ్, ఫాదర్ హుడ్ ఎంజాయ్ చేస్తూ పిల్లలు కూడా మంచి ఫీలింగ్‌తో పెరగాలనేది నా ఆలోచన. మేం సమస్యలను ఎలా అధిగమిస్తున్నామో కూడా చూపిస్తున్నాను. వీటిని చూడటానికి నాలుగు లక్షలకు పైగా వీక్షకులు న్నారు. వీరిలో పిల్లలున్నవారు 70 శాతం మంది ఉన్నారు. నా వీడియోలు చూసి తాము కూడా బ్లాగ్స్ చేస్తున్నామని కొందరు చెబుతుంటారు.

ఆరోగ్య జాగ్రత్తలు...

వీక్షకులలో చాలా మంది డాక్టరు చెప్పే జాగ్రత్తలు, కిడ్స్ ఫుడ్ గురించి సలహాలు సూచనలు అడుగుతుంటారు. పిల్లలు సరిగా తినరు అనేది పెద్దలు ప్రతిసారి చెబుతుంటారు. కానీ, ఎందుకు తినరు, ఎలా తింటారు.. అనే వివరాలను మా పిల్లలను ఉదాహరణగా చూపిస్తూ వివరిస్తుంటాను. వివిధ సమయాలలో పిల్లల ప్రవర్తన, మనం వారితో మాట్లాడటం, ప్రాక్టికల్‌గా చేస్తూ చెబుతుంటాను. పిల్లలు కూడా ఈ విధానాన్ని బాగా ఇష్టపడుతున్నారు. మా పిల్లలకు ఓ సారి ర్యాషెష్ వచ్చాయి. వాటిని ప్రాక్టికల్‌గా చూపించి, డాక్టరు చెప్పిన సూచనలతో పాటు, నేను స్వయంగా ఎలాంటి కేర్ తీసుకుంటున్నానో చూపించాను. అలాగే.. డెంటల్ ట్రీట్‌మెంట్, గర్భిణిగా ఉన్నప్పుడు, తల్లిపాల ప్రాముఖ్యత.. ఆ సమయాల్లో నేనెలాంటి జాగ్రత్తలు తీసుకున్నాను.. మరికొన్ని ఇతరుల ద్వారా సేకరించిన సూచనలూ ఇస్తుంటాను. మా నాన్న రైల్వేలో ఉద్యోగి. చిన్నప్పటి నుంచి కుటుంబంలో ప్రతి విషయంలో నా అభిప్రాయాన్ని కూడా అడిగేవారు. అలా వారి నుంచే నాకు నా పిల్లల పెంపకాన్ని మరింతగా నలుగురికి తెలియజేయాలనే ఆలోచన పెరుగుతూ వచ్చింది'' అని తల్లిగా తన అనుభవ పాఠాలను ఆనందంగా వివరించారు మాధురి.

– నిర్మలారెడ్డి

బ్యూటిప్స్



● టేబుల్ స్పూన్ పెసలను రాత్రంతా నానబెట్టి ఉదయం మెత్తగా గ్రైండ్ చేసి అందులో అర టీ స్పూన్ నెయ్యి లేదా పాలు వేసి కలిపి ముఖానికి పట్టించి మర్దన చేసి పది నిమిషాల సేపు మిశ్రమాన్ని ముఖం మీద ఉంచాలి. ఈ ప్యాక్ పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడగాలి. ఇలా చేస్తే పొడిబారిన చర్మం ఆరోగ్యంగా, నునుపుగా మారుతుంది. ఆయిల్ స్కిన్ వాళ్లయితే పెసర పేస్ట్‌లో కొద్దిగా మజ్జిగ లేదా పన్నీరు కలుపుకోవాలి.





● ఎండకు కమిలిపోయిన చర్మం తిరిగి మామూలు కావాలంటే... పైన చెప్పుకున్న పెసల పేస్టులో చల్లటి పెరుగు లేదా కలబంద పేస్టు కలిపి ముఖానికి, చేతులకు, పాదాలకు పట్టించి ఐదు నిమిషాల సేపు మర్దన చేయాలి. ఆరిపోయిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేయాలి.

● హెయిర్ ఫాల్ తగ్గాలంటే... రాత్రంతా నానబెట్టిన పెసలను గ్రైండ్ చేసి అందులో కోడిగుడ్డు సొన, టేబుల్ స్పూన్ నిమ్మరసం, కప్పు పెరుగు కలిపి చిక్కటి పేస్టు చేయాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి 15నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. ఈ మూంగ్‌దాల్ ప్యాక్‌ను నూనె రాసిన జుట్టుకు పట్టించకూడదు. షాంపూతో తలస్నానం చేసి ఆరిన తర్వాత మాత్రమే వేయాలి.

● 'ఆడపిల్ల'కు స్వాగతం

మా ఇంటి మహాలక్ష్మి

ఆడపిల్లపుట్టిందని సంబరం చేశారు.
ఇంట్లోకి పూలతో రహదారి పరిచారు.
చిట్టి పాదాల పారాణి ముద్రలు వేశారు.
అమ్మాయి పుడితే ఇలా స్వాగతం పలకండి.

'ఆడదే ఆధారం... మన కథ ఆడనే ఆరంభం...' అంటూ పాడుకునే నేల మనది. ఆడపిల్ల పుట్టగానే గొంతులో వడ్ల గింజలు వేసిన నేల కూడా ఇది. తల్లి గర్భంలోనే శిశువును గుర్తించి పుట్టకముందే ప్రాణం తీస్తున్న పాపాలకూ కొదవ లేదు. ఇక ఆడపిల్లను కన్నతల్లికి ఎదురయ్యే కష్టాలను ఎంత చెప్పుకున్నా తక్కువే. ఆడపిల్ల పుట్టింది... అనగానే కోడలిపై చిర్రుబుర్రులాడే అత్తలు, భార్య–బిడ్డల ముఖం చూడని మగవాళ్లు ఉన్న సమాజం మనది. ఇన్ని దారుణాల మధ్య ఓ సంతోషవీచిక వెల్లివిరిసింది. పుట్టింది ఆడపిల్ల అని తెలియనే పండుగ చేసుకున్నారు. ఊరూ వాడా అందరినీ పిలిచి వేడుక చేసుకున్నారు. అమ్మమ్మగారింట్లో రెండు నెలలు పూర్తి చేసుకున్న బిడ్డ మూడవ నెల నానమ్మ దగ్గరకు ప్రయాణమైంది. ఆ బిడ్డనెత్తుకుని అత్తగారింటికి వచ్చిన తల్లికి పూలబాట పరిచారు అత్తింటివాళ్లు. పాపకు ఘన స్వాగతం పలికారు. ఆడబిడ్డ పుట్టడం అంటే ఇంట్లోకి లక్ష్మీదేవి రావడమేనన్నారు. ఆదర్శంగా నిలిచిన కుటుంబం తెలంగాణ, మహబూబాబాద్ జిల్లాలో ఉంది. కేసముద్రం మండలం, తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన పొడగంటి శ్రీనివాసాచారి, భద్రకాళి దంపతుల ఆదర్శవంతమైన ఆత్మీయత ఇది.


నట్టింట పాదముద్రలు వేయిస్తూ...

పాపాయిని ఎత్తుకున్న నానమ్మ



పాపాయి కోసం పూజలు

కోడలు గర్భిణి అని తెలియగానే మగ పిల్లవాడు పుట్టాలని అనుకుంటారు. కానీ భద్రకాళి కుటుంబీకులు మాత్రం ఆడపిల్ల కావాలని పూజలు చేశారు. వాళ్ల పెద్దకొడుకు సాయి కిరణ్‌కు సిరిసిల్ల పట్టణానికి చెందిన సంహితతో రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. సంహిత నెలతప్పినప్పటి నుంచి భద్రకాళితోపాటు ఆమె తోడికోడలు సుమ, మరదలు రమ్య కూడా ఆడపిల్లలు పుట్టాలని వ్రతాలు, పూజలు చేశారు. వాళ్లందరికీ మగపిల్లలే. ఈ తరంలోనైనా ఇంట్లో ఆడపిల్ల కావాలని వాళ్ల కోరిక. ప్రసవం రోజు వరంగల్‌లో ఆసుపత్రికి ఇంటిల్లిపాది తరలి వెళ్లారు. ఆడపిల్ల పుట్టిందని తెలియగానే సంతోషంగా కేకలు వేస్తూ, హాస్పిటల్‌లో అందరికీ స్వీట్లు పంచిపెట్టారు.

అపూర్వ స్వాగతం

కోడలు పుట్టింటికి వచ్చిన రోజు ఇంటిని పూలతో అలంకరించారు. ముత్తయిదువలతో స్వాగతం పలికారు. చిన్నపాప కాళ్లకు పారాణి రాసి తొలి అడుగుల గుర్తులు నట్టింట్లో ముద్రించుకున్నారు. ఆ అడుగులను కళ్లకు అద్దుకున్నారు. ఆ జ్ఞాపకం కలకాలం నిలిచి ఉండడానికి ఫొటోలు తీశారు.

– ఊరగాని భిక్షం, సాక్షి, మహబూబాబాద్

నా కోరిక తీరింది

నాకు చిన్నప్పటి నుండి ఆడపిల్లలంటే ఇష్టం. మా వారు కూడా ఆడపిల్ల ఉన్న ఇంటి అందమే వేరు అంటూ ఉంటారు. అందుకోసమే మా ఇంటి చుట్టుపక్కల ఉన్న ఆడ పిల్లలను ప్రతి పండుగకు పిలుస్తాం. వారు చేసే సందడి చూసి సంబుర పడుతాం. మా ఇంట్లో ఆడపిల్ల ఉండాలనే కోరిక నెరవేరింది. అందుకోసమే అలా స్వాగతం పలికాం.

- భద్రకాళి, పాపాయి నానమ్మ


పాపాయితో అమ్మానాన్నలు సంహిత, సాయికిరణ్

● కేరెంటింగ్

లాలన... పాలన



ఈ రోజుల్లో పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా అందరూ కూడా ఒత్తిడితో జీవిస్తున్నారు ముఖ్యంగా పెద్దలు డిప్రెషన్ లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్న నేపథ్యంలో చిన్న పిల్లలు కూడా తీవ్రస్థాయిలో ఈ ఒత్తిడికి గురవుతున్నారు కాబట్టి తల్లిదండ్రులు పిల్లలు పెంచే విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కోసం...

సాధారణంగా ప్రతి తల్లీ తండ్రీ చేసే పొరపాటు ఇతరులతో తతమ పిల్లల్ని పోల్చడం. అలా పోల్చని వాళ్లని వేళ్ళ మీద లెక్క పెట్టచ్చు. పక్కింటి చింటూ చూడు. ఎంత బుద్ధిగా ఉంటాడో. నువ్వే ఇంత అల్లరి చేస్తున్నావు అనో. ఫలానా వాళ్ల పాప చూడు. ఎంత బాగా చదువుతుందో. నువ్వసలు పుస్తకం ముట్టవు అనో... ఇలా మరొకరితో మీ పిల్లలకి పోలిక చెప్పడమంటే వాళ్ళని లెక్కలేకుండా చూడడమేనని. దానివల్ల వారు తమ ప్రవర్తనను మార్చుకోకపోగా. మరింత దూకుడుగా. అల్లరిగా ప్రవర్తిస్తారని చైల్డ్ సైకాలజిస్టులు చెబుతున్నారు. పోల్చి చెప్పడం వల్ల వారిలో అనవసరమైన ఈర్ష్య. అసూయలు పెరుగుతాయనీ, అందుకే పోలికల జోలికి పోకూడదని చెబుతారు.

పెద్దవాళ్ల దగ్గర ఉంచడం మేలు

పిల్లలను ఇంట్లో ఒంటరిగా ఉంచకుండా వారి అమ్మమ్మలు, తాతయ్యలతో కలిపి ఉంచడం మేలు. దీంతో వారు పెద్దల నుంచి ఎన్నో మంచి విషయాలు నేర్చుకుంటారు. ఇక పిల్లల భద్రత గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

మరేం చేయాలి?

మన బంగారాలని వాళ్లతో వీళ్లతో పోల్చి చెప్పడానికి బదులు మీకు వాళ్ళెంత ప్రత్యేకమో, వాళ్ళంటే ఎంత ఇష్టమో చెప్పండి. మీ పిల్లలు వాళ్ళల్లో వాళ్ళు కూడా ఎలాంటి పోలికలూ పెట్టుకోకుండా చూడటం కూడా ముఖ్యం.

సరదాగా గడపండి

మీకు సమయం దొరికినప్పుడు, పిల్లలతో సరదాగా గడపండి. ఆ సమయంలో మీరు ఉద్యోగాలు చేస్తూ ఎందుకు కష్టపడుతున్నారో పిల్లలకు వివరించండి. దీనివల్ల మీ పిల్లల భావోద్వేగాలు మీకు బాగా తెలుస్తాయి. తద్వారా పిల్లలు కూడా మీకు మద్దతు ఇవ్వడానికి తమ వంతు ప్రయత్నం చేస్తారు.
మీరు ఆఫీస్ నుండి తిరిగి వచ్చాక, మీ పిల్లలతో సాధ్యమైనంత ఎక్కువ సమయాన్ని కేటాయించండి. ఇక వారంతాల్లో పూర్తి సమయాన్ని వారికే కేటాయించండి. పిల్లలతో విభిన్న పనులు ప్లాన్ చేయండి. వారికి ఇష్టమైన పనులు, వంటలు చేసి పెట్టండి. పిక్నిక్‌కి, పార్క్‌కి, సినిమాలకు తీసుకెళ్లండి.

బ్రహ్మాస్త్రం వేయకండి

కొంతమంది తల్లిదండ్రులు పిల్లల విషయంలో అతి జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు ఇది మాత్రం అంత మంచి పద్ధతి కాదు. ఎందుకంటే పిల్లలు తప్పు చేయడం సహజం. అలా తప్పు చేశారన్న కోపంతో వారిని కఠినంగా దండించామనుకోండి, ఆ తప్పును కప్పి పుచ్చడం కోసం ఇంకా అనేక తప్పులు చేస్తారు. అందువల్ల వారు ఏదైనా తప్పు చేసినప్పుడు ఒకటికి రెండుసార్లు ఓపిగ్గా చెప్పి చూడండి. అలా చెప్పినప్పటికీ మారకపోతే అప్పుడు దగ్గర కూర్చోబెట్టుకుని స్వరం పెంచి మాట్లాడండి. అంతే కానీ చిన్న తప్పు చేసినా పిల్లలపై మీ ప్రతాపం చూపించడం వల్ల వారు తీవ్ర అభద్రతా భావానికి లోనవుతారు.

టైమ్ టేబుల్ సెట్ చేయండి...

పిల్లలు ఒక వయసుకు వచ్చిన తర్వాత ఇంట్లో ఒంటరిగా వదిలివెళుతున్నప్పుడు వారికి ఒక నిర్దిష్టమైన టైమ్ టేబుల్‌ను సెట్ చేయాలి. ఎప్పుడు చదవాలి? ఎప్పుడు తినాలి? ఎప్పుడు ఆడుకోవాలి? ఎప్పుడు పడుకోవాలి... తదితర విషయాలకు వారితో మాట్లాడి అన్నిటికీ టైం ఫిక్స్ చేయండి. పిల్లలు కచ్చితంగా ఈ టైం టేబుల్‌ను పాటించేలా చూడండి. ఇక వారి వస్తువులను వారే సర్దిపెట్టుకునేలా, వారి పనులు వారే చేసుకునేలా అలవాటు చేయండి. ఇక ఆఫీసుకు వెళ్లినా ఇంట్లోని పిల్లల పరిస్థితి గురించి అడగ డానికి అప్పుడప్పుడు ఫోన్ చేస్తూ ఉండండి.

ప్లే గ్రౌండ్‌కు పంపండి

పిల్లలకు కాసిని మార్కులు తక్కువ వచ్చాయని వారిని వత్తిడి చేయద్దు. ఎందుకంటే కేవలం మార్కుల కోసం చదివే చదువుల వల్ల పిల్లలు అధిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ర్యాంక్స్ కోసం ఐదో తరగతి నుంచే ప్లే గ్రౌండ్ కి దూరంగా టాబ్లెట్స్, కంప్యూటర్స్ ముందు కూర్చో పెట్టి కంప్యూటర్ కోడింగ్ సైతం నేర్పిస్తున్నారు. దీనివలన పిల్లల భవిష్యత్తు పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. పిల్లలు చిన్నప్పటినుంచి ప్లే గ్రౌండ్ లో ఆటలు ఆడుకునే విధంగా ప్రోత్సహించాలి. ప్లే గ్రౌండ్‌లో ఆడుకోకుండా ఇంట్లో కూర్చుని కంప్యూటర్ గేమ్స్ ఆడుకునేలా మాత్రం వారిని ఎంకరేజ్ చేయద్దు. కంప్యూటర్ గేమ్స్ ఎప్పుడైనా ఆడుకుంటే ఫరవాలేదు కానీ, వారికి శారీరక వ్యాయామం, ఉత్సాహం కావాలంటే మాత్రం ఆడుకోవడాన్ని ప్రోత్సహించండి. శారీరకంగా చురుగ్గా ఉంటే మానసికంగా కూడా చురుగ్గా ఉంటారు.

ఇచ్చి పుచ్చుకోవడం నేర్పండి

చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు పిల్లలకు ఆత్మాభిమానంతో జీవించడం, పెద్దలకు గౌరవం ఇవ్వడం నేర్పించాలి. గౌరవం గానీ, ప్రేమ కానీ మనం ఇతరులకు ఇస్తేనే మనకు తిరిగి వస్తాయని చెప్పాలి. తద్వారా వారు భవిష్యత్తులో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడమే కాకుండా సమాజం పట్ల మంచి ప్రేమను కనబరుస్తారు. అదేవిధంగా తోటి పిల్లలతో వ్యత్యాసాలు చూసుకోకుండా సమానంగా నడుచుకునే విధంగా విలువలతో జీవించడం నేర్పాలి. సాధారణంగా చాలామంది పిల్లలు మనం చెప్పే మాటలు వినరు, కానీ మనం చేసేవి చూసి అలానే చేస్తారు. అందువల్ల మన పిల్లల ముందు మన నడవడిక బాగుండాలని గుర్తుంచుకోండి.

రుచికే కాదు.. ఆరోగ్యానికి కూడా...

ఆరోగ్యాన్ని ఇచ్చే పండ్లు అంటే ఎక్కువ మంది యాపిల్ గురించి మాట్లాడతారు. కానీ దానితో సమానంగా దానిమ్మ కూడా ఆరోగ్యాన్ని ఇస్తుందనే విషయం చాలా తక్కువ మందికే తెలుసు. దీనివల్ల బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

చాట్, స్వీట్ డిష్, ఐస్ క్రీమ్, స్మూతీస్ ఇలా ఏది చేసినా దాని మీద తప్పనిసరిగా గార్నిషింగ్ కోసం దానిమ్మ గింజలను ఉపయోగిస్తారు. ఎందుకంటే ఏదోవిధంగా దానిమ్మను తీసుకోవడం వల్ల ధమనుల్లో కొవ్వు చేరకుండా చేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని అనుకుంటే తప్పకుండా దానిమ్మ పండ్లు తినడం అలవాటు చేసుకోండి.



- దానిమ్మ మెదడు ఆరోగ్యానికి చాలా మంచిది. రోగనిరోధక శక్తిని ఇస్తుంది. పోషకాలతో నిండి ఉంటుంది. తక్కువ కేలరీలు, కొవ్వు ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉన్నాయి.
- యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వ్యాధులను నిరోధించేందుకు సహాయపడతాయి. వృద్ధాప్యానికి దారి తీసే ఫ్రీ రాడికల్స్ నుంచి మనలని రక్షిస్తుంది. చెడు కొలెస్ట్రాల్ ని తగ్గిస్తుంది. శరీరం నుంచి అదనపు కొవ్వుని తొలగించడంలో సహాయపడుతుంది.
- రక్తాన్ని పలుచన చేసి రక్తం గడ్డకట్టకుండా నిరోధిస్తుంది. శరీరంలోని ఆక్సిజన్ స్థాయిలను మెరుగుపరిచి రక్తప్రసరణకి ఎటువంటి హాని కలగకుండా చూస్తుంది.
- జీర్ణ ప్రక్రియ సజావుగా జరిగేలా చూస్తుంది. ప్రతిరోజు ఒక దానిమ్మ పండు తింటే మలబద్ధకం సమస్య దరి చేరదు.
- దానిమ్మలోని గుణాలు ధమనుల్లో ఆక్సీకరణ ఒత్తిడిని, వాపును తగ్గిస్తాయి. దానిమ్మ రక్తపోటుని అదుపులో ఉంచుతుంది. గుండె పోటు, స్ట్రోక్ రాకుండా అడ్డుకుంటుంది.
- అధిక రక్తపోటుతో బాధపడే వాళ్ళు కనీసం మూడు నెలల పాటు ప్రతి రోజు మూడు దానిమ్మ పండ్లు తింటే చాలా మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కార్డియో వాస్కులర్ డిసీజ్ బారిన పడకుండా కాపాడుతుంది.
- రక్తహీనత సమస్య ఉన్న వాళ్ళు మందులు వాడే ముందు రోజూ దానిమ్మను తిని చూడటం ఉత్తమం. ఎందుకంటే దానిమ్మ ఎర్ర రక్తకణాల సంఖ్యను పెంచుతుంది.
- దానిమ్మ పండులోనే కాదు తొక్కల్లో కూడా విటమిన్ ఏ, సి, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, విటమిన్ బి6 పోషకాలు ఉన్నాయి. అందుకే దానిమ్మ గింజలు తిన్నతర్వాత తొక్కలు పడేయకుండా వాటిని ఎండబెట్టి పొడి చేసుకుని పెట్టుకోండి.
- కీళ్ల నొప్పులతో బాధపడే వాళ్ళు దానిమ్మ తొక్కలు ఎండబెట్టుకుని చేసుకున్న పొడిని నీళ్ళలో వేసి మరిగించి తాగితే మంచిది.
- దానిమ్మ తొక్కల పొడిని వేడి నీళ్ళలో కలిపి పేస్ట్ లా చేసుకుని ముఖానికి రాసుకుంటే మొటిమల సమస్యను అధిగమించవచ్చు.

● ఆరోగ్యాహారం

ఒత్తిడిని తినేయండి



మానసిక ఆరోగ్యం బాగుండాలంటే కొన్ని రకాల పోషకాలను తప్పకుండా తీసుకోవాలి. దానికి పిల్లలు, పెద్దలు అనేం లేదు. ఈ కింద ఇచ్చిన కొన్ని పదార్థాలలో మానసికంగా చురుగ్గా ఉంచే కొన్ని కారకాలు ఉన్నట్లు పోషకాహార నిపుణులు గుర్తించారు. వాటిని తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గి చురుగ్గా ఉండగలం. అవేమిటో చూద్దాం.

మానసిక ఆందోళన, ఒత్తిడి, కుంగుబాటు, డిప్రెషన్.. పేరు ఏదైనా వచ్చిన తర్వాత బాధ పడేకంటే రాకుండా చూసుకోవడం చాలా మేలు. ఈ కింద ఇచ్చిన కొన్ని పదార్థాలు తీసుకోండి. శారీరకంగానే కాదు, మానసికంగానూ ఆరోగ్యంగా ఉండండి.



పొద్దుతిరుగుడు గింజలు... వీటిలో విటమిన్ 'ఇ' అధిక స్థాయిలో ఉంటుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సమర్థంగా పనిచేస్తుంది.



వెల్లుల్లి... వెల్లుల్లిలో సల్ఫర్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి గ్లటాథియోన్ అనే యాంటీ ఆక్సిడెంట్‌ను ఉత్పత్తిచేస్తాయి. ఇది ఒత్తిడిని ఎదుర్కొనే రక్షణ ఛత్రంలో మొదటి మూలకంగా పనిచేస్తుంది.

గుడ్లు... గుడ్లలో పోషకాలు పుష్కలం అనే విషయం తెలిసిందే. వీటిలో విటమిన్లు, మినరల్స్, అమైనో ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్స్ సంతృప్త స్థాయిలో లభిస్తాయి. ప్రత్యేకంగా ఇందులో చోలిన్ అనే పోషకం పుష్కలంగా ఉంటుంది. ఇది మెదడు ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుందని, అలాగే ఒత్తిడి నివారణకు సమర్థంగా పనిచేస్తుందని వైద్యులు గుర్తించారు.

నువ్వులు... నువ్వులతో తయారుచేసే పదార్థాలలో ఎల్-ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం పాళ్లు ఎక్కువ. ఇది మనసును ఉల్లాసంగా ఉంచే డోపమైన్, సెరటోనిన్ ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది. అలాగే ఒత్తిడిని తగ్గించేందుకు తోడ్పడుతుంది. 25 మంది యువకులకు నాలుగు రోజుల పాటు నువ్వుల ఉండలను తినిపించి పరిశీలించినప్పుడు వారిలో ఆందోళన, ఒత్తిడి స్థాయిలు గణనీయంగా తగ్గినట్లు ఓ సర్వేలో తేలింది.



నువ్వులతో రకరకాల స్నాక్స్ తయారు చేసుకోవచ్చు. ఏదైనా పదార్థాన్ని రుచిగా ఉండేలా తయారు చేసుకోవడం వల్ల వాటిని తినే విధంగా మెదడు కూడా మనల్ని ప్రోత్సహిస్తుంది.

సినిమా

నాటు నాటు ప్రజల పాట

\- రామ్‌చరణ్

లాస్ ఏంజిల్స్‌లో ఇటీవల జరిగిన 95వ ఆస్కార్ అవార్డు ప్రదానోత్సవంలో 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాటకు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో సంగీతదర్శకుడు కీరవాణి, రచయిత చంద్రబోస్ ఆస్కార్ అవార్డులను అందుకున్న విషయం తెలిసిందే. ఈ అవార్డు వేడుక కోసం లాస్ ఏంజిల్స్ వెళ్లిన దర్శకుడు రాజమౌళి, ఆయన సతీమణి, కాస్ట్యూమ్ డిజైనర్ రమా రాజమౌళి, తనయుడు కార్తికేయ, సంగీత దర్శకుడు కీరవాణి, గాయకుడు కాలభైరవ, నటుడు శ్రీ సింహా తదితరులు శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. కాగా ఆస్కార్ అవార్డు సాధించడం గురించి రాజమౌళిని స్పందించమని విలేకర్లు అడగ్గా.. ఆయన 'జైహింద్' అన్నారు. ఇక ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు లాస్ ఏంజిల్స్ నుంచి శుక్రవారం ఢిల్లీ చేరుకున్నారు రామ్‌చరణ్. 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు రావడం గురించి స్పందిస్తూ– ''భారతీయ అభిమానులందరూ 'ఆర్ఆర్ఆర్'ను ఆదరించారు. 'నాటు నాటు' పాటను సూపర్ హిట్ చేశారు. 'నాటు నాటు' పాట మాది కాదు.. ప్రజల పాట. ప్రేక్షకుల అభిమానమే ఆస్కార్‌కి దారి వేసింది, అవార్డు వరించేలా చేసింది. వారితో పాటు కీరవాణి, చంద్రబోస్, రాజమౌళిగార్లకి కూడా థ్యాంక్స్ చెబుతున్నాను'' అని పేర్కొన్నారు రామ్‌చరణ్.


● రామ్‌చరణ్

తప్పుగా అర్థం చేసుకున్నారు: కాలభైరవ

ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటను పాడినందుకు ఆనందంగా ఉందంటూ ఓ నోట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు కాలభైరవ. ''ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటను ప్రదర్శించినందుకు గర్వపడుతున్నాను. నాకు ఈ విలువైన క్షణాలు దక్కడానికి రాజమౌళి బాబా, నాన్న (కీరవాణి), కొరియోగ్రాఫర్ ప్రేమ్‌రక్షిత్ మాస్టర్, కార్తికేయ అన్న, అమ్మ, పెద్దమ్మ... ఇలా మరి కొందరు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కారణమయ్యారు. యూఎస్ టీమ్ కూడా హెల్ప్ చేసింది. వీరి సహకారం, ప్రోత్సాహం లేకపోతే ఆస్కార్ వేదికపై నా ప్రదర్శన వీలయ్యేది కాదు'' అని ఆ నోట్‌లో చెప్పుకొచ్చారు కాలభైరవ. కాగా ఎన్టీఆర్, రామ్‌చరణ్‌ల పేర్లను కాలభైరవ ప్రస్తావించకపోవడంతో ఈ ఇద్దరి హీరోల అభిమానులు, కొందరు నెటిజన్లు తప్పుబడుతూ కామెంట్స్ చేశారు. దీంతో ఈ విషయంపై సోషల్ మీడియా వేదికగా కాలభైరవ స్పందించారు. ''ఆర్ఆర్ఆర్' సినిమా, ఇందులోని 'నాటు నాటు' పాట సక్సెస్‌కు తారక్ అన్న, చరణ్ అన్న ముఖ్యులు. అందులో సందేహం లేదు. అయితే నేను ఆస్కార్ వేదికపై నా ప్రదర్శనకు సంబంధించిన విషయం గురించి మాత్రమే ఆ నోట్‌లో ప్రస్తావించాను. అది తప్పుగా అర్థమైనట్లుంది. అయినప్పటికీ నా మాటలను క్షమించమని అడుగుతున్నాను'' అని కాలభైరవ పేర్కొన్నారు.


● కాలభైరవ

ఆస్కార్ వేదికపై షాక్ అయ్యా: గునీత్ మోంగా

'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కు డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్ విభాగంలో ఆస్కార్ అవార్డు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ డాక్యుమెంటరీ నిర్మాత గునీత్ మోంగా శుక్రవారం ముంబై చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. మామూలుగా ఆస్కార్ అవార్డు అందుకున్నవారు తమ యాక్సెప్టెన్సీ స్పీచ్‌ను 45 సెకన్లలో పూర్తి చేయాలి. 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' దర్శకురాలు కార్తీకి అన్ని సెకన్లలోనే పూర్తి చేశారు. కానీ నిర్మాత గునీత్ మోంగా కాస్త ఎక్కువ టైమ్ తీసుకుని మాట్లాడుతుండగా స్పీచ్ ఆపాలన్నట్లుగా వెనకనుంచి మ్యూజిక్ ప్లే చేశారు ఆస్కార్ నిర్వాహకులు. అలాగని నిర్వాహకులు ఈ 45 సెకన్ల నియమంలో కఠినంగా ఏమీ లేరు. బెస్ట్ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో ఆస్కార్ అవార్డు గెల్చుకున్న చార్లీ మాక్సే, మ్యాథ్యూ ఫ్రాండ్‌లు 45 సెకన్ల కన్నా ఎక్కువగా మాట్లాడినా, నిర్వాహకులు అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ఈ విషయంపై గునీత్ మోంగా స్పందించారు. ''ఇండియాకు తొలి ఆస్కార్ అవార్డును సాధించామనే గొప్ప విషయం గురించి చాలా మాట్లాడాలనుకున్నాను. కానీ నా స్పీచ్‌ను కట్ చేశారు. షాక్ అయ్యాను. ఇండియా తరఫున నేను మాట్లాడే అవకాశాన్ని నా నుంచి ఎవరో లాగేసుకున్నట్లుగా అనిపించింది. నేను మళ్లీ ఆస్కార్‌కు వెళతాను. అప్పుడు తప్పకుండా నా గొంతు మళ్లీ వినిపిస్తాను'' అని పేర్కొన్నారు గునీత్.


● గునీత్ మోంగా

ఆర్ఆర్ఆర్... నెంబర్ 3

భారతీయ చిత్రాల్లో అత్యధిక గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిన జాబితాలో 'ఆర్ఆర్ఆర్' మూడోస్థానంలో నిలిచింది. ఇదివరకు ఈ స్థానంలో 'కేజీఎఫ్: చాప్టర్ 2' ఉండేది. తొలుత అత్యధిక గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిన ఇండియన్ చిత్రాల జాబితాలో వరుసగా 'దంగల్' (దాదాపు రూ. 1900 కోట్లు), 'బాహుబలి: ది కన్‌క్లూజన్'(రూ. 1800 కోట్లు), 'కేజీఎఫ్: చాప్టర్ 2' (రూ. 1230 కోట్లు), 'ఆర్ఆర్ఆర్' (దాదాపు రూ. 1150 కోట్లు), 'పఠాన్' (రూ. 1050 కోట్లు.. ఇంకా ప్రదర్శితమవుతోంది) ఉన్నాయి. అయితే గత ఏడాది అక్టోబరులో జపాన్‌లో విడుదలైన 'ఆర్ఆర్ఆర్' ఇప్పటికీ ప్రదర్శితమవుతోంది. జపాన్ బాక్సాఫీస్ వద్ద 'ఆర్ఆర్ఆర్' ఇప్పటివరకు రూ. 80 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. అలాగే 'ఆస్కార్' ప్రచారంలో భాగంగా అమెరికాలో ఈ నెల 3న, తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 10న 'ఆర్ఆర్ఆర్'ను రీ రిలీజ్ చేశారు. దీంతో మరికొన్ని కలెక్షన్స్ వచ్చాయి. ఈ వసూళ్లు మొత్తాన్ని కలిపితే 'కేజీఎఫ్: చాప్టర్ 2' గ్రాస్ కలెక్షన్స్‌ను 'ఆర్ఆర్ఆర్' దాటిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.


అందుకే విశ్వక్ డైరెక్షన్ మానేయాలి

\- ఎన్టీఆర్


● కరాటే రాజు, ఎన్టీఆర్, విశ్వక్‌సేన్, నివేదా పేతురాజ్


''సినిమా పట్ల విశ్వక్ సేన్‌కి ఎంతో పిచ్చి ఉంది. ఆ పిచ్చి తగ్గిపోకూడదు. ఇలాంటివాళ్లను ప్రోత్సహిస్తేనే పరిశ్రమ ఇంకా ముందుకెళుతుంది. 'దాస్ కా ధమ్కీ' హిట్ అవ్వాలి'' అని హీరో ఎన్టీఆర్ అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'దాస్ కా ధమ్కీ'. నివేదా పేతురాజ్ హీరోయిన్. కరాటే రాజు (విశ్వక్ సేన్ తండ్రి) నిర్మించిన 'దాస్ కా ధమ్కీ' ఈ నెల 22న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఎన్టీఆర్ మాట్లాడుతూ– ''ఒకే చట్రంలో ఇరుక్కుపోతున్నానని చాలా కాలం తర్వాత రియలైజ్ అయిన నేను, మీరు (అభిమానులు) కాలర్ ఎత్తుకునే సినిమాలు చేస్తానని మాట ఇచ్చాను.. ఆ మాట అన్నప్పుడే నటుడిగా నేను మళ్లీ పుట్టాను. వైవిధ్యమైన నటన కోసం నేను తాపత్రయపడుతున్నాను కాబట్టే మిమ్మల్ని కాలర్ ఎగరేసుకునేలా చేస్తున్నానని అనుకుంటున్నాను. విశ్వక్ కూడా ఒకే తరహా పాత్రల నుంచి బయటికొచ్చి, కొత్తగా చేస్తున్నాడు. 'దాస్ కా ధమ్కీ' బ్లాక్ బస్టర్ అవ్వాలి. ఆ తర్వాత తను దర్శకత్వం మానేయాలి. ఎందుకంటే కొత్త యువ దర్శకులకు నీలాంటి వాళ్లు అవకాశాలు ఇవ్వాలి. ప్రస్తుతం తెలుగు సినిమా ప్రపంచ చిత్ర పటంలో ఆల్‌టైమ్ టాప్‌లో ఉంది. 'ఆర్ఆర్ఆర్' ఈ రోజు ప్రపంచ చిత్రపటంలో నిలబడిందంటే, ఆస్కార్ అవార్డుని సొంతం చేసుకుందంటే దానికి మా యూనిట్‌తో పాటు యావత్ తెలుగు, భారతదేశ చిత్రపరిశ్రమ, ప్రేక్షక దేవుళ్లు కూడా కారణం. కీరవాణి, చంద్రబోస్‌గార్లు ఆస్కార్ అవార్డు తీసుకుంటున్నప్పుడు నాకు వాళ్లు కనిపించలేదు.. ఇద్దరు భారతీయులు కనిపించారు.. ఇద్దరు తెలుగువాళ్లు కనిపించారు'' అన్నారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''ఇండియాలో బెస్ట్ యాక్టర్ ఎవరంటే ఎన్టీఆర్ అన్న అని నేను ఎప్పుడో చెప్పాను. నా సినిమాని ప్రోత్సహించేందుకు ఎన్టీఆర్ వచ్చాడు. ఆయన రాకతో నా సినిమా బ్లాక్‌బస్టర్ స్టార్ట్ అయిపోయినట్లే''అన్నారు. ''ఫలక్‌నుమా దాస్' తీసినప్పుడు మా అబ్బాయి విశ్వక్ ఎవరికీ తెలియదు. ఎంతో పబ్లిసిటీ చేసి, సినిమా విడుదలకి ముందే స్టార్‌డమ్ తెచ్చుకున్నాడు. 'దాస్ కా ధమ్కీ' కోసం 15 నెలలు కష్టపడ్డాడు'' అన్నారు కరాటే రాజు.

మా నమ్మకం నిజమైంది


● హర్షిత్ రెడ్డి, హన్షిత

''**ప్ర**తి ఊరిలో, ప్రతి కుటుంబంలో జరిగే కథే 'బలగం'. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని వేణు కథ చెప్పినప్పుడే నమ్మాం. అది నిజమైంది'' అని నిర్మాతలు హర్షిత్ రెడ్డి, హన్షిత ('దిల్' రాజు కుమార్తె) అన్నారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా వేణు ఎల్దండి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బలగం'. 'దిల్' రాజు సారథ్యంలో శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా హన్షిత మాట్లాడుతూ– ''శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై నాన్నగారు ('దిల్' రాజు) తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో భారీ సినిమాలు నిర్మిస్తున్నారు. ప్రతిభ ఉన్నవారిని ప్రోత్సహించడంతో పాటు ప్రయోగాత్మక, వైవిధ్యమైన కథలను చిన్న సినిమాల ద్వారా ప్రేక్షకులకు అందివ్వాలనే 'దిల్' రాజు ప్రొడక్షన్ బ్యానర్‌ని స్థాపించాం. 'బలగం'ని ప్రేక్షకులతో కలిసి థియేటర్‌లో చూశాక నాన్నగారు 'మీరు ఎన్ని సినిమాలు తీసినా 'బలగం' మాత్రం గుర్తుండిపోతుంది' అని అభినందించారు'' అన్నారు. హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ– ''బలగం' చిత్రానికి రోజురోజుకు వసూళ్లు పెరుగుతున్నాయి. మా తొలి సినిమాకే ఇంత మంచి పేరు రావడం హ్యాపీ. ప్రస్తుతం యష్ మాస్టర్ హీరోగా శశి అనే కొత్త డైరెక్టర్‌తో ఓ సినిమా నిర్మిస్తున్నాం'' అన్నారు.

బికిలి అంటే..?


● విజయ్ ఆంటోని


'వీళ్లే బికిలి బికిలి బిలి బిలి.. బికిలి బికిలి బిలి బిలి...' అంటూ పాడారు విజయ్ ఆంటోని. 2016లో విజయ్ ఆంటోని హీరోగా రూపొందిన తమిళ చిత్రం 'పిచ్చైక్కారన్' తెలుగులో 'బిచ్చగాడు'గా విడుదలై ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. శశి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఇప్పుడు 'బిచ్చగాడు'కు సీక్వెల్‌గా 'బిచ్చగాడు 2' వస్తోంది. విజయ్ ఆంటోని నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై ఫాతిమా విజయ్ ఆంటోని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'బికిలి' అనే పాట మ్యూజిక్ వీడియోను రిలీజ్ చేశారు. భాష్యశ్రీ రాసిన ఈ పాటకు మ్యూజిక్ కంపోజింగ్, సింగర్ విజయ్ ఆంటోనీయే కావడం విశేషం. ఇక పేదవాళ్ల పేదరికాన్ని ఉపయోగించుకుని తన ధనబలంతో వారిని బానిసలుగా చేసి, డబ్బు ఉందన్న అహంకారంతో తిరిగే వాళ్లకు తాను బికిలీ అని పేరు పెట్టినట్లు విజయ్ ఆంటోని పేర్కొన్నారు.

కామెడీ.. యాక్షన్


● యోగేశ్వర్, సుమన్, జీవీవీ గిరి

యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పరారీ'. గాలి ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌లో కాంగ్రెస్ లీడర్ అంజన్ కుమార్ యాదవ్, నటుడు సుమన్, నిర్మాత ప్రసన్న కుమార్ ట్రైలర్‌ను విడుదల చేశారు. డైరెక్టర్ చంద్ర మహేష్, నిర్మాతలు టి. రామసత్యనారాయణ, ప్రతాని రామకృష్ణ గౌడ్ థియేట్రికల్ ప్రోమోను, నటి కవిత సాంగ్ ప్రోమోను రిలీజ్ చేశారు. ''మంచి కథ, కథనాలతో నిర్మించిన మా 'పరారీ' అందర్నీ మెప్పిస్తుంది'' అన్నారు జీవీవీ గిరి. ఈ చిత్రానికి సంగీతం: మహిత్ నారాయణ్.

వైరానికి సిద్ధం


● మోనాల్, ప్రణమ్

నటుడు దేవరాజ్ తనయుడు ప్రణమ్ దేవరాజ్ హీరోగా నటించిన చిత్రం 'వైరం'. సాయి శివం జంపాన దర్శకత్వం వహించిన ఈ మూవీలో మోనాల్ హీరోయిన్. యువాన్స్ నాయుడు సమర్పణలో తెలుగు, కన్నడ భాషల్లో జె. మల్లికార్జున నిర్మించారు. నటులు దేవరాజ్, చంద్ర దేవరాజ్ శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి బ్యానర్ లోగోను లాంచ్ చేయగా, నటులు బెనర్జీ, కాశీ విశ్వనాథ్ 'వైరం' టీజర్‌ను విడుదల చేశారు. దేవరాజ్ మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకులు నన్నెంతో ఆదరించారు. హీరోగా వస్తున్న నా కుమారుడు ప్రణమ్‌ని కూడా ఆదరించాలి'' అన్నారు. ''త్వరలో మా సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు జె. మల్లికార్జున. ''ఈ సినిమా బాగా వచ్చింది'' అన్నారు సాయి శివన్ జంపాన. ఈ చిత్రానికి సహనిర్మాత: శీలం త్రివిక్రమ్ రావు, అరిపిరాల కళ్యాణ్ శాస్త్రి, సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: సామల భాస్కర్.